# ఉపనిషత్ వాహిని



భగవాన్ శ్రీ సత్యసాయిబాబా

శ్రీ సత్యసాయి

సాధనా ట్రస్టు

పబ్లికేషన్స్ విభాగం

# ఉపనిషత్ వాహిని

# Upanishad Vahini

## భగవాన్ శ్రీ సత్యసాయిబాబా

**శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం**

**ప్రశాంతి నిలయము పోస్టు: 515 134**

**అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా**

**ఎస్.టి.డి : 08555 ఐ.ఎస్.డి : 91-8555**

**టెలిఫోను : 287375 ఫ్యాక్స్ : 287236**

**ఇమెయిల్ enquiry@sssbpt.org వెబ్-సెట్టు www.sssbpt.org**

© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం

ప్రశాంతి నిలయం పోస్ట్ – 515 134, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ప్రచురణ సర్వహక్కులు శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం వారివే.

ప్రచురణాధికారమూ, ఇతర భాషలలోకి అనువదించు అధికారమూ అన్నియూ ప్రచురణ కర్తవే. ఈ పుస్తకమునకు సంబంధించిన ఏ భాగముకాని, పూర్తిగాకాని, చిత్రపటములుగాని, కళాకౌశల్యముగాని నకలు తీయరాదు. కన్వీనర్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం పోస్ట్ – 515134, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా, వారి లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమును ఇతర భాషలలోకి అనువదించరాదు. మరి ఏ ఇతర రూపములోనైనా, ఫోటోకాపీ, రికార్డింగ్ మరియు ఏ ఇతర సాధనమువలనగాని ఈ పుస్తకములోని ఏ భాగమునూ ఉపయోగించరాదు. గ్రంథసమీక్షకు మాత్రం ఈ నిషేధము వర్తించదు.

ఈ ఈ-బుక్ లైసెన్స్ మీకు మాత్రమే పరిమితం. ఈ పుస్తకాన్ని మీరు ఇతరులకు యివ్వటం కానీ, విక్రయించటం కానీ చేయకూడదని మనవి. ఈ పుస్తకాన్ని మీరు ఇతరులతో పంచుకోదలచుకున్నట్లయితే ఒక్కొక్కరికి ఒక్కొక్కటి చొప్పున దయచేసి అదనపు కాపీలను కొనుగోలు చేయగలరు. ఈ పుస్తకం రూపొందించటంలో ప్రచురణకర్త చేసిన కృషికి తగిన గౌరవం యిస్తున్నందుకు కృతజ్ఞతలు.

ప్రథమ ప్రచురణ: 27th January, 2014 (27/01/2014)

ISBN: 978-93-5069-157-1

Paperback ISBN: 978-81-7208-887-3

ప్రచురణ కర్త:

కన్వీనర్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం

ప్రశాంతి నిలయం పోస్టు: 515 134

ఎస్.టి.డి : 08555 ఐ.ఎస్.డి : 91-8555

టెలిఫోను : 287375 ఫ్యాక్స్ : 287236

**పంపకం చేయువారు :**

**Google Play Books**

# మనవి

స్వామి యొక్క సర్వజన సమాన ప్రేమను లోకమంతతట చాటుటకు, అట్టి ధర్మమును స్థాపన చేయుటకు ఒక మాసపత్రికను ప్రారంభము చేసుకొందుమనియూ, అందుకు శ్రీవారి ఆజ్ఞ కావలెననియూ, చాలకాలమునుండి భక్తులందరము భగవాన్ శ్రీ సత్యసాయి బాబాగారిని ప్రార్థించుచుంటిమి.

1958 మహాశివరాత్రి పర్వదినమున శ్రీవారి ఆశీర్వాదమున పత్రిక ప్రారంభమాయెను. దానికి ''సనాతన సారథి'' అని నామము కూడ శ్రీవారే పెట్టిరి. ధర్మస్థాపన చేసి లోకకల్యాణమును సాధించవలెననియూ, ప్రార్థన, భజన, నామస్మరణ జపధ్యానముల ద్వారా హృదయములను పరిశుభ్ర పరచి అందులో నివాసము చేయవలెననియు, శ్రీవారు ప్రసాదించిన వాక్కు ఈ నామమూలమున ధైర్యమిచ్చుచున్నది. శ్రీవారే ''ప్రేమవాహిని'', ''సందేహనివారిణి'', ''ప్రశాంతివాహిని'', ''ధ్యానవాహిని'', ''జ్ఞానవాహిని'', ''ధర్మవాహిని'' అను శీర్షికల క్రింద స్వయముగా వ్యాసములను వ్రాసి సనాతన సారథి రూపమున అమోఘమైన ఆశీర్వాదములను అందించుచున్నారు. వాటిని ఆంగ్లభాషయందు కూడ ఆయా మాసములందు ఆ ''సారథి'' యందే ప్రకటించుచున్నాము.

పవిత్రమైన ఈ ఉపదేశరత్నములను ఆశించుట భక్తకోటికి సహజము ఆ రత్నములకొరకే అనేకమంది భక్తులు గడిచిన సంచికలను కోరుచున్నారు. చందాదారులుకూడా స్వామి వ్యాసములన్నియు పుస్తకరూపమున నున్న చాల అనుకూలమని కోరుచున్నారు. కావున శ్రీవారు వెదజల్లుచుండిన లిఖిత రత్నములను ప్రత్యేకముగా విడదీసి తెలుగు, ఆంగ్లభాషలయందు పుస్తకములుగా ప్రకటించుచున్నాము.

భగవానుడే ఆధ్యాత్మికజ్ఞానమును ఈ గ్రంథములలో బోధించుచున్నారు. కావున వీటిని పఠించువారికి మోక్షశక్తి జనించి తప్పక ప్రబలమగును. భగవానుడు చూపించిన ప్రేమమార్గములను సాధనరూపమున అభ్యసించిన భగవదనుగ్రహమునకు పాత్రులగుదురనుటకు సందేహమే లేదు.

ఈ గ్రంథమును పఠించి, చూపిన క్రమముల ననుసరించి ప్రవర్తించిన వారికి తప్పక భగవానుని అనుగ్రహ ఆశీర్వాదమున్నూ, రక్షణ శిక్షణలను అనుభవించు అవకాశమున్నూ దొరకునని దృఢముగ గమనించవలెను.

ఎన్. కస్తూరి

సంపాదకులు — సనాతనసారథి



# విషయసూచిక


మనవి

1. జ్ఞానాదేవతుకైవల్యం

2. ఈశావాస్యోపనిషత్

3. కఠోపనిషత్

4. ముండకోపనిషత్

5. మాండుక్యోపనిషత్

6. బృహదారణ్యకోపనిషత్

7. ప్రశ్నోపనిషత్

8. కేనోపనిషత్

9. ఛాందోగ్యోపనిషత్

10. ఐతరేయోపనిషత్

11. తైత్తిరీయోపనిషత్

12. బ్రహ్మానుభవ ఉపనిషత్

# 1.

# జ్ఞానాదేవతుకెవ్వల్యం

మానవుడు పరబ్రహ్మ స్వరూపుడెనప్పటికి పంచ మహా భూతముల యొక్క గుణములతో కలసిమెలసియుండుటచే జీవుడనబడుచున్నాడు. ఆ జీవి పంచభూతములచే కలిసి యుండుటవలననే జనన, మరణ, సుఖ, దుఃఖ, పాప, పుణ్యములు కలుగుచూ, తలంచుచూ, భ్రమించుచున్నాడు. పంచభూతములకు దూరముగా నుండి వాటి నుండి విడుదల నొందుటే "కెవ్వల్య"మనియూ, "మోక్ష"మనియూ, "ముక్తి"అనియూ అనేక నామములతో పిలువబడుచున్నది. మూడునూ ఒక్కటియే! నామములు వేరు. పంచ భూతములతో కలసి యుండుటవలన, పంచ భూతములచే నిర్మింపబడిన జీవుల చేతను, ధనాది వస్తు వాహనముల చేతను భయమొందుచున్నాడు. ఒక్కొక్క సమయమందు వాటిపై మోహముంచి, వాటిని పొందుటకె తపించుచున్నాడు. మరొకపుడు వాటినే ద్వేషించి నిశ్చింతగా ఉంటున్నాడు.

## అన్నింటికి మూలస్థానం పరమాత్మయే!

జీవికి ఆధారము భూమి; దానికి ఆధారము జలము; దానికి జన్మస్థానము అగ్ని; అగ్ని వాయువునుండి; వాయువు ఆకాశమునుండి; ఆకాశము ప్రకృతినుండి; అట్టి మూలప్రకృతి పరమాత్మనుండీ, కాన అన్నింటికినీ మూలస్థానము పరమాత్మనే!

అట్టి మూలస్థానమెన పరమాత్మను చేరవలెనన్న పంచభూతములలో పడిన జీవి, నిత్యానిత్య విచారణచేతను, అభ్యాస వెరాగ్యములచేతను ఒక్కొక్క భూతమును క్రమముగా దాటి తన మూలస్థానమెన పరబ్రహ్మమున కలసిపోవలెను. అట్టి వానినే జీవన్ముక్తుడందుము. నిత్యానిత్య విచారణకు, నిజరూప సందర్శనమునకు, ఆధారభూతములెనవే ఉపనిషత్తులు. ఉపనిషత్తులే వేదాంతములనబడును. ఇవి కేవలము జ్ఞానకాండమును బోధించును. జ్ఞానము వలననే ముక్తి లభించును. అందుకనే "జ్ఞానాదేవతు కెవ్వల్యం" అని ఉపనిషత్తే చెప్పింది.

"కాండత్రయాత్మకం వేదం" అన్నట్లు వేదమువలెనే ఉపనిషత్తులు కూడనూ కాండత్రయాత్మకమై యున్నవి. జ్ఞానకాండ, ఉపాసనాకాండ, కర్మకాండములు ఇందులో కూడనూ కలవు. ఈ మూడు పవిత్ర కాండములూ ఒక్కొక్క దృష్ట్యా, అద్వైత, ద్వైత విశిష్టాద్వైత మతాలను సమన్వయించుచున్నవి. "ఉపనిషత్"తో స్థితిరూప నిష్ఠను, "బ్రహ్మవిద్యయాం"తో నిధిధ్యాసమును, "యోగశాస్త్రము"తో మననమును గ్రహించవలెను. ఇన్నింటి మూలమున చేయునదేది? తెలిసికొనునదేది? అది తన నిజస్థితినే! తన స్వరూపమునకు ఏయే ప్రాప్తిని చేకూర్చునో, యెట్లు చేకూర్చునో సంపూర్ణ అర్థముతో చేరుటవలననే "ఉపనిషత్" అని పేరు వచ్చినది.

## అద్వైతామృతమే ఉపనిషత్సారం

అసలు ఉపనిషత్ యొక్క అర్థము కడుసారవంతము. "ఉప" అనగా సమీపములో, "ని" అనగా నిష్ఠతో శ్రవణము చేసినవారి అజ్ఞానమును శిథిలము చేసి, "షద్" అనగా పరమాత్మ ప్రాప్తిని చేకూర్చుట. అట్టి కారణములను బట్టి ఉపనిషత్తులని పేరు వచ్చినది. ఉపనిషత్ అంటే కేవలము విద్యను బోధించుటే కాక ఆ బోధించిన విద్యను ఆచరణలో పెట్టే ప్రక్రియను కూడా బోధించుచున్నది. ఏ కర్మ ఏ విధి ధర్మముగా చేయవలెనో అట్లు తెలుపుటయేకాక, ఏ కర్మ చేయదగినదో, ఏ కర్మ చేయరానిదో అను విషయమును కూడా తెలుపుచున్నది.

అసలు గీతను తీసికొన్న ఉపనిషత్ సారమే కదా! ఉపనిషత్ శ్రవణముద్వారా కలుగవలసిన ఫలితము గీతాబోధ ద్వారా అర్జునునకు కలిగినది. ఉపనిషత్‌లోని "తత్త్వమసి" గీతలో "పాండవానాం ధనంజయ" అను వాక్యముగా బోధింపబడినది. అనగా పాండవులలో ధనంజయుడవైన నీవే నేను అని కృష్ణపరమాత్మ జీవేశ్వర ఐక్యాన్ని తెలిపెను.

కాన గీత కానీ, ఉపనిషత్తులు కానీ అద్వైతామృతమే కాని ద్వైత, విశిష్టాద్వైతములు కావు. అల్పక్రిములను, అణువులను, సూర్యగోళములను పరిశీలించుటకు మానవ నేత్రములకు అట్టి శక్తి సామర్థ్యములు లేనందున టెలిస్కోపు, మైక్రోస్కోపు అను యంత్రములను ఏ రీతిగా సహాయకారిగా శాస్త్రజ్ఞులు ఉపయోగింతురో అటులనే నైతిక, ఆధ్యాత్మిక, ధర్మములను అనుసరించి చిత్తశుద్ధి కలిగిన మహనీయులు జ్ఞాన చక్షువుల ద్వారా పరమేశ్వరుని చూడగలుగుచున్నారు.

అల్ప క్రిములను, అణువస్తువులను చూడజాలని మానవ నేత్రములు యంత్రసహాయము ఆశించగా, సర్వవ్యాపియగు పరాత్పరుణ్ణి చూడగోరుటకు మంత్ర సహాయము ఆశించక ఎట్లు చూడగలరు? జ్ఞాననేత్రమును పొందుట సులభమైనది కాదు. దీనికి ప్రత్యేకాగ్రత యవసరము. ఏకాగ్రతను అలవఱచుకొనుటకు చిత్తశుద్ధి, నైతిక, ఆధ్యాత్మిక, వివేకము ముఖ్యము. సామాన్య మానవులకు ఇది అంత సులభము కాదు.

## ఉపనిషత్తులు అపౌరుషేయాలు

కానీ ఇతర జంతువులవలె కాక, మానవునకు ప్రత్యేక విజ్ఞానము పరమాత్ముడు ప్రసాదించినాడు. దానిని వృద్ధి చేసుకొనవలెను, ఆ విజ్ఞానము ద్వారా ప్రత్యగాత్మయను పరమేశ్వరుని కనుగొనవలెను. అటుల చేయక భగవంతుడెక్కడున్నాడు? ఉండిన కనపడడెందులకు? అని వాదించు వారలను చూచిన చాలా విచారము కలుగును. అంతియే కాక వారి అజ్ఞానమును వారే వెల్లడి చేసుకొనుచున్నారే అని అనిపించును.

ఎ, బి, సి, డిలు నేర్చుకొనకుండా బి.ఎ.లు, ఎం.ఎ.లు ప్యాసు కావలెనను వారి అజ్ఞానము ఎట్టిదో, ఏ సాధనా చేయక, భగవంతుడు కనిపించలేదే? అని వాదన చేయువారి అజ్ఞానమూ అట్టిదే! చివరకు నైతిక ధర్మమునైననూ పాటించక ఈశ్వరుణ్ణి చూడవలెననుట, అమాయకుడనే చెప్పవలెను.

ఆధ్యాత్మిక సాధన, పవిత్రమైన శాస్త్రముపై ఆధారపడియున్నది. అది తుటిలో సంపాదించునది కాదు. మాటలతో రాదు. సకల శాస్త్రములయొక్క ముఖ్య సూత్రములు వాని సారములు ఉపనిషత్తులలో ఇమిడియున్నవి. అందువలననే అన్నింటికిని ఉపనిషత్తులు ప్రమాణములైనవి. ఆ పవిత్ర ఉపనిషత్తులు మానవులచేత వ్రాయబడనివి అనగా (అపౌరుషేయములు) ఆదికాలమునుండి వచ్చునవి ఆయిన వేదముల ఉపాంగములే. అనగా వేదస్వరూపమునందలి కొన్ని అంగములు, ఇట్టి అనేక అంగములతో విరాజిల్లునదే వేదము. కాన ఇది ఉపనిషత్తులకు ఆధారమూ, ప్రమాణమూ వేదము. ఎట్లన వేదమును అనంతములైనను, ఇప్పటికి మిగిలినవి ఆచరణలో ఉన్నవి నాలుగే! అవి ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములు.

అట్టి ఒక్కొక్క వేదమునుండి అనేక ఉపనిషత్తులుగా విభజించిరి. అట్లు విభజించినవి మొత్తము (1180) వెయిన్ని నూటా ఎనుబది ఉపనిషత్తులు కలవు. కానీ కాల మార్పు చేత ఉపనిషత్తులు క్రమేణా తరుగుతూ వచ్చి (108) నూటయెనిమిదికి దిగినవి. మిగిలినవి కనిపించకున్నవి. వానిలోనా నేటి ఆచరణలో నున్నవి విచారించిన పది మాత్రమే తేలినవి. మిగిలినవి నామములు, తప్ప నామిని పొందలేకున్నవి పాపము.

ఇందులో ఏ యే వేదమునకు ఎన్నెన్ని ఉపనిషత్తులో వ్యాసమహర్షి విభజించెను శుక్లయజుర్వేదము నుండి మాండూక్య ఉపనిషత్తు వ్రాయు కాలమునకు ఋగ్వేదమునకు ఇరువది ఒక్క (21) శాఖలు, ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క ఉపనిషత్తును; అనగా ఇరువది ఒక్క (21) ఉపనిషత్తులను; యజుర్వేదమునకు 109 శాఖలును, అందుకూడా ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క ఉపనిషత్ అనగా నూటతొమ్మిది ఉపనిషత్తులును. అధర్వణ వేదమునకు ఏబది(50) శాఖలు కనుక దానియందును యేబది ఉపనిషత్తులును, సామ వేదమునకు వేయి (1000) శాఖలు కనుక ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క ఉపనిషత్తునూ, ఈ రీతిగా నాలుగు వేదములకూ ఎన్ని శాఖలో అన్ని ఉపనిషత్తులుగా విభజింపబడినవి. అన్నియూ కలిపి వేయి నూట ఎనుబది (1108) ఉపనిషత్తులు కలవు.

## ఇప్పుడమలులో నున్నవి 108 ఉపనిషత్తులే!

నేటికి అవి అన్నియు మరుగుపడి సర్వ ఉపనిషత్సారమునూ చేర్చి శంకరులవారు పదిగా ఆచరణకు నిలిపిరి. ఇపుడూ ఆ దశోపనిషత్తుల ఆధారముతోనే ఈ ధర నిలిచియున్నది. అవి కూడా ఏనాడు మరుగు పడి ప్రళయము సంభవించునో అను భయము ఆస్తికులకూ, వేదపండితులకూ లేక పోలేదు. కానీ, అట్లు ఏనాడూ చేయడు పరమాత్మ; అందు నిమిత్తమే భగవంతుడు అనేక రూపములతో అవతరించి వేదములనూ, ధర్మములనూ ఉద్ధరించుచున్నాడు. కాన ఆస్తికులకు అట్టి భయము అవసరము లేదు. వేదమునకు హాని రాదు. కనుక ఈ దశోపనిషత్తులనైనా లోకమునకు అందించుటకు పండితులు, ఆస్తికులు కంకణము కట్టవలెను. అవియే ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యము లనబడునవి.

మిగిలిన తొంబది ఎనిమిది ఉపనిషత్తులు ఏవనగా బ్రహ్మ, కైవల్య, శ్వేతాశ్వ, జాబాలి, హంస, గర్భ, అరుణి, పరమహంస, అమృతనాద, నారాయణి, అమృతబిందు, అమృతశిఖ, అధర్వశిర, కాశీతార, మైత్రాయిణి, నృసింహతాపిని, బృహజ్జాబాల, మైత్రేయి, కాలాగ్ని రుద్ర, సులభ, మాంత్రిక, క్షితి, నిరాలంబ, సర్వహర, వజ్రసూచిక, శుభరహస్య, తేజోబిందు, నాదబిందు, ధ్యానబిందు, బ్రహ్మవిద్య, ఆత్మబోధక, యోగతత్త్వ, నారదపరివ్రాజక, బ్రాహ్మణ, సీత, యోగచూడామణి, నిర్వాణ, మండల, దక్షిణామూర్తి, స్కంధ, శరభ, అద్వైతతారక, మహానారాయణ, సౌభాగ్యలక్ష్మి, సరస్వతీ రహస్య, ముక్తిక, బావరిచ, రామతపన, రామ రహస్య, ముద్గలి, వాసుదేవ, పింగళ, శాండిల్య, మహా, భిక్షుక, యోగశిక్ష, సన్యాస, తురియాతీత, పరమహంస పరివ్రాజక, అవ్యక్త, నృశింహ, అక్షమాలిక, అన్నపూర్ణ, ఏకాక్షర, అక్షిక, అధ్యాత్మ, సూర్య, కుండికాఖ్య, ఆత్మ, సావిత్రి, పరబ్రహ్మ, పాశుపత, త్రిపురతపన, అవధూత, త్రిపుర, దేవీ, భావన, కథ, యోగకుండలి, రుద్ర హృదయ, రుద్రాక్ష, భస్మ దర్శన, గణపతి, తాహశర, మహావాక్య, పంచ బ్రహ్మ, గోపాల తపిని, ప్రాణాగ్ని హోత్ర, గరుడ, కృష్ణ, దత్తాత్రేయ, వరాహక, యాజ్ఞవల్క్య, సత్యయాయన, హయగ్రీవ, కలిసంతరణ ఇంకనూ అనేకములున్నవి కానీ "వినియోగములేని విందుకు విస్తర్ల చేటు" అన్నట్లు నేడు ఆచరణలో లేని వాటిని అందించిన అర్థము చేసికొనలేరు. ఊరక వర్ణించిన కాలము వృథా. తరించువారలకు ఒక్కటి చాలు. అనుభవించనివారికి అన్నీ ఒక్కటే, సారము, తినరు, భారము దింపరు.

## వేదోపనిషత్తులే సనాతన మతములు

అసలు ఈ ఉపనిషత్తుల నుండే భూగోళము, జ్యోతిష్య, అర్థ శాస్త్రములునూ, స్కంధ, శివ, గరుడ మున్నగు 18 పురాణములునూ, తాంత్రిక, మాంత్రిక, భక్తి, జ్ఞాన, కర్మయోగములునూ మహా ఋషులచే లోకమునకు అందింపబడినవి. వేదోపనిషత్తులే సనాతన మతములు.

ఇందులో ఒక విచిత్రము, ఇతర మతములవలె మన భారతదేశమున మతస్థాపకులు కనిపించరు. ఆ కనిపించని మత గురువే; స్థాపకుడే; జ్ఞానస్వరూపుడగు ఈశ్వరుడు. అతడే మన ప్రవక్త. అతని అనుగ్రహమును పొంది అతని అంశవలె ఐక్యమైన మహాఋషులే మన ప్రవక్తలు. కాని మానవ నైతిక ధర్మములు క్షీణించుట చేతనే, మన భారత దేశమున అనేకచోట్ల ఈశ్వరుడు మానవరూపమున ప్రవక్తగా నుద్భవించుచున్నాడు. ఈ సత్య జ్ఞానమును మానవుడు ఉపనిషత్తుల ద్వారానే తెలిసికొన సాధ్యమగును.



# 2.

## ఈశావాస్యోపనిషత్

లోకోద్ధారకుడైన పరమాత్మ లోక కల్యాణ నిమిత్తమై హిరణ్యగర్భుని ద్వారా వేదములను అందించెను. ఆ పవిత్ర పరమాత్మ ప్రసాదమైన వేదములను హిరణ్యగర్భుడు తన మానస పుత్రులైన అత్రి, మరీచి మొదలగు పదిమందికి బోధించెను. వారినుండి శిష్య ప్రశిష్య పారంపర్యముగా వేదములన్నియూ లోకమున ప్రసిద్ధి గాంచెను.

ఇట్లు కాలము గడచుచూ, యుగములు నడచుచూ, జగములు కదలుచూ వచ్చుచుండగా కొన్ని వేదములు మరుగుపడుచు, మరికొన్ని కఠినమగుచు, ఇంకనూ కొన్ని వదిలివేయుచూ కడకు నాలుగు మాత్రము నేటికి మన అందుబాటుకు మిగిలియున్నవి. ఆ మిగిలిన నాలుగు వేదములను ద్వాపర యుగమందు వేద విస్తరణ కర్తలలో అగ్రగణ్యుడు, మహా ఋషి అయిన వేద వ్యాసులవారు తన శిష్యులకు బోధించెను.

ఈ విధముగా వ్యాసులవారు వేదాధ్యయనము చేయుచుండగా శిష్యులలో ఒకడైన యాజ్ఞవల్క్యుడను అతను గురువుగారి ఆగ్రహమునకు గురియయ్యెను. ఆ కారణముచే శిష్యుడు తన కలవడిన యజుర్వేదమును తిరిగి తన గురువైన వ్యాసులవారికి వాపసు ఇచ్చుటకై వెళ్ల గ్రక్కి, వేదనిధియగు సూర్యభగవానుని శరణు వేడెను. అదే సమయమున వేదాభిమానులగు మహాఋషులు తిత్తిరి పక్షి రూపమును ధరించి యాజ్ఞవల్క్యుడు వెళ్ళగ్రక్కిన ఆ వేదములను భుజించి వెళ్ళిరి. అందువలననే ఆ వేదశాఖకు "తైత్తరీయ"మని పేరు వచ్చినది.

ఆ తరువాత యాజ్ఞావల్క్యుని భక్తి శ్రద్ధలకు సూర్యభగవానుడు సంతసించి, వాజి రూపమున వచ్చి యజుర్గణములను యాజ్ఞవల్క్యునికి బోధించెను. ఆ యజుర్గణములనే యాజ్ఞవల్క్యుడు తన శిష్యులకు బోధించెను. ఈ కారణము చేతనే ఈ శాఖకు కూడనూ "వాజసనేయి" అని పేరు వచ్చెను. వేదవ్యాస ప్రవర్ధితమగు యజుర్వేదశాఖ కృష్ణ యజుర్వేదమనియు, యాజ్ఞవల్క్య సంవర్ధితమగు యజుశ్శాఖ శుక్ల యజుర్వేద మనియు పిలువబడినవి.

## బ్రహ్మాండమంతయు ఈశ్వర స్వరూపము

వీనియందలి మొదటి కొన్ని అధ్యాయములు కర్మకాండ సంబంధమగు మంత్రములును చివరి అధ్యాయములందు జ్ఞానకాండమందునూ సమన్వయింపబడినవి. ఈశావాస్యము జ్ఞానకాండములో చేరినది. ఈ ఉపనిషత్తునందు మొదటి మంత్రమునందు ఈశావాస్యమను రెండు పదములచేత ప్రారంభించుటచే ఈ ఉపనిషత్తుకు ఈశావాస్యమను పేరు వచ్చినది.

శ్లో|| ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్

తేన త్యక్తేన భుఞ్జీథ మాగృధః కస్య స్విద్ధనమ్||

నశ్వరభావముగల వస్తువులు ఏవేవి కలవో ఈ భూమియందు అవి అన్నియు స్వస్వరూపమగు భగవంతునిచే ఆచ్ఛాదింపబడియున్నవనియు, అట్టివానిని త్యాగబుద్ధితో అనుభవించవలెననియు, పరుల ధనమును ఏమాత్రము ఆశించకూడదనియూ, ధనము ఎవ్వరిదీ కాదనియు పై శ్లోకము తెలుపుచున్నది. అనగా బ్రహ్మాండమంతయూ ఈశ్వర స్వరూపము. ఈశ్వరుడుకానీ, అతనిచే శాసింపబడిన బ్రహ్మాండముకానీ, వేరువేరని, భావించుట భేదబుద్ధి, భ్రాంతి. కేవలము కల్పితము. నీటియందు కనిపించు ప్రతిబింబము ఎట్లు బింబము కంటే భిన్నముకాదో అటులనే ఈశ్వరుడునూ, అతనిచే శాసించబడిన బ్రహ్మాండమునూ వేరు కాదు, అని తలువవలెను.

## నిష్కామకర్మ చిత్తశుద్ధికి హేతువు

మానవునకు భ్రాంతి ఉన్నంతకాలము తనలో ఇమిడియున్న సత్యత్వమైన స్వరూప సందర్శనము నశించి, దురాలోచన, దుర్గుణ, దుష్కర్మలు విజృంభించును. ఎటులన, పరిమళ ద్రవ్యమైన చందనపు మొద్దును నీటిలో నానబెట్టిన కొంతకాలమునకది దుర్గంధముగా మారును. కానీ చందనపు మొద్దును నీటినుండి తీసివేసి సానమీద అరగదీసిన పూర్వముండు దుర్గంధము నశించి, దాని స్వభావమైన గంధము జనించును.

వేద శాస్త్ర ప్రమాణముల పురస్కరించుకొని ధర్మ, కర్మలద్వారా విచారణ సల్పిన దుర్గుణ, దురాచారములనబడు దుర్గంధముపోయి స్వచ్ఛమైన, స్వరూపమైన ఆత్మయొక్క సుగంధము పరిమళించును. అప్పుడు కర్తృత్వము, భోక్తృత్వములను ద్వైతభావములు వీడిపోవును. ఇదియే సర్వకర్మ సన్యాసమనబడుచున్నది. అందుకనే ఈ ఉపనిషత్తునందు సర్వకర్మ సన్యాసము మోక్షోపాయమని తెలుపబడుచున్నది. దారా, పుత్ర, ధనేషణ, పరిత్యాగ రూపమగు సన్యాసమునకు చిత్తశుద్ధి కావలెను. ఆ చిత్తశుద్ధి సిద్ధించుటకు మార్గము ఈ ఉపనిషత్తునందు రెండవ మంత్రమున చూపబడినది.

అనగా శాస్త్రవిహితమగు అగ్నిహోత్రాది కర్మలు ఆచరించవలెననియూ, మోక్షప్రాప్తికి కర్మాచరణకంటే వేరు మార్గము లేదనియూ, అట్టి విహిత కర్మలు ఆచరించునంతవరకు మానవునకు ఏ పాపమూ అంటదనియు తెలిసికొనవలెను. అనగా నిష్కామ కర్మ చిత్తశుద్ధికి హేతువనియు, కర్మకాండయందు మంచి శిక్షణ పొందిన వాని చిత్తము స్వచ్ఛముగా, అనగా మలినము లేక మూసలో కరిగించిన బంగారమువలే మాలిన్యము తొలగిపోయి నిర్మలమగును.

అట్టి నిర్మల చిత్తమే జ్ఞానము; నివృత్తి మార్గము. అంతియేకాక అదియే మోక్షమునకు కూడా కారణము. కర్మాచరణలయందు ఏ కోర్కెయూ లేకుండిన, వారిని ఏ దోషములుకూడనూ అంటవు. ఎటులన మలినమైన ఒండ్రుతో చేరిన నీటిని, చిల్లగింజ ఎట్లు మలినమును విచ్ఛిన్నము చేసి నీటిని పరిశుభ్రపరచుటేకాక, ఆ చిల్లగింజకూడనూ నీటి అడుగుభాగమునకు పోయి ఎటుల చేరునో అటులనే కర్మకాండయందు మంచి శిక్షణ పొందినవాని చిత్తము స్వచ్ఛమగుటయేకాక, ఆ కర్మ ఫలితము కూడనూ తనలో అణగియుండి అతనిని ఏమియూ హింసించలేక పాపములకు గురికాకుండా చేయును.

ఈ ఉపనిషత్తునందుండిన పదునెనిమిది మంత్రములందునూ ఈ రెండు మంత్రములే మోక్షమును గూర్చిన సూత్రములు. మిగిలిన పదునారు మంత్రములు ఈ రెండు మంత్రములకు వివరములనే తెలుపవచ్చును. అనగా భాష్యములనియే తలువవచ్చును.

## సర్వ భూతాత్మలు సమానమే!

ఇక ఆత్మ స్వీయమగు స్థితినుండి చలనము చెందనిదైయున్నది. అది మనసును మించిన వేగము గలది. ఇందులో విచిత్రము ఒకటి కలదు. ఆత్మ స్థిరముగా నుండియూ, పరుగిడుచుండును. అన్ని అవస్థలనూ అనుసరించును. అయితే, దీనికి వృద్ధి, క్షయము, పరిణామములు లేవు. ఇది సర్వ వ్యాపియై యుండియూ మనో వ్యాపార వ్యవహితములగు ఇంద్రియములకు గోచరించదు. చైతన్య స్వరూపమగు ఆత్మతత్త్వమున్నపుడే సర్వాస్పదము సమస్త కార్య కరణాది విక్రయ జాలమంతయూ కలుగుచుండును. అసలు 'ఈశ' అను శబ్దమునకు అర్థమే ఇదియై యున్నది. ఇట్టి ఆత్మ తత్త్వము, దగ్గర దూరమనునది లేక రెండింటియందు గోచరించును. చలనముగానూ ఉండును. చలనము లేకనూ ఉండును. ఇది జగత్తునకు, లోపలా వెలుపల కూడనూ ఉన్నది. ఇట్టి

నిజ తత్త్వమునకు తెలుసుకొనువారే జ్ఞానులు.

అజ్ఞానులకు ఇది సాధ్యము కాదు. ఎటులన స్మృతిగలవారికి ఏవస్తువైనను చెంతనే కనిపించును. చెంతనే యుండును. విస్మృతి గలవారు ఒంటిపైనగలున్నను అవి లేనట్లే తలచి దూరమున వెతుక ప్రయత్నింతురు. అటులనే అజ్ఞానికి అన్ని సత్యములు అందుబాటులోనున్నను విస్మృతి వలన అట్టి సత్యాత్మ అతీతమైన స్థానమందున్నదని తలంచుచున్నాడు. జ్ఞాని అట్లుగాక స్మృతి గలిగియుండుటచే సర్వభూతములందు తన ఆత్మను, తన ఆత్మయందు సర్వ భూతములను చూడ గలుగుచున్నాడు. సర్వ భూతాత్మలు సమానమని తలంచుచు తరించుచున్నాడు.

ఇట్టి మహా సత్యమును చూపునదే ఈశావాస్యోపనిషత్. అట్టి పవిత్ర సత్యాన్ని తెలిసికొనిన వాడే జ్ఞాని. అతనికి శోక మోహకారణమగు విరక్తి కలుగదు. అట్టి సాక్షాత్కారమును పొందినవారికి సమస్త భూతములు స్వస్వరూపముగానే దర్శించును. అతడు ఇతరులపై విముఖత చూపలేడు. అతనిని ధర్మాధర్మములుకానీ, శరీరనాడులుకానీ బంధించవు. స్వయం ప్రకాశకుడగుటచే ఈ జీవ రూపము అతని వాస్తవిక రూపము కాదనియూ, అంతియేకాక స్థూల, సూక్ష్మరూపములు కూడనూ అతనివి కావనియూ స్థిరమొనర్చును.

## జ్ఞాననిష్ఠకు, కర్మనిష్ఠకు సముచ్చయం కుదరదు

అందువలననే ఈశావాస్యమను ప్రథమమంత్రమునందు సర్వైషణా పరిత్యాగమే లక్షణముగా గల జ్ఞాననిష్ఠను తెలిపినది. ఇది మొదటి వేదార్థము. కాని జీవితమునందు కోర్కె గలవారికి ఈ నిష్ఠ సంభవించదు. అట్టివారికి రెండవ శ్లోకమునందు కర్మనిష్ఠ విధింపబడినది. ఇది రెండవ వేదార్థము. ఈ జ్ఞాననిష్ఠ, కర్మనిష్ఠ విభాగమునకు మిగిలిన ఉపనిషత్తులు పోద్బలము నిచ్చుచున్నవి. కామ, అజ్ఞానములు రెండునూ కర్మనిష్ఠలు. ఈ లోకము ఆత్మ కాదనియు, అనగా సత్యము కాదనియు, సత్యము కాని లోకముతో సంబంధముంచుకొన్న ప్రయోజనమేమనియూ తలంచి, కర్మనిష్ఠకు సంబంధమైన సంసారమునందు వైరాగ్యము చూపువారు జ్ఞాననిష్ఠులు. వైరాగ్యము జ్ఞాననిష్ఠకు సింహద్వారము వంటిది. ఈ ఉపనిషత్తునందు మూడవ మంత్రము మొదలు ఎనిమిదవ మంత్రము వరకూ అవిద్యానిందా పూర్వకముగా ఆత్మయొక్క యథార్థ స్వరూపము తెలుపబడినది.

## హిరణ్యగర్భోపాసన ద్వారా క్రమముక్తి లభించును

ఈవిధముగ ఈశావాస్యోపనిషత్తు సర్వ సన్యాస పూర్వకమగు జ్ఞాననిష్ఠ మొదటి మంత్రమందును, రాగ ద్వేష హేతుడగువానికి కర్మాచరణము ద్వితీయ మంత్రమునందును తెలుపబడినది. నాలుగెద్దు మంత్రములందు ఆత్మ తత్త్వ విచారమును, తదుపరి ఆత్మజ్ఞాన ఫల వివరములను, సర్వ కర్మ సన్యాసమునకు అశక్తులైన, జ్ఞాన సహిత విహిత... కర్మాచరణ ప్రవీణులగు వారికి కర్మోపాసనా సముచ్చయ పూర్వకమగు క్రమముక్తి మార్గము తొమ్మిదవ మంత్రమున తెలుపుతూ ఎవరు విద్యకు విరుద్ధమగు కర్మ నాచరించెదరో, వారు దృశ్యాత్మకమగు అజ్ఞానమున ప్రవేశించెదరనియు, ఎవరు కేవలము దేవతా స్వరూప జ్ఞానమందు మాత్రము ఆసక్త చిత్తులగుదురో వారు అజ్ఞానము కంటెనూ హీనతరమగు అంధకారమున పడుదురని కూడనూ తెలిపినది.

విద్య అనగా జ్ఞానమునకు, దేవ లోకము ప్రత్యేక ఫలముగా చెప్పబడినది. కనుక ఆజ్ఞానము ఆత్మజ్ఞానము కానేరదు. కర్మనిష్ఠకు పితృలోకము ప్రత్యేక ఫలముగా చెప్పబడినది. కనుక ఆత్మసాక్షాత్కార నిమిత్తమగు జీవన్ముక్తికి హేతుభూతమగు జ్ఞానమునకు తదితరములకును సముచ్చయము కుదరదు. అవిరుద్ధములగు దేవతా జ్ఞాన కర్మనిష్ఠల సముచ్చయము ప్రకృతమని అర్థము. జ్ఞానమునకును, కర్మనిష్ఠకును ప్రత్యేక ప్రత్యేక ఫలితములు తెలుపబడినవి.

శాస్త్ర విరుద్ధమైనది ఏదియూ అనుష్ఠేయము కానేరదు. అవిద్యా శబ్దమునకు కర్మాచరణమర్థము. ఈ విధముగా కర్మచే చిత్తశుద్ధి కలిగిన తరువాత దేవతా జ్ఞాన సాధనమగు ఉపాసనముచే చిత్తైకాగ్రత సిద్ధించుచున్నది. ఇట్టి ఉపాసనము హిరణ్య గర్భోపాసనమే అంత్యమునకు పూర్వము పరిపక్వమైనచో జీవన్ముక్తి హేతువగును.

ఆ లోకమున బ్రహ్మోపదేశముచే ముక్తి సంప్రాప్తమగును. ఎవరు దేవతా జ్ఞానమును, కర్మను, సముచ్చయముచేసి తెలిసికొనునో అతడు కర్మానుష్ఠానముచే మృత్యువును దాటి, దేవతా జ్ఞానము చేత దైవత్వమును పొందును.



# 3.

## కఠోపనిషత్

ఈ ఉపనిషత్తున యమునిచే బ్రహ్మతత్త్వోపదేశమునొంది కృతార్థతను గాంచిన నచికేతుని చరిత్రము పేర్కొనబడినది. ఇంతియేకాక, ఈ యాఖ్యాయిక తైత్తిరీయ బ్రాహ్మణమునను, మహాభారతము అనుశాసన పర్వము నూట ఆరవ అధ్యాయమున కూడ తెలుపబడినది. ఇది విషయ విమర్శనమునకు, భావకల్పనా గాంభీర్యములకును ప్రసిద్ధికెక్కినది. దీనియందలివి అనేక మంత్రముల రూపమననే భగవద్గీతయందు కనిపించుచున్నవి. కృష్ణయజుర్వేదీయ చరకశాఖాన్తర్గతమగు కఠశాఖా బ్రాహ్మణమునకు చెందియుండుటచేత ఈ ఉపనిషత్తునకు కఠోపనిషత్ అని కూడను పేరు వచ్చినది.

## ఆత్మ జ్ఞానోపదేశానికి అర్హత సంపాదించాలి

వాజస్రవనుడను నామమున బరగు గౌతముడను కర్మశ్రేష్ఠుడు సర్వస్వ దాన ప్రయుక్తమగు క్రతువు నొకదానిని ప్రారంభించెను. అతనికి నచికేతుడను ఒక సుగుణశాలియైన కుమారుడుండెను. ఈ మహాక్రతువునందు తన తండ్రియైన గౌతముడు నీరు త్రాగుటకు కానీ, గడ్డి మేయుటకు కానీ, పాలిచ్చుటకు కానీ శక్తిలేని గోవును ఋత్విక్కులకు దానముగా నీయ సంకల్పించినప్పుడు, తండ్రికి కలుగనున్న నరక దుఃఖమునకు ప్రతీకారముగా తనను ఆ ఋత్విక్కులలో నెవరికైననూ దానమిమ్మని నచికేతుడు తండ్రిని అనేక పర్యాయములు నిర్బంధము చేయుచుండగా తండ్రి కుపితుడైనిన్ను మృత్యుదేవతకు దానమిచ్చెదనని యనెను. అప్పటినుండియూ తండ్రి మాటకు అసత్యత్వము రానివ్వకూడదని నిశ్చయించుకొని, జనన మరణములకు లోనైన జీవలోకమునందాడిన మాటలు తప్పరాదని, పితృవాక్ పరిపాలనము చేయవలెననియు దీక్షనుపూని, తండ్రిని ఒప్పించి, యముని సందర్శనమునకు పోయి, యముడు కనిపించువరకూ మూడు రాత్రులు కాచి నివశించెను. తరువాత తన దర్శనమునకై కాచియుండిన నచికేతుని వృత్తాంతము యముడు విచారించి, "నీవు నిరాహారివై మూడు రాత్రులు నా యింట కాచితివి కనుక, నీవీ మూడు రాత్రులకునూ మూడు వరములు కోరుకొమ్మని యముడు నచికేతునకు తెలిపెను.

అపుడు నచికేతుడు సమ్మతించి "నీ యాజ్ఞను గైకొని నేను స్వగృహమునకు చేరినపుడు నా తండ్రికి నా యందు ఆగ్రహము పోయి శాంతమనస్కుడై నన్ను గుర్తించునట్లు చేయుమ"ని మొదటి కోర్కె అడిగెను. తరువాత "స్వర్గమున ఆకలి దప్పులు కానీ, మృత్యుభయము కానీ, కష్టదుఃఖములు కానీ లేవు కదా! దానిని గురించి నాకు ఉపదేశించుమ"ని రెండవ కోరిక కోరెను. అపుడు యముడు ఆ రెండింటిని ఎంతో ప్రేమతో నచికేతునకు ప్రసాదించెను. అగ్ని చయన విజ్ఞానమునంతయు బోధించెను. యముడు ఉపదేశించిన రీతిగా నచికేతుడు సంపూర్ణముగా గ్రహించి, తాను తెలిసికొనిన దానిని సునిశ్చయము చేసికొనుటకై యమునికి తిరిగి ఒప్పగించెను. అప్పుడు నచికేతుని బుద్ధిసూక్ష్మతకు యముడు సంతసించి అగ్ని చయన మికమీదట నచికేతన చయనమని అతని పేరుతో ప్రసిద్ధి గాంచునట్లు మరియొక వరమిచ్చెను. అంతియేగాక చిత్రమైన శబ్దము నిచ్చునట్టి రత్నమాల నొకదానిని

యముడు నచికేతునకు ప్రసాదించెను.

తరువాత, నచికేతుడు మూడవ వరము కోరుటకై "స్వామీ! మనుజుడు మరణశీలుడు. దేహేంద్రియములకు భిన్నమగు ఆత్మయనునది ఒకటి కలదని కొందరు అందురు. అట్టిదేదియూ లేదని మరికొందరు చెప్పుదురు. నీచే శాసించబడియుండు నేనీ విషయమును తెలిసికొన సంతసించుచున్నాను. కాన, ఇదియే నా మూడవ కోర్కె" అని పలికెను. అతని అర్హతను నిశ్చయించకయే, ఆత్మోపదేశము చేయుటకు ఇష్టములేక నచికేతుని యోగ్యతను పరీక్షించుటకై యముడు విధవిధములైన ఇహలోక సంబంధములగు వరములనిచ్చెదనని అనేక రీతుల బోధించెను. ఆత్మధర్మము బహు సూక్ష్మ విషయమనియు, ప్రాకృత జనులకు సువిజ్ఞేయము కాదనియు, వేరే వరమేదైనను కోరుకొమ్మనియూ, ఈ ఆత్మ సంబంధమైన వరమును కోరక తనను వదలమనియు యముడు చెప్పెను.

అపుడు నచికేతుడు "స్వామీ! ప్రాకృత జనులకు సువిజ్ఞేయము కాదని మీరే చెప్పుచున్నారు. ఇక పండితులకు మాత్రము సాధ్యమగునా? ఈ సూక్ష్మ విషయమును ఉపదేశించుటకు, మీకంటె వేరు సామర్ధ్యులు లేరు. మరే వరమూ నాకక్కర లేదు; అవి అనిత్యఫలము నిచ్చునవే, నాకీ వరమును ప్రసాదించుమని" కోరెను.

## జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయ భేదమును తొలగించుటయే లక్ష్యం

ఈ పట్టుదలనూ, ఈ శ్రద్ధనూ యముడు గ్రహించి ఆత్మజ్ఞానమునకు నచికేతుడు అర్హుడని నిశ్చయించి, "నాయనా! శ్రేయస్సు అనియు ప్రేయస్సు అనియు రెండు పురుషార్థములు. అవి రెండునూ పురుషుని బంధించునవియే. శ్రేయోమార్గము నవలంబించువాడు శుభమును పొందును. ప్రేయోమార్గము నవలంబించువాడు పరమ పురుషార్థము నుంచి విదూరుడగును. ఈ రెండును విభిన్నములు. రెండునూ పురుషాధీనములే. ఒకటి వివేకముచే లభించును. మరియొకటి అవివేకముచే లభించును. విరుద్ధములగుటచే, అవి ఒకదాని నొకటి త్రోసివేయును. ఒకటి మోక్షకారణము; రెండవది సంసార హేతువు. ప్రేయోమార్గము అవిద్యా కల్పితమనియు, శ్రేయోమార్గము విద్యా కల్పితమనియు, అయితే, శ్రేయస్సును కోరువారు అత్యంత అరుద"నియూ యముడు చెప్పెను.

ఆత్మ వికల్పరహితమగు అఖండ రస ఘన స్వరూపము కనుక, అతను అస్తి, నాస్తి, కర్త, అకర్త మొదలగు వికల్పముల కాస్పదుడు కాడు; అతను జ్ఞేయవస్తువు కాడు. కనుక అతనిని గూర్చి జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయ భేదము లేదు. ఇదియే ఆత్మజ్ఞానము యొక్క పరాకాష్ఠ. ఉపదేశికుడే బ్రహ్మము, శ్రోతయే బ్రహ్మమని తెలియుచున్నది. ఈ విధమగు జ్ఞానము, సర్వ సంసార నివారకమగుటచే జన్మరాహిత్యము నిశ్చితమగుచున్నది. శ్రుతి సమ్మతము కాని, కేవలము తర్కమునకీ పరమ రహస్యము అందదనియూ, తర్కమునకు సాధ్యము కాదనియూ ఈ ఉపనిషత్తు దెల్పుచున్నది.

## ఓంకారోపాసన పరా, అపరా బ్రహ్మ సాధకము

ఆత్మదర్శనము కష్ట సాధ్యము. అది పురాతనము మనస్సును విషయములనుండి మరల్చి, ఆత్మయందు సమాధానము చేయుటచే అది లభించును. ధీరుడగువాడు ఇట్టి ఆత్మను తెలిసికొని శోకమును వదలును. ఇంతియే కాక, వేదాన్తములన్నియు పరమాత్మను పొందదగినది. ఏ ధ్వని ఏ కంఠమున నుద్ఘోషించుచున్ననూ, ఆ పరమార్థ వస్తువు "ఓం" అను శబ్దముచే చెప్పబడునదే. ఓంకారము పరా, అపరా బ్రహ్మములు రెంటికినీ ప్రతీకమగుటచే అవి రెండూ ఓంకార ఉపాసనచే లభ్యమగుచున్నవి. హిరణ్యగర్భ ప్రాప్తికి కూడనూ ఓంకారమే సాధనమగుచున్నది. ఇది సుద్ధసత్వ ప్రధానమగు మాయచే పరిచ్ఛిన్నమగుచున్నదనియూ, ఓంకారము పరాపరబ్రహ్మ ప్రతీకమనియూ ఈ ఉపనిషత్తు తెలుపుచున్నది. ఇంతియేకాక, ఆత్మకు పరిణామము లేదు. ఆత్మ ఉపాధి ధర్మములచే సంస్పృష్టము కాదు. ఎటులన ఉపాధి ధర్మములు కలిగినవాడుగ కన్పించుచున్నాడు. కానీ అది కల్పన. సూర్య ప్రతిబింబము ఉపాధి భూతమగు జలముయొక్క సంచలనముచే సంకుచితమగునటుల కన్పించిననూ, సూర్యబింబము ఉపాధి ధర్మముచే అసంస్పృష్టమై వాని యన్నిటికినీ కడుదూరముననుండి వానికి సాక్షి మాత్రముగ ఎట్లు

భాసించుచున్నదో అటులనే, ఆత్మ "సాక్షి" మాత్రముగా భాసించుచున్నాడు.

విద్య, అవిద్యా ఫలములకు జీవుడే భోక్త. బుద్ధియే ప్రవృత్తి నివృత్తులకు కారణము. కాన, ఆత్మదర్శనము సర్వేంద్రియోప సంహారముచే లభించును. వాగాది ఇంద్రియములను ఆనాత్మభావముచే అసత్యములని త్రోసివేసి, వాటిని మనస్సునందు ఉపసంహరింపవలెను. అటులనే మనస్సును బుద్ధియందును, బుద్ధిని హిరణ్యగర్భునియందును, హిరణ్యగర్భునీ, బుద్ధినీ సర్వ ప్రత్యయసాక్షియగు ముఖ్యాత్మయందును ఉపసంహరింపవలయును. సమస్త ప్రపంచమును నిర్వికల్ప సమాధియందు స్వస్వరూపమగు పరమాత్మయందు నిలుపవలెనని తాత్పర్యము.

## ఆత్మ నాశ రహితం, అనంతం

సర్వ ప్రపంచము మిథ్యాజ్ఞాన విజృంభితము. నామరూప కర్మాశ్రయము. ఎటులన, ఎండ మావుల నీటి భ్రమయు, త్రాటియందు సర్ప భ్రమయు యథార్థ స్వరూప జ్ఞానముచే ఎట్లు తొలగిపోవుచున్నవో, అటులనే ఆత్మ దర్శనార్థమై అనాదియగు అవిద్యయందు గాఢనిద్రజెందిన వారిని నిద్రలేపి, ఆత్మజ్ఞానాభిముఖులుగా చేయుచున్నది. ఇందులోని 14వ మంత్రము "ఆత్మ" శబ్ద స్పర్శ రూప రస గంధ రహితమై నాశరహితమై అనంతమై యున్నది. ఇంద్రియములు బాహ్య వృత్తములు. అత్మ సర్వ వ్యవహార సాధనము. అజ్ఞాన జన్యమగు నానాత్వ బుద్ధి నశించవలెను. ఉపాధి భేదముచే విభిన్నులుగా కనిపించుచున్నవి. కానీ "నేను వేరు; బ్రహ్మము వేరు" అనువారు జనన మరణ పరంపరకు లోనగుదురు. బ్రహ్మముయొక్క అస్తిత్వమున సందేహము కలిగి నచికేతుడు యముని కోరగా ఇంతవరకు తెలిపెను.

## భిన్న భావనల వలన అధః పతనమే

అంగుష్ఠమాత్రుడగు ఈ పురుషుడు ధూమముచే కప్పబడిన జ్యోతిస్సును పోలియున్నాడు. కానీ, ఆ పురుషుడు కాలత్రయమునందున్నవాడు. అతను నిత్యుడు. ఎటులన ఎత్తైన పర్వతములపై కురిసిన వర్షము పల్లపు ప్రదేశమునకు నానాముఖమున ప్రవహించి ఎట్లు విభిన్న ప్రవాహముగా చెదరి నశించునో అటులనే వివిధ ధర్మములను తనకంటే భిన్నముగా భావించునతడు తనయుచ్చైర్గతి నుండి ప్రచ్యుతి జెంది వివిధ మార్గముల నధఃపతితుడై నశించుచున్నాడు. ఆత్మకంటే అధికుడు కానీ, సమానుడు కానీ మరొకరు లేడని, ఈ ఉపనిషత్తు ఘోషించినది. వృక్షముయొక్క వేరులు భూమిలో చేరి, పెకి కనిపించక పోయిననూ కార్యరూపకమగు ఫల పుష్పాదికముచే అది నిశ్చయింపబడుచున్నది. పై ఆవరణము తీసిన వెంటనే అది ప్రత్యక్షముగా కన్పించును. అటులనే సర్వజనితమగు సంసార వృక్షమువలన, దాని మూలమగు బ్రహ్మమును నిర్ధారణ చేయుటకుగాను యముడు ఈ బోధ చేసెను.

## ఆత్మ నెరింగినవాడు బ్రహ్మమును పొందును

ఈ సంసారవృక్షము ఇంద్రజాలము వంటిది. పెకి మాత్రము కనిపించుచున్నదే కానీ అది యథార్థము కాదు. దర్పణమునందు ప్రతిబింబము స్పష్టముగా కనిపించి నటుల, నిర్మల బుద్ధి గలవాడు ఈ జన్మమునందే ఆత్మదర్శనము పొందగలడు. బ్రహ్మము, జ్ఞానికి జ్ఞేయమగుచున్నది. ఉపాసకునికి ఉపాస్యమగుచున్నది. బ్రహ్మ సాక్షాత్కారము చేసికొని జ్ఞాని ముక్తుడగుచున్నాడు. ఉపాసకుడు మరణానంతరము బ్రహ్మలోకమున కేగుచున్నాడు. అక్కడ జ్ఞానోపలబ్ధిచే హిరణ్యగర్భునితో గూడా కల్పాంతమున ముక్తి పొందుచున్నాడు. ఈ రీతిగా యముడు ఉపదేశించిన ఈ బ్రహ్మవిద్యను, యోగవిధిని కూడా సంపూర్ణముగా గ్రహించి, నచికేతుడు మృత్యువు నుండి తొలగినవాడై బ్రహ్మమును పొందెను. పెరీతిగా ఆత్మ నెఱింగిన ప్రతివాడునూ బ్రహ్మమును పొందును. కేవలము కనుగొనుటకైననూ ప్రయత్నించినవాడు ఉత్తమ మనుజుడగును; పాప రహితుడగును.

ఈ ఉపనిషత్తు ఆత్మ తత్త్వమును, ప్రణవ స్వరూపమును, బ్రహ్మవిద్యను అనేక విధముల బోధించినది. అందులోని సారాంశములను మాత్రమే నేను తెలుప సంకల్పించితిని. సూక్ష్మబుద్ధి గలవారలకు, ముముక్షువులు కాగోరు వారలకు ఇందులో

ఒక్క మంత్రము చాలు, తరింపజేయును. మొద్దు బుద్ధి గల మనుజునికి, సంసారాపేక్ష గల సహజునికి ఎన్ని చెప్పినను ఒక్కటిగనే యుండును. సముద్రమువంటి ఆత్మ రుచిని తెలిసికొనుటకు, సముద్రమునంతటినీ త్రాగనవసరము లేదు. అందులోని ఒక బిందువును నాలుకపై వేసికొన్న చాలును. అటులనే ఈ ఉపనిషత్తును తెలిసికొనగోరువారు, అన్ని మంత్రములనూ ఆశ్రయించనవసరము లేదు. ఒక్క మంత్రమునందలి సారమును తెలిసికొనిన, తప్పక ధన్యుడు కాగలడు.

## 4.

# ముండకోపనిషత్

నేత్రశ్రోత్రములచే నెల్లప్పుడు మంగళప్రదమగు కార్యములు చూచునట్లునూ, మంగళనాదము వినునట్లును, సర్వేశుని అనవరతము చింతన చేయుచు ఆయుష్కాలమును గడుపునట్లును, శాంతిపఠనముతో ఈ ఉపనిషత్తు చెప్పబడినది. ఇందులో ఉపదేశించిన విద్య, కార్యబ్రహ్మయగు హిరణ్యగర్భునిచే మొదట చెప్పబడుటచేగాని, బ్రహ్మమును గురించి చెప్పుబడుటచేగాని, బ్రహ్మవిద్య అనుచు పిలువబడుచున్నది. పూర్తి క్షురకర్మ చేయబడిన శిరస్సునందు అగ్నిని ధరించుటయే ముఖ్య లక్షణముగాగల శిరోవ్రతము నాశ్రయించినవారు మాత్రము ఇచట బ్రహ్మవిద్య కర్హులగుటచే ఈ ఉపనిషత్తుకు ముండకమని పేరు కలిగినది. గుణసంపత్తిచే ఈ ఉపనిషత్తు సర్వోపనిషత్తులకూ భూషణముగా నుండుటచే కూడను దీనికి ముండకమని పేరు సమన్వయింపబడినది. ఇది అధర్వణ వేదములోనిది.

## సర్వ జీవులకూ జన్మ స్థానం బ్రహ్మమే

సాంప్రదాయ సిద్ధమై పరంపరగా వచ్చిన ఈ బ్రహ్మవిద్య, నిర్గుణ బ్రహ్మమును బోధించు పరవిద్యయనియు, ధర్మాధర్మ ఫలసాధనమగు సగుణ బ్రహ్మమును బోధించు అపరవిద్యయనియు, ఇందులో రెండు భాగములున్నవి. ఇవి రెండును శౌనకుడు అంగిరసున కుపదేశించెను. వేదములతోనూ, వేదాంగములతోనూ కలిసిన దానిని అపరవిద్య అందురు. ఉపనిషత్తు మొదలగు శబ్దరాశియంతయూ అపరవిద్యయందురు. కానీ అవి అపరవిద్యలయినప్పటికినీ, దాని బోధనచే బ్రహ్మను బోధింపచేయు విజ్ఞానము, పరవిద్యయగుచున్నది. సాలెపురుగునుండి వచ్చు దారమునకు సాలెపురుగు ఎట్లు ఉపాదాన కారణమగుచున్నదో అటులనే జగత్తుకు బ్రహ్మము హేతువగుచున్నాడు.

అపరవిద్యయయిన సంసారమునకు క్రియ-కర్త, సాధనము, జ్ఞానము కలుగకుండునంతవరకు అవి యుండును. అపరవిద్యయగు కర్మ నాచరించినవారు స్వర్గమును పొందుదురు. మరికొందరు, కర్మచే లభించు స్వర్గాదులు అనిత్యమని గుర్తెరిగి, దానిపై వైరాగ్యమును బొంది, బ్రహ్మనిష్ఠులగు పెద్దలచెంతచేరి ముక్తిహేతువగు బ్రహ్మవిద్యను తెలుసుకొందురు. సర్వ జీవులూ బ్రహ్మముకంటె వేరు కాదు. సర్వజీవులకూ జన్మ స్థానము బ్రహ్మనే, ఎటులన ప్రజ్వలించుచున్న మంటనుండి అనేక కణములు (నిప్పు రవ్వలు) ఎట్లు పుట్టుచున్నవో, శరీరమునుండి రోమము ఎట్లు పుట్టి దానికంటె విలక్షణముగా ఎట్లు తెలియుచున్నవో, అటులనే బ్రహ్మమునందే జీవులు పుట్టుచూ దానికి విలక్షణముగా తెలియుచున్నవి. కానీ, బ్రహ్మముకంటే వేరు కావు. పరబ్రహ్మ ఆజ్ఞ ప్రకారమే సూర్యచంద్రాదులు, పంచభూతములు సర్వవ్యాపారములు నిర్వహించుచున్నారు. అదియే సర్వకర్మ ఫలప్రదాత.

## వశీకృత చిత్తునకు ఆత్మ జ్ఞానం సాధ్యం

జీవేశ్వరులను రెండు పక్షులును, శరీరమను ఒక వృక్షమునే ఆశ్రయించి యున్నవి. జీవుడు కర్మఫలమును అనుభవించును. ఈశ్వరుడు దూరమునుండి చూచుచూ సాక్షీభూతుడగును. జీవుడు శరీర ధర్మముతో నెక్కువై దుఃఖము ననుభవించుచున్నాడు. ఏనాడు తానే ఈశ్వరుడనని తెలిసికొనునో అప్పుడు శోక విముక్తి పొందుచున్నాడు. ఈశ్వర జ్ఞానేచ్ఛచే, వశీకృతచిత్తుడైన వానికి విషయేచ్ఛ నశించి ఆత్మ జ్ఞానము కుదురును. అట్టి పవిత్ర బ్రహ్మవిద్య ఉపదేశమే ఈ ముండకోపనిషత్తుయొక్క ఉద్దేశమని చివరి మంత్రము తెలిపినది. ముండమన శిరస్సు; ఉపనిషత్శిరోభూషణమగుటం జేసి, ఇద్దానికీ నామము కలిగినట్లు తెలిసికొనవచ్చును. అగ్నిని శిరస్సునందు ధరించుటయే ముఖ్య లక్షణముగా యథావిధిగా నాచరించిన వారికే బ్రహ్మవిద్య బోధ(అర్థము) కాగలదని దీని భావము.

ఈ ఉపనిషత్తులో మంత్ర విచారణము కొరకు బ్రహ్మసూత్రముల రెండధికరణములు వినియోగింపబడినవి. ఈ ఉపనిషత్తులో రెండేసి ఖండములుగా మూడు అధ్యాయములు ఇందు గలవు. ప్రథమ ఖండమున పరాపర విద్యలును; రెండవ ఖండమున పరబ్రహ్మ ప్రాప్తి హేతువగు కర్మను కర్మ ప్రతిపాదకమగు శబ్దము సామాన్యముగ మంత్రములలో చెప్పబడినవి. ఇవియే కర్మ కాండము నందెక్కువ వినబడుచున్నవి. ఉపనిషత్తు మంత్రములన్నియు బ్రహ్మవిద్యా ప్రతిపాదకము లగుట జేసి పవిత్ర సూచకము లగుచున్నవి.

## సృష్టికి పరమాత్మయే ఉపాదాన, నిమిత్త కారణం

పైచెప్పినట్లు సాలెపురుగు ఇతర వస్తువుల సహాయం లేకనే తనలో నుండే దారమును పుట్టించుకొనుచున్నది. తిరిగి దాని నుపసంహరించుకొనుచున్నది. ఇటులనే పరమాత్మనుండి ఇతర వస్తువుల సహాయము లేకనే ప్రపంచము సృజింపబడుచున్నది. ఏ వస్తుతత్త్వమునుండి మరియొక తత్త్వము కలుగుచున్నదో అది దాని ఉపాదాన కారణమగుచున్నది. అంటే, దారమునుండి గుడ్డ, మట్టినుండి కుండ, బంగారమునుండి నగ యెట్లు ఏర్పడుచున్నవో అటుల, మట్టి, బంగారు, దారము కుండకు, నగకు, గుడ్డకు ఉపాదాన కారణమగుచున్నవి. అటులనే బ్రహ్మ పదార్థమునుండి ప్రకృతి పుట్టినది. బ్రహ్మము జగత్తునకు నిమిత్త కారణము కూడా అగుచున్నది. అమేయమగు ఈ జగత్తును సృష్టించినవాడు సర్వజ్ఞుడు కావలెను. అట్టి సర్వజ్ఞత్వము ఒక పరమాత్మకు తప్ప మరియొకరికి సాధ్యము కాదు.

బ్రహ్మ జ్ఞానము పరవిద్యయొక్క ముఖ్య లక్షణము. స్వర్గమే దాని ఫలము. స్వర్గము కోరువారికి కర్మాచరణే ముఖ్య మార్గము. సమస్త కర్మలకు అగ్నిహోత్రము ముఖ్యము. కర్మాచరణలవలన చిత్తశుద్ధి కలుగుచున్నది. ఇది పరవిద్య కత్యంత ఆవశ్యకమగు పూర్వాంగము. ప్రకాశించుచున్న ఆహుతులు ఆ యజమానిని పిలుచుచున్నట్లుండును. అగ్నిహోత్ర కర్మలను జ్ఞాన సమేతముగా చేయువాని ఆహుతులు సూర్య కిరణములు గ్రహించుచున్నవి. ఇంద్రుడు నివసించు స్వర్గమునకు అతనిని తీసుకొని పోవుచున్నవి.

అగ్నిహోత్రము, సత్యము, తపస్సు, వేదాధ్యయనము, అతిథి పూజనము మొదలగు శ్రౌత కర్మలు ఇష్టములనబడును. దేవాలయ సత్రములు, చావిడులు, తటాకములు, దారి ప్రక్కన వృక్షములు నాటుట స్మార్త కర్మలు పూర్తమనబడును.ఇవి కర్మ ఫలములని చూపబడినవి. సంసారమంతయు కర్మ నిబద్ధమగుటచే సహజము కాదు. అది కృతకము. దాని ఫలము కూడా కర్మ జన్యమగుటచే కృతకము. అనిత్యమగుచున్నది.

## ఓంకారం ధనుస్సు, జీవుడు బాణం, బ్రహ్మ లక్ష్యం

సృష్టియంతయు నామ రూపాత్మకము. అనృతము, వాక్కులచే వర్ణింపబడుచున్న వికార స్వరూపము. పరమ పురుషుడే సర్వ సృష్టి కారకుడు. అతడే నిత్య, సత్య, నిర్మల స్వరూపుడు. సర్వ కర్మలు, ఫలములు కూడను విరాట్ పురుషుని వలననే కలిగినవి. కలుగుచున్నవి. అయితే అతడు అదృశ్యుడు. అగ్రాహ్యుడు. ''నేను'' అనునది బ్రహ్మమే అని శ్రుతి చెప్పుచున్నది. రథ చక్ర నాభియందలి ఆకులవలె అద్దానియందు సమస్త ప్రపంచము నిబద్ధమై యున్నది. ఆ పరమార్థ వస్తువుకంటే వ్యతిరిక్తమయిన

వస్తువేదియును లేదు. ఇట్టి పదార్థమును పొందుటకు మనసు ముఖ్యమని కూడ తెలిసినది.

బ్రహ్మమను లక్ష్యమును, మనస్సను బాణముచే కొట్టవలెను. ఉపాసనా లభ్యమగు చిత్తైకాగ్రముచే పదును పెట్టబడిన అంతఃకరణ బాణము ఉపనిషద్ధనుస్సునందు ఎక్కుపెట్టి, అక్షర స్వరూపమగు పరబ్రహ్మమగు లక్ష్యమునందు గురిపెట్టి లాగి వదలవలెను. అనగా ఓంకారము ధనుస్సు. జీవుడు బాణము. బ్రహ్మము లక్ష్యము. పరబ్రహ్మము అంతఃకరణమునందు ప్రతిబింబమై దానిని ఉద్దీపింపజేయుచున్నది. అట్టి అంతఃకరణమును బాహ్యములగు స్వవిషయములనుండి మరల్చి, వైరాగ్యముచే చిత్త కాలుష్యమును పోగొట్టుకొనవలెను.

ఇట్టి నిర్మలమగు చిత్తమునందు ఓంకారోపాసనచే ఏకాగ్రతను సమకూర్చవలెను. బండిచక్రపు కుండనుండి బండి ఆకులవలె, హృదయమునుండి అనేక నాడులు బయలుదేరి దేహమంతయూ వ్యాపించియున్నవి. హృదయాంతర్భాగమునందు జీవుడనేక ప్రకారముల మారుచున్న వానివలె కనిపించును. జీవుని కంటె వేరుగాని ఆత్మను, ఓంకారమును ఆలంబనముగా గ్రహించి ధ్యానము చేయవలెను. అపుడు అజ్ఞానపు గట్టు కనిపించును.

## అవిద్యా నాశనమే మోక్షం

ప్రపంచమంతయూ పరమేశ్వరుని మహిమా సూచకములు. హృదయాకాశము పరమేశ్వరోపలబ్ధి స్థానము. పరబ్రహ్మము ప్రాణములకు ప్రాణము. అట్టి పరమాత్మ రూపము లేనిదగుటచే, నేత్రములచే చూడ శక్యము కాదు. నామము లేనిదగుటచే వాక్కుతో చెప్పనలవి కాదు. ఇక ఇతర ఇంద్రియములకు గ్రహణయోగ్యము కాదు. తపస్సు చేతగాని, వైదికమగు అగ్నిహోత్రాది కర్మలచేకాని అది లభ్యము కాదు.

రాగాది దోషములు తొలగి బుద్ధి నిర్మలము, ప్రసన్నము అయినపుడు బ్రహ్మజ్ఞానము లభించును. జ్ఞానము చేతనే సాక్షాత్కారము ప్రాప్తించును. ధ్యానముచే చిత్తైకాగ్రత, అందుచే జ్ఞానము. చిత్తము నిర్మలమయినపుడు శరీరమునందే ఆత్మ తెలియబడగలదు.

ఏ శరీరమునందు పంచప్రాణములు రూపమున ప్రవేశించినవో, అట్టి శరీరమునందే విశుద్ధ జ్ఞాన సంపన్నమగు చిత్తముచేత సూక్ష్మతమమగు ఆత్మ తెలియుచున్నది. క్షీరమునందు వెన్న, కట్టెలయందు అగ్ని వలె ఇంద్రియములతో కూడి ఆత్మ యున్నది. ఈ చిత్తము క్లేశాది కలుషితమై యున్నది. అది విశుద్ధమయినపుడు హృదయమున పరమాత్మ ప్రత్యగాత్మగా ప్రకాశించును. ఇట్టి ఆత్మజ్ఞానము తెలిసికొన్నవాడే పూజ్యుడు. బ్రహ్మజ్ఞాని బ్రహ్మమే. అవిద్యా వినాశమే మోక్షము.



# 5.

# మాండూక్యోపనిషత్

## పరోక్షముగా కనిపించు బ్రహ్మమే అపరోక్షమగు ఆత్మ

ఈ ఉపనిషత్తు సర్వ వేదాంత సారము. అన్నింటికంటెను గంభీరమైనది. మోక్షప్రాప్తికి ఈ మాండూక్యోపనిషత్తు ఒక్కటి చాలునని బ్రహ్మవిద్యను బోధించునట్టి వాటిలో ఇది ముఖ్యమైనదైయున్నది. కాని ఉపనిషత్తులలో ఇంత చిన్నది మరే ఉపనిషత్తు లేదు. ఇది చాల స్వల్పమైనది. దీనిలో పదురెండు మంత్రములు మాత్రము కలిగియున్నది. ఇందులో ఆగమ, వైతథ్య, అద్వైత, అలాతశాంతులను నాలుగు ప్రకరణములు విలసిల్లినవి.

మొదటిదైన ఆగమ ప్రకరణమందు, ఆత్మతత్త్వమునకు ఉపాయమగు ఓంకార తత్త్వము నిర్ణయింపబడినది. రెండవదైన వైతథ్య ప్రకరణమున ద్వైతోపశమనము విలసిల్లినది. మూడవదైన అద్వైతమున ఏకత్వమును అనగా అద్వైతత్త్వమును విచారింపబడినది. నాల్గవదైన అలాతశాంతి ప్రకరణమున పరస్పర విరుద్ధములు, అవైదికములు మతాంతరములు వివరింపబడినవి.

శబ్దములన్నియు ఓంకారముకంటె వేరు కావు. కనుక అవి అన్నియూ ఓంకారములగుచున్నవి. అయితే బ్రహ్మ ఓంకార శబ్ద వాక్యమగుటవలన ఓంకారము బ్రహ్మము కంటే వేరు కాదు. పరోక్షముగా కనిపించు బ్రహ్మమే అపరోక్షమగు ఆత్మ. ఆత్మకు విశ్వ, తైజస, ప్రాజ్ఞాది భేదము ఉపాధి కల్పితము. నేను అని సర్వ సామాన్యముగ తెలియవచ్చు. ఆత్మ, రెండూ ఒక్కటియే.

ఈ అవస్థా త్రయము నొకదాని తరువాత నొకదానిలో తనను అనుసంధానము చేసికొని ఆయా అవస్థల అనుభవించుచున్నది. నదీ ప్రవాహ మధ్యగత మగుచు, రెండు కూలములను అంటక సంచరించు మత్స్యము వలె ఉండును.

సుషుప్తియందు విషయవాసనలన్నియు ఘనీభూతములగుట వలన, ఉన్ననూ ఉండినట్లు కనిపించవు. స్వప్నమునందు వాసనారూపమున దానిని అనుభవించుచున్నారు. విషయవాసనలన్నియూ మానసిక సంచలనముచే జాగ్రత్‌స్వప్నములందు మొలక వేయుచున్నవి. దీనినే అనగా మానసిక స్పందనమునే సృష్టి అనబడుచున్నది. జాగ్రదాద్యవస్థాత్రయముకంటే (అనగా జాగ్రత్, స్వప్న, సుషుప్తి అను మూడు అవస్థల కంటే) భిన్నమయినది ఒకటి కలదు. దానినే తురీయము అని అందురు.

## అమనస్కత్వమే తురీయం

ఇది మనోవాగతీతము. తురీయము, శాంతము, శివము, అద్వైతము ఈ నాలుగునూ పాదములని పిలువబడినవి. ఇది అద్వితీయము, నిర్వికారము. తురీయమునందు మానసిక వాసనలన్నియూ నశించి అమనస్కత్వమేర్పడును.

తురీయమున అమనస్కత్వము, సుషుప్తియందు మనస్కత్వము, జాగ్రత్స్వప్నములందు మనఃస్పందనములు కలవు. అయితే

ఈ మూడునూ తత్త్వమును గ్రహింప లేకుండుటచే సమానముగా నుండును.

ప్రపంచమనునది నిజముగా నున్నయెడల అది తురీయమునకు భంగకరమే కావలెను. కాని అది నిజము కాదు; మనఃస్పందనముచే కల్పింపబడిన భ్రమ మాత్రమే! నిజము తెలిసిన, త్రాటియందు నిరూపించిన సర్పమువలె భ్రాంతి నశించును. ప్రపంచమునకు పుట్టుక లేములు రెండు అసత్యములే.

## ప్రణవమే పరమాత్మ తత్త్వం

జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలను ప్రాజ్ఞులు క్రమముగా అకార, ఉకార, మకారములతో సరిపెట్టుచున్నారు. ఈ మూడింటి పర్యవసానమే ఓంకారము. అకార ప్రధానమగు ఓంకారోపాసనము వలన సర్వ కామ్య ప్రాప్తియు సిద్ధించును. ఉకార ప్రధానముగా చేయు ఓంకారోపాసనము వలన జ్ఞానసంతతి కలుగును. మకార ప్రధానముగా చేయు ఓంకారోపాసనము వలన లయమగుచున్నది. ఇట్లు తెలిసికొని ఓంకారోపాసన చేయువారు జగత్తు యొక్క యథార్థమును తెలిసికొనగలరు. అకారాది మాత్ర త్రయమునందు తాను కూడ ఉన్నాడను సత్యమును గ్రహించి, ఓంకారోపాసనము జేయువాడు సర్వవంద్యుడగునని ఓంకారోపాసనముయొక్క ఉత్కృష్టత తెలియబడినది.

అకారాది మాత్రాత్రయము ఓంకారమున లయమగుటచే అది అమాత్ర అగుచున్నది. ఓంకారము శాంతము, శివము, అద్వైతము. ఇట్టి జ్ఞానమువలన బ్రహ్మాత్మైక్యము వచ్చును. ప్రణవము సృష్టి, స్థితి, లయ కారణమనియూ, సర్వ శోక నాశకమనియు 24-29 కారికలలో స్తుతింపబడుచున్నది. ఇంతియే కాదు, ఓంకార తత్త్వమును తెలిసికొని మననము చేయువాడు పరమాత్మ తత్త్వమును తెలిసికొనిన వాడగుచున్నాడు.

## అద్వైతము పరమార్థము, ద్వైతము మనఃకల్పితము

ప్రథమ ప్రకరణమున ఆత్మయొక్క యద్వైతమాగమము సామాన్యముగా సిద్ధము చేయబడినది. వైతథ్య ప్రకరణమున ద్వైతమనిత్యమని ప్రదర్శింపబడినది. అద్వైత ప్రకరణమున ఆగమ ప్రతిపాదితమగు ద్వైతము యుక్తియుక్తముగ సిద్ధాంతము చేయబడినది. నానా రూపమగు జగత్తు పుట్టుటకు పూర్వము అవ్యక్తము. "కార్యబ్రహ్మోపాసన చేతనే ఇప్పుడు ఉత్పన్నమగు బ్రహ్మను పొందుచున్నాను" అని తలంచు ఉపాసకుడు కృపణుడు (నీచుడు). ఉపాసనముచే నద్వితీయబ్రహ్మము లభింపనేరదు. కృపణము కానట్టియు, పుట్టుక లేనట్టియు, సర్వసామాన్యమును పొందినట్టియు, బ్రహ్మము ఇచట వివరింపబడుచున్నది. ఆత్మ ఆకాశమువలె సర్వ వ్యాపి. ఒకే ఆకాశము, ఘటాకాశము, మఠాకాశము మొదలగు అనేక రూపముల అభివ్యక్తమయినట్లు ఆత్మ అనేక జీవరూపముల అభివ్యక్తమగుచున్నది. అట్టి అభివ్యక్తమయిన ఆత్మ సత్యము కాదు.

జీవునకు ఆశ్రయమగు శరీరము ఘటము వంటిది. ఘటకృత పరిచ్ఛిన్నత్వము తప్ప ఘటాకాశ, మఠాకాశములకు భేదము లేనట్లే, శరీరావృత పరిచ్ఛేదము దప్ప జీవాత్మలకు భేదము లేదు. ఘటము భిన్నమయినపుడు ఘటాకాశము మహాకాశమున కలసినట్లు, శరీరము నశించినపుడు, జీవుడాత్మయందు ఐక్యమును బొందును. ఉపాధికృత భేదము తప్ప, పరమార్థమున జీవులకు భేదము లేదు.

ఘటాకాశము ఆకాశముయొక్క వికారముకానీ, యవయవముకానీ కానట్లే జీవుడు ఆత్మయొక్క వికారముకానీ, యవయవముకానీ కాడు. జీవుని జనన మరణములు లోకాంతర గమనాగమములు, సత్యములు కావు. అవి అవిద్యా కల్పితములు. ద్వైతమునకు అద్వైతము విరుద్ధము కాదు. ద్వైత మతములు పరస్పర విరుద్ధములు. అద్వైతమందు సర్వము పరబ్రహ్మమే అగుటన్జేసి అద్దానికి దేనితోనూ విరోధకారణము లేదు. ద్వైతమతములు రాగ ద్వేషాది అభిమాన పూరితములు. అద్వైతము పరమార్థము. ద్వైతము మనఃకల్పితము.

## ఆత్మ ఒక్కటియే సత్యము, నిత్య ప్రకాశము

మనోవ్యాపారమున్నపుడు మాత్రము మనస్సు కన్పించును. మనస్సు నిర్వ్యాపారమగు సుషుప్తి సమాధులయందు కాన్పించుటలేదు. అవిద్యాకృతమగు భ్రాంతిదశయందు తోచుటచే ద్వైత మద్వైతమునకు విరుద్ధము కాదు. సర్పభ్రాంతికి త్రాడు కారణమయినట్లు, జగద్భ్రాంతికి బ్రహ్మము కారణమగుచున్నది. పరమాత్మ జగద్రూపమున బుట్టుచున్నదను వాదము సహేతుకము కాదు. స్వభావమును మార్చ నెవరికిని శక్యము కాదు. నానాత్వము పరమార్థము కాదని అనేక శ్రుతులు చెప్పుచున్నవి. అంతియే కాక నిందించుచున్నవి. స్వప్నానుభవములు అసత్యమనుచున్నాము. స్వప్నానుభవముల వలెనే జాగ్రదనుభవము కూడా మానసిక మాత్రమగుటచే అదియూ అసత్యమని ఊహింపక తప్పదు.

అన్నింటికీ ద్రష్టయగు ఆత్మ చైతన్యము సత్యము. వివేక వైరాగ్యాభ్యాసములచే మనస్సును విషయములనుండి మరలించినపుడు అమనోభావము లభించును. కనుక ఆత్మ ఒక్కటియే సత్యము. మిగిలినవన్నియు అసత్యము. విషయాసత్యత్వ జ్ఞానము లేని మానసిక నిరోధమునందు కూడా విషయ వాసనలు నశింపవు. మానసిక నిరోధము సడలినపుడు అవి తిరిగి మొలకెత్తును. అనగా సుషుప్తి నిరోధమునందలి విషయ నివృత్తి, మనసు నిర్వ్యాపారమగుటచే సంభవించుచున్నది. అది తొలగినపుడు మనస్సు తిరిగి వ్యాపారవంతమయి విషయాభిముఖమగునని గ్రహించవలెను. సర్వ విషయజాతము అసత్యమను దృఢ జ్ఞానము కలిగినప్పుడు మనసు వానిపైపోదు. అత్యంత ఆకలిగొన్న వాడయిననూ అమేధ్యమును ఆశించునా? ఆశించదు.

సాక్షాత్కారమగు ఆత్మకు నిద్ర, జన్మము, నామము మొదలైనవి లేవు. అది నిత్య ప్రకాశ స్వరూపము. ఇట్టి జ్ఞానము నిర్వికార హేతువు. మిథ్యాత్మ జ్ఞానహీనమగు మనోనిగ్రహము కేవలము గడ్డిపోచతో సముద్రమును కాళీచేయు ప్రయత్నమువలె అత్యంత కష్టసాధ్యము. ప్రశాంతము, అభయమునగు స్థితి లభించుటకు దృఢమగు జగన్మిథ్యాత్మ జ్ఞానమొక్కటి మాత్రమే అవసరము.

## అజ్ఞానావరణముచే సర్వము పుట్టుచున్నది

ఏ వస్తువయినను పుట్టవలెనన్న సత్పదార్థమో, అసత్పదార్థమో లేక సదసత్పదార్థము నుండియో పుట్టవలెను కదా! పుట్టుక ఒక వికారము. కారణమే కార్యరూపమున వికారము జెందుచున్నది. సత్పదార్థము వికారము లేనిది కనుక జన్మకది కారణము కానేరదు. అసత్పదార్థము అనగా శూన్యమునుండి భావ రూపకమగున దేదియు పుట్టుట అసంభవము. సదసద్రూపము పరస్పర విరుద్ధము. కనుక పుట్టుక అనునది అసంభవము. బాహ్యములగు వస్తువులు పరస్పర భిన్నమగుట వలననే జ్ఞాన భేదము కలుగుచున్నది. వహ్నియని తలంచినంత మాత్రముననే దాహ దుఃఖము కలుగదు. దానిని చేతితో తాకినంతమాత్రమున దాహపీడ అనుభవించుచున్నారు. ఇటులనే బాహ్య పదార్థములు, వాని జ్ఞానముకంటె భిన్నములు. కనుకనే, వాని వలన వాని దుఃఖాదులు సంభవించుచున్నవి.

ఘటము మృత్తిక కంటె వేరు కాదు. అటులనే కారణ పరంపర నెంత అన్వేషించిననూ ఆత్యంతికమగు కారణము చిక్కదు. త్రాడునందు సర్పము లేకనే సర్ప భ్రాంతి కలుగుచున్నది. భ్రాంతియంతయు భావాత్మకము. అనగా మనఃకల్పితము. స్వప్నమునందు బాహ్యార్థము లేకనే ద్వైతమును, దుఃఖమును అనుభవించుచున్నాము. మానసికమగు జ్ఞానమునకు ఆలంబనము కానీ, నిమిత్తముకానీ లేవు. సత్య జ్ఞానము లేకున్ననూ భ్రాంతి జ్ఞానము కలుగవచ్చును. అవిద్యా దూషితమగు చిత్తమునకు భ్రాంతి స్వభావము. ఈ ఉపనిషత్తు సదసత్తులకు కారణ కార్య భావములు ఘటింపవని తెలిపినది. చిత్తమునకు పుట్టుక లేదు. వెలుగుచున్న అగరువత్తి యందలి వివిధాభావములు మరియొక చోటు నుండి పుట్టుట లేదు. అట్లే విజ్ఞానము చలించినపుడు కాన్పించు ద్రవ్యాభ్యాసములు విజ్ఞానమునందుగానీ, మరొక చోటునుండి కాని పుట్టుట లేదు. ఇవి యాభాస మాత్రములు, ద్రవ్యములు కావు. బాహ్య ధర్మములు చిత్తమునుండి కానీ చిత్తము బాహ్యధర్మములనుండి కానీ యుత్పన్నమగుటలేదు. అజ్ఞానమను ఆవరణముచే సర్వమును పుట్టుచున్నవి.

## ఆత్మ దర్శికి అంతా ఆత్మే అగుచున్నది

ఉత్పత్తి వినాశ లక్షణమగు సంసారము అజ్ఞానముయొక్క ఫలము. పరమాత్మయందు సర్వమాత్మ స్వరూపము కనుక జన్మము

కానీ కార్య కారణ భావములు కానీ ఉండనేరవు. ఆత్మ దర్శికి సర్వము ఆత్మయే అగుచున్నది. మాయామయమగు విత్తనముచే మాయామయమగు అంకురము ఉత్పన్నమగును. కానీ మాయా బీజాంకురములు రెండును అసత్యములగుచున్నవి. అటులనే జీవునియొక్క ఉత్పత్తి వినాశములు రెండునూ అసత్యములే. ఇవి శబ్ద మాత్రములు. స్వప్న ద్రష్టయొక్క చిత్తమతని కంటే వేరు కాదు.

నిమిత్తము లేకుండుటచే చిత్తమునకు పుట్టుక లేదు. ఉత్పత్తి హేతువులగు ధర్మాధర్మముల నిరసనముచే నుత్పత్తి లేకుండును. ఇదియే మోక్షము. ఉత్పత్తి యనునది కూడను చిత్త స్పందన మాత్రము. ఈ విషయమును తెలిసికొని తురీయమగు ఆత్మ తత్త్వమును విశేషముగా గుర్తెరుగవలెను. అందుచే అది విజ్ఞానమని పిలువబడుచున్నది.అట్లు తెలిసికొనినవానికి నామము, రూపము, వస్తువు, భావము మొదలగునవి అన్నియు ఆత్మయే యగుచున్నవి. సర్వ మాత్మయే. ఆత్మ తప్ప మరేమియూ లేదని అద్వైతము బోధించుచున్నది. ఆత్మ శూన్యము కాదు.

ఈ మాండూక్యము ఉపనిషత్తులన్నిటి కంటే హ్రస్వతమము. ఇందులో చేయబడిన విమర్శన ఇతర ఉపనిషత్తులకంటే అత్యంత విలక్షణము. కర్మ ప్రస్తావనము ఇందులో నేమాత్రము లేదు. కేవలము ఆత్మ తత్త్వము, దాని విచారణ మాత్రము ఈ ఉపనిషత్తునందు విషయమై ఉన్నది.



## 6.

# బృహదారణ్యకోపనిషత్

## మహత్తరమైన బ్రహ్మ తత్త్వ వివరణ

బృహదారణ్యకోపనిషత్తు శుక్ల యజుశ్శాఖాంతర్గతం. దీనియందు ఆరు అధ్యాయములు గలవు. అందులో మూడు నాలుగు అధ్యాయాలు తప్ప, తక్కిన నాలుగు అధ్యాయములు కర్మ సముచ్చితమగు ఉపాసనమును గూర్చి వివరించినవి. మూడు నాలుగు అధ్యాయములందు యాజ్ఞవల్క్యుడు జనకునకు ఆధ్యాత్మిక తత్త్వమును ఉపదేశించెను. యాజ్ఞవల్క్యుని ఆధ్యాత్మిక జ్ఞాన వైభవము ఇందులో పూర్తిగా ప్రదర్శింపబడినవి. ఇది ముముక్షు జనమునకు ఉత్తమమగు తారకమగుచున్నందున ఈ రెండు అధ్యాయములూ యాజ్ఞవల్క్య కాండమని ప్రఖ్యాతి గాంచినవి. ఈ ఉపనిషత్తు దశోపనిషత్తులలో కడపటిది. ఇది అర్థమునందును, పరిమాణమునందును మహత్తరమగుటచే బృహత్తనియు, అరణ్యమునందు పఠించుట వలన ఆరణ్యకమనియు, బ్రహ్మజ్ఞానోపదేకమగుటచే ఉపనిషత్తనియూ అలరారుచున్నది.

మొదటి రెండధ్యాయములు మధురకాండమనియు, తరువాత రెండధ్యాయములు మునికాండమనియు, చివరి రెండధ్యాయములు ఖిలకాండమనియు పండిత లోకమున వాడబడుచున్నవి. ఖిల శబ్దమునకు అనుబంధమని అర్థము. మొదటి కాండమందు తత్త్వము యథారూపముగ ఉపదేశింపబడినది. అయ్యదియే రెండవ కాండమందు అనుభవముచే సమర్థింపబడినది. మూడవ దానియందు దాని ఉపాసనా విధానము ప్రదర్శించబడినది. మొదటి కాండము జ్ఞానోపదేశము. అది కర్మోపాసనా సముచ్చయ రూపమున ఉపదేశింపబడినది. జిజ్ఞాసువులకు బ్రహ్మజ్ఞాపకములగు సాధనములు పదము, బీజము, సంఖ్య, రేఖ అను నాలుగు విధముల పిలువబడుచున్నవి. వానిలో పదమనగా వేదము. దాని అర్థబోధకమగు శ్రుతియు, బీజమనగా గురుముఖైకవేద్యమగు మంత్ర సముదాయము. సంఖ్య అనగా వైదికము, లౌకికము అని రెండు విధములు. వైదికమగు సంఖ్య మంత్ర సంకేతముగా అలరారుచు, తత్త్వమునకు సన్నిహిత సాధనమగుచున్నది. లౌకిక సంఖ్య, సర్వ ప్రపంచ వ్యవహార సర్వజనానుభవ సిద్ధమగుచున్నది. రేఖ కూడ సంఖ్యవలెనే రెండు విధములు. వైదికమగు రేఖ ఉపాసనాంగము. లౌకికమగు రేఖ గణిత శాస్త్ర ప్రసిద్ధము. మధురకాండము బ్రహ్మతత్త్వము. శాస్త్ర ప్రమాణమును ముఖ్యమైన ఆధారముగా చేసికొని విషయ వివరణము అచట చేయబడినది.

## ఈ జగత్తు నామ రూపాత్మకము; బ్రహ్మమే అమృతము

అశ్వమేధయాగమునందలి అశ్వము, యాగాధి దేవతయగు ప్రజాపతి స్వరూపమున వర్ణింపబడినది. ఎట్లనగా, ప్రజాపతి గుణములను దానియందు అధ్యారోపము చేసి ఉపాసించినచో అశ్వమేధయాగ ఫలము లభించును. దీనినే

అశ్వబ్రాహ్మణమందురు. అశ్వమేధయాగీయమగు అగ్నిని, ప్రజాపతిని ఉపాసించు రూపమని కూడ వర్ణింపబడినది. ప్రజాపతియే ప్రథమ పురుషుడు. అతని వలన నామ రూపాత్మకముగ జగత్తు అభివ్యక్తమగుచున్నది. దీనిని అగ్ని బ్రాహ్మణమని కూడ పిలిచెదరు.

అవిద్యచే వ్యాకృతమైన ఈ జగత్తు నామరూపాత్మకము. అనాత్మ భూతము కనుక వైరాగ్య కారణమగుచున్నది. సంసారమునందు ఆసక్తమగు చిత్తము బ్రహ్మచింతనము చేయదు. శబ్దములన్నియూ నామాత్మకములు. వీనికి వాక్కు కారణము. రూపములన్నిటికిని చక్షుస్సు కారణము. కర్మలన్నింటికి శరీరము కారణము. శరీరము వాగాది రూపమున నున్నది. ఇట్టి సంసార విముఖతను చెందినపుడే ఆత్మచింతనము సాధ్యమగును. ప్రాణము, దాని ఆధారమగు శరీరము, వివిధ జ్ఞానములకు సాధనములకు స్థానమగు శిరస్సు, ఆహారమువలన కలుగు బలము, ఇట్టి జ్ఞానముచే కలుగు లాభమును ఇందులో వివరింపబడినది. అనేక పుష్పరసములు సమాహార కార్యము మధువైనట్లు సర్వభూత నిర్మాణమగునది. ఈ పృథివ్యాది పంచభూతాత్మకమగు జగత్తు. అదే విధముగ ధర్మము, సత్యము, మనుజులు ఆదిగాగల ప్రాణికోటి, విరాట్పురుషుడు, ఇవి అన్నియు బ్రహ్మకార్యములగుచున్నవి. బ్రహ్మమే అమృతము. ఇట్టి బ్రహ్మజ్ఞానము సర్వాత్మభావ హేతువగుచున్నది.

## యజ్ఞ యాగోపాసనముల వివరణ

విదేహ రాజగు జనకుడు బహుదక్షిణాకమగు ఒక యాగమును చేసెను. కురుపాంచాల దేశములనుండి ఈ యాగమునకు అనేక బ్రాహ్మణులు విచ్చేసిరి. వారలలో తనకు బ్రహ్మ జ్ఞానముపదేశింపగల వారెవరైన ఉన్నారాయని అట్టివానికి కొమ్ములకు, పాదములకు సువర్ణములతో అలంకరింపబడిన వేయి గోవుల నిత్తునని వారలతో చెప్పెను. అయితే, అక్కడ చేరిన వారలొక్కొక్క విద్యయందగ్రగణ్యులైనను వారికెవరికి ఆ గోవులను తీసికొనిపోవుటకు ధైర్యము లేకుండెను. యాజ్ఞవల్క్యుడు ఆ గోవులను తన యింటికి తోలుకొని పొమ్మని తన శిష్యునకు ఆనతిచ్చెను. ఇందులకు అక్కడున్న బ్రాహ్మణులు కుపితులై యాజ్ఞవల్క్యుని పరీక్షింప దొడంగిరి. వారిలో మొదటివాడైన అశ్వలుడను జనకుని పురోహితుడు ప్రశ్నించిన కర్మోపాసనా సముచ్చయమగు ప్రాణాత్మ ప్రాప్తివిధానము, ఆయన ప్రశ్నలకు యాజ్ఞవల్క్యుడు చెప్పిన సమాధానములచే విస్తరింపబడెను. యజ్ఞ సాధనములకు ఋత్విక్కుల వాక్కు అగ్ని స్వరూపముగను, వాయు రూపమగు కాలమును సూత్రాత్మయగు వాయురూపమునను, యజమాని మనస్సును చంద్రునిగా భావించి ఆ మృత్యువు బారినుండి తప్పించుకొన శక్యము. ఈ విధముగా యజ్ఞయాగోపాసనములు వివరింపబడినవి.

## సంపూర్ణ నివృత్తి ద్వారానే ఆత్మ సాక్షాత్కారము

తదుపరి "పుణ్యపాప బోధితములగు ఇంద్రియములకు వశవర్తియై సంసారమున చరించు పురుషుడు ఒకడు కలడా? లేడా? ఉన్నచో అతని లక్షణములేవి?" అని అడిగిన భుజ్యువునకు యాజ్ఞవల్క్యుడు ఇట్లు జవాబు చెప్పెను. "నీ ఆత్మయే నీవడిగిన ప్రశ్నకు సమాధానము." అని హస్తవిన్యాసముచే చూపెను. చేతనాధిష్టితముకాక కేవల దారుయంత్రము తిరిగినట్లే శరీర యంత్రమొక విజ్ఞానమయునిచే నధిష్ఠింపబడక ప్రాణాది క్రియా చరణ సమర్థము గానేరదని యూహింపవలసియున్నది. శరీరము చేయు దృష్టి క్రియకు అతడు ద్రష్ట; శ్రవణ క్రియకు అతడు శ్రోతృ; మానస క్రియకు అతడు మననకర్త. శరీరము చేయు దర్శన, శ్రవణ, మననాది క్రియలు నశ్వరములు. వీనికి కారణము ద్రష్ట. శ్రోతృ అకారణము, చేతనాత్మకము. అది మనస్సంయోగముచే ఇంద్రియముల ద్వారా తద్విషయములను గ్రహించినపుడు ఆయా పనులు చేసినట్లు వ్యవహరించబడును. ఆ చేతనమే ద్రష్ట; అది దృష్టికూడ అగుచున్నది. ఆ చేతనమే ఆత్మ, ఇది ఇంద్రియములకు గోచరము కాదు. ఇది స్థూలసూక్ష్మ శరీరములకంటే భిన్నము. ఆత్మయను వాడొకడున్నాడనియు అట్టి ఆత్మయే మన అందరి ఆత్మయనియు నిశ్చయింపబడినది. సర్వ సన్యాసముచే అట్టి ఆత్మను పొందతగును.

పుత్ర విత్త దారలయందలి ఈషణలను ముందుగా పరిత్యజింపవలెను. కామమును ఆధారము చేసికొని ఈషణలన్నియూ కలుగుచున్నవి. ఈషణా త్రయములు ఒక్క జాతికే చేరుచున్నది. కర్మలు స్వయముగా గానీ, ఉపాసనా సముచ్చితము లయినప్పుడు కానీ, కామ నిమిత్తములే అగుచున్నవి. కర్మ సాధనేచ్ఛ ఆవశ్యకముగా ఫలేచ్ఛయే అగుచున్నది. ఇవి అన్నియు సన్యాసమునకు

విరుద్ధములు కనుక, వానిని వదలనిది సన్యాసము అబ్బదు. ఆత్మజ్ఞాన మావశ్యకము. చీకటి వెలుగుల వలె అత్యంత విరుద్ధములగు కర్మాచరణాత్మ జ్ఞానము లొక్కచోట ఒకమారు ఉండలేవు. సర్వ క్రియా పరిత్యాగము సన్యాసము. భిక్షాటనము కూడ కర్మయే యగును.

పూర్వపు బ్రాహ్మణులు ఇట్టి పరమార్థమును తెలిసికొని ఈషణా త్రయములను పరిత్యజించి, సంపూర్ణమగు నివృత్తి మార్గమున ఆత్మ సాక్షాత్కారమును గాంచిరి. ఆత్మను తెలిసికొని సాక్షాత్కారమును చేసికొనుటయే పాండిత్యము. ఇదియే బలము. అనాత్మ జ్ఞాన విషయమగు సర్వస్వమును పరిత్యజించువాడే బ్రాహ్మణుడు. తక్కిన దంతయూ గౌణము.

## బ్రహ్మ లోక విషయం శాస్త్రం ద్వారా తెలుసుకోవాలి

ఇక గార్గి ప్రశ్నము. బ్రాహ్మణ్యములలో వివరింపబడిన సర్వాంతర తత్త్వము దీనిలో వివరింపబడినది. పృథ్వీ సంబంధమగు ధాతు జాత మంతయు, ఉదకముచే పిండీభావము(ముద్ద) నొంది నివాస యోగ్యమగుచున్నది. లేనిచో పొడి బియ్యపుముద్దవలె ఎక్కడకక్కడ విచ్చిపోవును. ఇది అనుభవము. ఇది కార్య స్వరూపము. సూక్ష్మతరమగు జలకారణముచే వ్యాప్తమగుచున్నదని ఊహించి, పృథ్వి దేనియందు పడుగుపేకవలె అంటబడి యున్నదని? యాజ్ఞవల్క్యుని గార్గి అడిగెను.

దీనిని బట్టి చూడ పృథ్వి, జలము, ఆకాశము, సూర్య, చంద్ర, నక్షత్ర, దేవ, ఇంద్ర, ప్రజాపతి, బ్రహ్మ లోకములు క్రమముగా పూర్వాపూర్వ భూతములు, ఉత్తరోత్తర భూతములచే, వస్త్రమునందు నూలుపోగులవలె, పడుగుపేకవలె వ్యాపించియున్నదని ప్రశ్నవలన తెలియక తప్పదు. ఇవి ఊహచే తెలియునవి. బ్రహ్మలోక విషయము ఊహచే తెలియదగినది కాదు. ఇది శాస్త్రముచేతనే తెలిసికొనవలెను.

## అవ్యాకృత ఆకాశమున అక్షర పరబ్రహ్మ వ్యాపించియున్నాడు

గురూపదేశముచే తెలిసికొనవలసిన బ్రహ్మ లోకమును గూర్చి బుద్ధి యూహచే ప్రశ్నించిన గార్గి, యాజ్ఞవల్క్యునిచే నిషేధింపబడినది. వాయువుచే పృథ్వ్యాదులు వ్యాపింపబడి, సంరక్షింపబడుచున్నవి. కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు, ప్రాణములు ఐదు, మనస్సు, బుద్ధి ఈ పదునేడింటితో ప్రాణి కూడుకొనియున్నది.

పూర్వ కర్మ వాసనా సంవాసితము, సమిష్టి వ్యష్టి స్వరూపము. పృథివి వికారమునకు లింగ శరీరము వాయువుచే వ్యాప్తమయినది. వాయువుయొక్క బాహ్య రూపములు నలువది తొమ్మిది మరుద్గణములు. హారమునందలి ముత్యములను సూత్రమొక్కటిగ కూర్చినట్లు, వాయువు వీటన్నిటినీ ఒక్కటిగా కూర్చినది. వాయువు శరీరము నుండి లేచి పోయినపుడు అంగములన్నియు విడిపోవుచున్నవి. అప్పుడు శరీరము ప్రేతమని పిలువబడుచున్నది. ఆధ్యాత్మికమగు సర్వ ప్రపంచమునందూ ఎవడు ఉండి, వానికి అంతరుడగుచున్నాడో, ఎవనిని అవి తెలిసికోలేకున్నవో, ఎవనికి అవి శరీరమగుచున్నవో, ఎవడు లోపలనుండి వానిని నియమనము చేయుచున్నాడో, అతడంతర్యామి; అతడు మరణ రహితుడు; అతడే ఆత్మ.

సభ్యుల అనుమతి లేక ఇచ్ఛవచ్చినట్లు వదరుట, శాస్త్రార్థము చేయుట నియమములకు వ్యతిరిక్తము. కనుక సభ్యుల యనుజ్ఞను బడసి గార్గి రెండవ ప్రశ్న అడిగెను. అది ఏమనగా! "ద్వైతమగు ఈ జగత్తంతయు త్రికాలములయందు వ్యాపించియున్న సూత్రాత్మ దేనియందు వ్యాపించియున్నది?" అని ప్రశ్న. "అవ్యాకృతమగు ఆకాశముచే వ్యాప్తమగుచున్నద"ని యాజ్ఞవల్క్యుడు జవాబిచ్చెను.

"ఆకాశము దేనిచే వ్యాప్తమగుచున్నది?" అని మరి గార్గి ప్రశ్నించెను. అది అనిర్వచనీయమనియు, అది కాలత్రయాతీతమనియు దానిని వివరించుటకు యాజ్ఞవల్క్యుడు చాలడు, ఒకవేళ వివరించినా అది అనిర్వచనీయము, ఏ విధముగనయిననూ యాజ్ఞవల్క్యుడు ఓడిపోవును గదా! అని తలంచి, గార్గి పైరెండవ ప్రశ్న నడిగెను. ఇందుచే గార్గికూడ బ్రహ్మజ్ఞ పదవిని కాంక్షించినట్లు కాన్పించుచున్నది. దీనివలన బ్రహ్మజ్ఞానమును గూర్చి స్త్రీ పురుష భేదమున్నట్లు కాన్పింపదు. "అవ్యాకృతమగు ఆకాశమున అక్షరమగు పరబ్రహ్మము వ్యాపించి యున్నదని బ్రహ్మవిదులు పలుకుచున్నారు." అని జవాబు చెప్పి

గార్గి పన్నిన విషమ పరిస్థితులను రెండింటిని యాజ్ఞవల్క్యుడు తప్పించుకొనెను.

తరువాత అక్షరుని స్వరూపమును ఇట్లు వివరించెను. "స్థూల, సూక్ష్మ, పరిమాణము, వర్ణము, గంధము మొదలగు ద్రవ్య ధర్మములు అతనికి లేవు. కాన అతడు ద్రవ్యము కంటే భిన్నుడు. అతనిని తెలియజేయు ప్రమాణము లెవ్వియును లేవు. కాలమంతయూ అతని ఆజ్ఞచే ప్రవర్తింపబడుచున్నది. వేయేల? సూర్య చంద్రాది పంచభూతములు అతని ఆజ్ఞానుసారము నడుచుచున్నవి" అని యాజ్ఞవల్క్యుడు ఉపన్యాసము గావించెను. గార్గి విని ఆయనకు నమస్కరించుడని ఇతర బ్రహ్మవిదులకు ఉపదేశించి తాను విరమించుకొనెను.

## ఆత్మజ్ఞానికి శరీరంతో పనిలేదు

సూర్యకాంతివలె ఆత్మప్రకాశము సహజము. ఇది చూచుచున్నట్లు కాన్పించుచున్నను నిజముగా అది చూచుట లేదు. ఆత్మ అద్వితీయము. కనుక దానిచే చూడదగిన వస్తువేదియు లేదు. ఆత్మ జ్యోతిస్సొకటియే దర్శనాది విభిన్న నామములచే వ్యవహరింపబడుచున్నది. దర్శనాది రూపములన్నియూ మిథ్యా మాత్రములు. ఆత్మ అవయవరహితము. కనుక దర్శనాదులు అద్దానికి కల్పింప శక్యము కాదు.

బ్రహ్మానందము, పరమానందము ఇత్యాది ఇతరానందములు విషయేంద్రియ సంజాతము లగుటవలన అనిత్యములు. ఇతరానందములన్నియు బ్రహ్మానంద అంశములు. మనుష్య ఆనందము మొదలు, బ్రహ్మానందము వరకూ గల ఆనందములన్నియు ఒకదానికంటే ఒకటి అధికమై యున్నవి. ఇవి అన్నియు పరమానందము కంటే అల్పములు. పరమానందమును కొలచు మానమెద్దియునూ లేదు. తనకు తెలిసినదంతయు శ్రద్ధాళువై జనకుడు తెలిసికొన నుత్సాహపడుతున్నందుకు యాజ్ఞవల్క్యుడు సంతసించెను. శరీరము, ప్రారంభానుభవానంతరము (మరణానంతరము) వృక్షం నుండి పండిన ఫలము వలె చివరికి రాలిపోవును. మరియొక శరీరము ప్రవేశించును. శరీరము నుండి బయలుదేరే పురుషుని వాగాది సర్వేంద్రియములు అతని వెంట బయలుదేరును. శ్వాసము ఊర్ధ్వ గతి పొందును. మరణకాలమున వాగాదింద్రియములన్నియు ఉపసంహృతములు అగును. ఆత్మ ఉపసంహృతము కాదు.

పుణ్య కర్మలచే పుణ్యము, పాప కర్మలచే పాపము సంభవించును. పూర్వ వాసనలన్నియు నూతన శరీర ఆరంభకములగుచున్నవి. విజ్ఞానమయమగు ఈ ఆత్మ జలగలవలే నూతన శరీరము చూచుకొని, పూర్వపు శరీరమును వదలును. ఆత్మ జ్ఞానికి శరీర కారణమగు కామములు లేకుండుటచే శరీరముతో అతనికి పనిలేదు అతడశరీరుడగును. జ్ఞానమార్గమే బ్రహ్మవాది మార్గము. కర్మ లాచరించువారు తపస్సులో ప్రవేశించుచున్నారు. ఆత్మ జ్ఞానికి కామములు లేకుండుటచే మానసికమగు సంతానము లేదు. అట్టివాడే విశ్వ కర్త. బ్రహ్మ సాక్షాత్కారమును పొందినవారికి రక్షించుకొనదగిన దేదియును లేదు.

## జగత్తు బుద్ధి మాత్రమై బ్రహ్మలో లయమగుచున్నది

శాస్త్ర తర్కములచే విస్తరింపబడిన ఆత్మజ్ఞానము, తత్సాధన సన్యాసముకూడ అనుభవ రూపముగ యాజ్ఞవల్క్యుడు తన భార్యయగు మైత్రేయికి చేసిన జ్ఞానోపదేశ ముఖమున తెలియబడుచున్నది. సర్వ ప్రాపంచిక వస్తుజాలమును, ఇంద్రియాది పదార్థములను మనుజుడు స్వప్నప్రాయముగా భావించవలెను. వానిని కోరి ప్రయోజనము లేదు. ఆత్మ యొక్కటియే పరమ ప్రేమాస్పదము. ఆత్మకొరకు ఇతరములన్నియు ప్రేమాస్పదములగుచున్నవి. ఆత్మను తెలిసికొనువాడు సమస్తమును తెలిసికొనుచున్నాడు. కార్యములన్నియు కారణములందు లయమగుచున్నవి. జలములన్నింటికి సముద్రము గమ్యస్థానము. అటులనే రసములన్నిటికి రసనేంద్రియము, రూపములకు, చక్షువులకు, శ్రోత్రములకు, శబ్దములకు, సంకల్పములకు మనస్సు గమ్యస్థానము. అనగా జగత్తంతయు బుద్ధి మాత్రమై బ్రహ్మమునందు లయమగుచున్నది.

యాజ్ఞవల్క్యుడు భుజ్యు ప్రశ్న సమాధానమునందు, తన బ్రహ్మాండ నిర్మాణ పరిజ్ఞానమును ప్రకటించినాడు. గార్గి ప్రశ్నద్వయమునకు సమాధాన ముఖమున సాక్షాదపరోక్షమగు బ్రహ్మస్వరూపమును ఉపదేశించెను.

# స్త్రీలకు ఆత్మోపదేశమునకు అర్హత గలదు

సాకల్య బ్రాహ్మణములందు ఆయన తన విద్యా వైభవమును విజృంభించి శ్రోతల మనసుల నాశ్చర్య భయానక రసములో ముంచి వైచెను. పృచ్ఛకుల విషమ ప్రశ్నల ధాటికి తట్టుకొని జనక సభయందు విజయ పతాకమును నిలువబెట్టెను. జనకుని పునీతుని చేసెను. డొంక దోవల నేగిన భుజ్యుని విషమ ప్రశ్నలను, గార్గియొక్క ఇరుకు ప్రశ్నలను తన బుద్ధి సూక్ష్మతచే గ్రహించి, తగు సమాధానము చెప్పెను. జనకుని జ్ఞానమును సునిశ్చితము చేసెను. జనక సభావతంసయగు గార్గివలన అపూర్వమైన యోగ్యతాపత్రమును వడసిన యాజ్ఞవల్క్యుడు పండిత కులమునకు తలమానికమైన ఇతరుల యోగ్యతలను కనిపెట్టలేని వాడు కాడు. జనకునకు ఇంతకు పూర్వము ఉపదేశ విశేషముల నెఱుంగ జెప్పిన వివిధాచార్యుల యోగ్యతలను యధార్థముగ గుర్తెఱింగి ప్రశంసించెను. ఇంక తాను చేయు కార్యమేద్దియు లేదు అని సన్యసింప నిశ్చయించుకొని (తన భార్య యగు మైత్రేయి బ్రహ్మ చింతాసక్తయని అతనికి బాగుగా తెలియును) ఆమెకు కూడ బ్రహ్మ జ్ఞానోపదేశము చేసెను. దీనిని బట్టి చూడ స్త్రీలకు ఆత్మోపదేశమునకు అర్హత కలదని తెలియుచున్నది.



# 7.

# ప్రశ్నోపనిషత్

## పరబ్రహ్మ గురు శాస్త్రైక వేద్యము

ప్రశ్నోపనిషత్తు అథర్వణ వేదాంగము. ప్రశ్న, ప్రతి వచన పూర్వకముగా విషయ వివరణము చేయబడుటచే ప్రశ్నోపనిషత్తని పేరు వచ్చినది. ముండకోపనిషత్తునందు సంక్షిప్తముగా నుదాహరింపబడిన కొన్ని విషయములను విస్తరించుటచేత, ప్రశ్నోపనిషత్తు అర్థానికి వ్యాఖ్యానమగుచున్నది. విద్య పరమనియు, అపరమనియు రెండు తెఱంగులని ముండకము తెలిపెను. ఆ పరవిద్య కర్మ, ఉపాసనములని రెండు భాగములు. ఈ రెండింటిలో ఉపాసనము రెండవ మూడవ ప్రశ్నలయందు విచారింపబడినది. కర్మ విధానమంతయూ కర్మకాండయందు విస్తరింపబడి యుండుటవలన ఇచట ప్రస్తావింపబడలేదు.

కర్మోపాసనలు రెండును నిష్కామముగా ఆచరించిన వైరాగ్యహేతువు లగుచున్నవి. ఈ విషయమే మొదటి ప్రశ్నయందు వివరింపబడినది. ముండమును చదివిన పిదప ప్రశ్నోపనిషత్తును చదివిన విషయము విశదము కాగలదు. అపరబ్రహ్మము నిత్యమగు పురుషార్థమునకు సాధనము కానేరదని తెలిసికొని నిత్యఫలదమగు పరబ్రహ్మను వెదుకగోరి వీరు, పిప్పలాదుడను యోగ్యుడగు గురువును ఆశ్రయించిరి. అపర బ్రహ్మపరులగు వీరు స్వస్వరూపమే ఆత్మయని గుర్తెరుంగ లేకపోయిరని "అన్వేషమాణా"యను పదముచే సూచింపబడుచున్నది. నిత్యము, అద్వితీయమగు పరబ్రహ్మము గురు శాస్త్రైక వేద్యము. "సమిత్పాణి"యన గురువునకు ప్రియమైనట్టియు, అతని ఆశ్రమమునకు యోగ్యమైనట్టిదియును అగు కానుక చేతబట్టుకొనిన వాడని అర్థము.

వీరలకు పిప్పలాదుడు చెప్పిన ప్రతి వచనమేమన పరమ రహస్యము, గోప్యము అగు బ్రహ్మ విద్య, యోగ్యత లేనివానికి ఉపదేశ్యము కాదు. కనుక కొత్తగా వచ్చినవారి యోగ్యతను తెలిసికొనుటకై పిప్పలాదుడొక సంవత్సరము గడువు పెట్టెను. సంవత్సరము గడువు పూర్తి అయిన తర్వాత కాత్యాయనుడు పిప్పలాదుని "దేని వలన ప్రజలు పుట్టుచున్నారు?" అని అడిగెను.

ప్రజలందు కోరిక కలవాడు ప్రజాకాముడు. తననే ప్రజా రూపమున సృష్టించుకొను కోరికయే ప్రజాకామము. పరమాత్మ కంటే భిన్నుడు కానట్టి హిరణ్యగర్భుడే ప్రజాపతి. ఈ కల్పమునందు హిరణ్యగర్భుడు ప్రజాపతియై తరువాత ప్రజాకాముడయ్యెను. ఇతడు జన్మాంతరమున అనుష్ఠించిన అపర విద్యాకర్మ సముచ్చయ సంపన్నుడు. తత్కృతమగు జ్ఞానము నుద్బుద్ధము చేసికొని యుత్పాదనము చేసెను. ఇదియే అతడొనర్చిన తపము.

## వైశ్వానరోపాసన ద్వార సూర్య లోక ప్రాప్తి

సూర్యుడు తన కిరణములచే దశదిశల వ్యాపించి అచటి ప్రాణిజాతము నుద్దీపింప జేయుచున్నాడు. ప్రజాపతియొక్క స్వాత్మభావమగుటచే దిగ్జాతములకు కూడా ప్రాజాపత్య స్వాత్మభావము కలుగుచున్నది. కనుక ప్రాణ శబ్దముచే ఆదిత్యుడు

చెప్పబడుతున్నాడు. సమస్త జీవులు భోక్త రూపమున ఆదిత్య స్వరూపులగుటచే అతడు వైశ్వానరుడనబడుచున్నాడు. సకల ప్రపంచమతని స్వరూపమగుటచే అతను విశ్వరూపుడని కూడా వాడబడుచున్నాడు. విశ్వమునందలి నరులస్వరూపుడు గనుక వైశ్వానరుడనియు, విశ్వమే అతని స్వరూపము కనుక విశ్వరూపుడనియు అతనికి ప్రసిద్ధి గలిగినది.

ఇక్కడ సంవత్సరశబ్దము కాలమునకుపలక్షణము. అహోరాత్రముల సముదాయమే కాలము. సూర్య సంచారముచే అహోరాత్రములు, చంద్ర సంచారముచే తిథులు యేర్పడుచున్నవి. చంద్ర, సూర్య మిథునము ప్రజాపతి సముద్భూతమగుటచే సంవత్సరము, అయనములు మొదలగు విభాగములగు కాలము కూడా ప్రజాపతి స్వరూపమే అగుచున్నది. ప్రజాపతికి దక్షిణోత్తర మార్గములు రెండుకూడా కలవు. ప్రజాపత్యుపాసన మిచట జ్ఞానమని చెప్పబడుచున్నది. జితేంద్రియత్వము, వేదములయందు విశ్వాసము, జ్ఞానము ఇవి గల ప్రాణ స్వరూపుడు ఆత్మ తానేయని తెలిసికొని ఉత్తరాయణ మార్గమున సూర్యలోకమునకు పోవును. ఈ లోకము సకల ప్రాణులకు ఆశ్రయము. ఉపాసనా సహితమగు నిష్కామకర్మ నాచరించువాడును అచటికే పోవును. కాలాత్మకుడగు సూర్యుడు వసంతాది ఋతుపంచకము పాదములుగా గలవాడనియు, ద్వాదశ మాసములతని ఆకారములనియు, ఆదిత్యుడు సర్వలోక కారణుడనియు నాలుగు, ఆరు మంత్రములలో చూపబడుచున్నది. వర్షము ఆదిత్యునిచే కలుగుటవలన అతడు మూడవదియగు ద్యులోకమున జలము గలవాడని తెలియుచున్నది.

## ఈ శరీరం కార్య, కారణ సంజాతము

శరీరారంభకములైన ఆకాశ, వాయు, అగ్ని, జల, భూమి అయిన పంచ మహా భూతముల అభిమాన దేవతలును, కార్య స్వరూపములగు వాగాది కర్మేంద్రియముల యొక్కయు చక్షురాది జ్ఞానేంద్రియముల యొక్కయు అభిమాన దేవతలునూ, మనో బుద్ధులయొక్క అభిమాన దేవతలునూ. వీరిలో ప్రతి దేవతయునూ, కార్యకారణ సంఘాతాత్మకమగు ఈ శరీరము అను మేడ పడిపోకుండా స్తంభమువలే తామే నిలుపుచున్నట్లు కనబడుచున్నది.

పంచీకృత భూతాత్మకమగు పృథ్వివలన శరీరము ఉత్పన్నమగు చుండుటచే శరీరము పంచభూత కార్యమగుచున్నది. జ్ఞానేంద్రియములు జ్ఞానసాధనము లగుటంజేసి కరణము లగుచున్నవి. ఈ శరీరము కార్యకారణ సంఘాతము. బండికుండ ఆకు వలే శ్రద్ధాది నామాంతమగు సర్వము స్థితి కాలమునందు ప్రాణమునందే ప్రతిష్ఠితమగుచున్నది. అదే ప్రకారము ఋక్కులు, యజుస్సులు, సామములు అను త్రివిధములగు మంత్రములు. వానిచే నిర్వర్తింపబడు యజ్ఞము, ప్రజా పరిపాలనా సమర్థమగు క్షాత్రము, యజ్ఞాదులందు అధికృతుడగు బ్రాహ్మణుడు - వీరందరూ ప్రాణ స్వరూపులే అగుచున్నారు. ఎప్పుడు ప్రజాపతి మేఘ స్వరూపుడై వర్షించుచున్నాడో అపుడే ప్రజలందరూ జీవింతురు. ''ప్రపంచమునందు గల సర్వోపభోగ జాలము నీ ఆధీనము. అందువలన తల్లివలె నీవు మమ్ములను పాలింపుము. బ్రహ్మ క్షత్ర సంబంధములగు సంపదలన్నిటికిని నీవే కారణమగుచున్నావు. కనుక అట్టి సంపదను, ప్రజ్ఞను కూడా నీవు మాకు ప్రసాదింపుము'' ఋగ్యజుస్సామరూపములగు మంత్రములు బ్రాహ్మ్య సంపదలు. ధనాదులు క్షత్రియ సంపదలగుచున్నవి. ఇట్లు ప్రాణముయొక్క భోక్తృత్వ ప్రజా పతిత్వములు వ్యక్తీకరింపబడినవి.

## జీవాత్మ పరమాత్మల మధ్య భేదము ఉపాధికృతమే

తదుపరి భార్గవుని ప్రశ్నకు పిప్పలాదుడు సమాధానము చెప్పిన తరువాత ఆయనను అశ్వలాయనుడగు కౌసల్యుడు ప్రాణమును గూర్చి అడిగెను. అప్పుడు పిప్పలాదుడు, ''నాయనా! పురుషుని వలన నీడ గల్గుచున్నట్లు ఆత్మ వలన శ్రేష్ఠమగు ప్రాణము కలుగుచున్నది. ఈ ఆత్మయందు ఛాయను బోలు ప్రాణము మనస్సంకల్పాల చేత సమర్పితమగుచున్నది. ఒక రాజు తన యేలుబడిలో ఉన్న గ్రామములను పరిపాలించుటకు ఉద్యోగస్తులను నియమించినట్లు, ముఖ్య ప్రాణము ఇతర ప్రాణములను వాని వాని పనులయందు ప్రత్యేక ప్రత్యేకముగా నియోగించుచున్నది. ముఖ్య ప్రాణము ఆదిత్యాద్యధి దేవతలను ధరించుచున్నది. జ్వలించుచున్న అగ్నినుండి మిణుగురులు బయలు వెడలుచున్నట్లక్షరుడగు పరమాత్మనుండి ప్రాణిజాతములు పుట్టి అందే లయమగుచున్నవి'' అని బోధించెను. ఇవియే ముండకము 2-1-1 మంత్రమునందు ఉదాహరింపబడినవి.

తదుపరి గార్గి ప్రశ్నకు పిప్పలాదుడు ఇట్లు సమాధానము చెప్పెను. "అస్తమించుచున్న సూర్యునియొక్క కిరణములు అన్నియు తేజోమండలమగు సూర్యునియందు లయించి, ఏకత్వము నొందుచున్నవి. ఈ కిరణములే సూర్యుడుదయించు చుండగా తిరిగి బాహ్యమునకు వ్యాపించుచున్నవి. ఇదే విధముగా స్వప్న సమయములందు విషయేంద్రియ సంఘాతమంతయు, చైతన్య ప్రతిబింబముచే ప్రకాశితమగు మనస్సునందు లయమై ఏకీభావము నొందుచున్నది. నిద్రనుండి లేచి జాగ్రద్దశకు వచ్చినపుడు ఈ విషయేంద్రియ సంఘాతమంతయు సూర్య కిరణములవలె బహిర్గతములై స్వస్వ వ్యాపారముల నొనర్చుచున్నవి. కనుక స్వప్నమునందు పురుషుడు వినలేడు, చూడలేడు, స్పృశింపలేడు, నడువలేడు, పలుకలేడు, ఆనందక్రియలనుభవించలేడు. స్వప్న కాలమునందు ప్రకాశరూపమగు నాత్మ జాగ్రద్దశయందు దేనిని చేసినదో, చూచినదో, వినినదో, అనుభవించినదో దానినే అనుసరించి వాసనారూపమున దానినే చూచుచున్నది, వినుచున్నది, అనుభవించుచున్నది. ఆత్మ సర్వాశ్రయమని చెప్పుటచే దాని నాశ్రయించు సర్వము అద్దానికంటే భిన్నమని స్ఫురించుచున్నది. సర్వాధారుడగు పరమాత్మకును జీవునికిని కనబడుచున్న భేదము ఉపాధికృతముకానీ నిజము కాదని చెప్పబడుచున్నది. ఓంకారముచే ఏ బ్రహ్మమును ధ్యానించిన ఆ లోకము లభించును.

## పురుషుడు సర్వ కళా విహితుడు, మృత్యు రహితుడు

తదుపరి, భరధ్వాజ పుత్రుడగు సుకేశుడు పిప్పలాదుని అడిగిన ప్రశ్నకు ఇట్లు సమాధానము చెప్పెను. "నీవడిగిన పురుషుడు ఈ శరీరమునందే హృదయాకాశమున నున్నాడు. అతని వలననే నీ షోడశ కళలుత్పన్నములగుచున్నవి. అతనియందే లయమగుచున్నవి. మెట్లు రాళ్ళవలె ప్రధానముగా గాన్పించు పృథివి, ఓషధులు, అన్నము, పురుషుడను నాలుగు తత్త్వములు వరుసన నొకదానినుండి మరియొకటి యుత్పన్నమగునట్లు తైత్తరీయ ద్వితీయానువాకమున పేర్కొనబడినది.

ఓషధాది పురుషాన్తమగు సృష్టిప్రక్రియ ఇచట స్పష్టముగ కనిపించక పోయినను పురుషావయవములగు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ సృష్టి చెప్పబడుటచే తదంగమగు పురుషుని సృష్టికూడా చెప్పినట్లే అగును. నదులన్నియు సముద్రములోనికి ప్రవహించి తమ తమ రూప నామములను గోల్పోవుచున్నవి. సముద్రమున ప్రవేశించిన నదులన్నియూ సముద్రమనియే పిలువబడుచున్నవి. పురుషుడొక్కడు మాత్రమే సముద్రమువలె మిగులుచున్నాడు. అతడు సర్వ కళావిరహితుడు. మృత్యురహితుడు అయియున్నాడు. వేద్యమగు పరబ్రహ్మమును గూర్చి నాకింతవఱకు తెలుసును. ఇంతకంటే వేరేమియూ లేదు" అని పిప్పలాదుడు కబంధి మొదలగు ఆర్వురు శిష్యులను గూర్చి పలికెను. పిప్పలాదునికి ఆర్వురు శిష్యులు చేసిన కృతజ్ఞతా పూర్వకమగు నమస్కారోక్తిచే ఈ ఉపనిషత్తు ఉపసంహరింపబడుచున్నది. కన్నతండ్రి భౌతిక శరీరమును మాత్రమిచ్చును. ఆత్మ తత్త్వోపదేశముచే పిప్పలాదుడు వీరలకు బ్రహ్మ శరీరము నిచ్చెను.

## ఓంకారోపాసనచే బ్రహ్మమును పొందవచ్చును

అపర బ్రహ్మనిష్ఠులగు కబంధి, వైదర్భి, కౌసల్యుడు, సౌర్యాయణి, సత్యకాముడు, సుకేశుడను ఆర్వురు మహర్షులు పరబ్రహ్మ జిజ్ఞాసా ప్రేరితులయి పిప్పలాదుని క్రమముగా ఆరు ప్రశ్నలు అడిగిరి. ముండకోపనిషత్తు ప్రథమ ఖండమున పరా అపర స్వరూపము, బ్రహ్మము యొక్క జగత్కారణత్వము సూచింపబడినది. రెండవ ఖండమునందు అపర బ్రహ్మ నిమిత్తమగు కర్మకలాపమారంభమున స్తోత్రము చేయబడినను అంతిమ భాగమున దాని అనిత్యత్వము రూఢము చేయబడెను. పర అపర బ్రహ్మముల రెంటిని బొందుటకు ఓంకారముపాయముగ సర్వ లయ స్థానమగు పరమ తత్త్వము ఆరవ ప్రశ్నయందు విశదము చేయబడినది. ఇట్లీ ఉపనిషత్తు నందలి ఆరు ప్రశ్న లొకదాని తరువాత నొకటి సహేతుకముగ అడుగబడి వివరింపబడుచు, అచట విషయమంతయు ముండకమునకు వ్యాఖ్యాన రూపమును దాల్చినది.

1) పర అపర బ్రహ్మములకు గల సంబంధమేమి?

2) సృష్టింపబడిన ప్రజలు ఎవరిచేత సంరక్షింపబడుచున్నారు?

3) పరబ్రహ్మము వలన హిరణ్యగర్భుడెట్లు ఉత్పన్నమగుచున్నాడు?

4) అతనివలన సృష్టి ఎట్లు జరుగుచున్నది?

5) చైతన్య విశిష్టమగు ప్రాణము, శరీరమును ప్రవేశించి పంచవిధములుగ ఎట్లు విభక్తమగుచున్నది?

6) జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలయందు ఏ యే ఇంద్రియములు వ్యవహరించుచున్నవి?

ఇవి ఉపనిషత్తునందలి ప్రశ్నోత్తరములు.



# 8.

# కేనోపనిషత్

సామవేదీయ తలవకారాన్తర్భాగమునకు సంబంధించి యుండుట వలన దీనికే తలవాకారోపనిషత్తు అని కూడ పేరు గలదు. ఈ ఉపనిషత్తు మొదటి ఖండమున మొదటి శ్లోకము "కేన" అను పదముతో ఆరంభమగుట వలన కేనోపనిషత్తని కూడా పిలువబడుచున్నది.

శ్లో|| కేనేషితం పతతి ప్రేషితం మనః కేన ప్రాణఃప్రథమః ప్రైతియుక్తః|

కేనేషితాం వాచమిమాం వదన్తి చక్షుః శ్రోత్రం క ఉ దేవోయునక్తి||

## ఇంద్రియాధిష్ఠాన చోదన కర్త

శ్రోత్ర, త్వక్చక్షుర్జిహ్వా, ఘ్రాణములను పంచేంద్రియములకు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము లనునవి వరుసగా విషయములగుచున్నవి. ప్రపంచమునందు జ్ఞేయములగు విషయములన్నియు, ఈ ఐదింటిలో అవాంతర భేదమునందుచున్నవి. విషయములను తెలిసికొనగల అంతఃకరణ శక్తి మనస్సని పిలువబడుచున్నది. అట్టి మనస్సు జ్ఞానేంద్రియముల ద్వారా బహిర్గతమై ఆ విషయములతో సంబంధించినపుడు ఆ ఆకారమును పొందును. వివిధ విషయాకారములను పొందిన మానసిక స్థితి వృత్తి అనబడును. మనస్సు అచేతనము కనుక దాని వికారము కూడ అచేతనమైయున్నది. చెక్క బొమ్మ చెక్క ధర్మమును, చక్కెర బొమ్మ చక్కెర ధర్మమునే పొందియుండును కదా! కానీ, అచేతనమగు అంతఃకరణము వలన మనకు బాహ్య వస్తు జ్ఞానము కలుగుచున్నట్లు అనుభవ సిద్ధము. అచేతనమునకు చేతన సాధ్యమగు జ్ఞాన క్రియ చేతకాదు. రథముల నధిష్ఠించి నడిపించు సారథివలె, కర్మ జ్ఞానేంద్రియముల నధిష్ఠించి నడిపించు చేతన పదార్థము ఒకటి ఉండియే తీరవలెను కదా?

అంతఃకరణము, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, ప్రాణపంచకములు ఏదో యొక శక్తి చోదితములయి వ్యాపారవంతములగుచున్నవి. ఆ శక్తియే దైవము. అట్టి చోదనకర్త ఇంద్రియముల కంటే భిన్నుడని కూడా ప్రశ్నయందు అనుమానింప బడుచున్నది. దీనికి సర్వేంద్రియ అధిష్ఠాత ఎవరు? అతడు మనసుకంటే భిన్నుడయి ఉండవలెను కదా? కర్మ కార్యము అనిత్యమని తెలిసికొని విరక్తుడయి నిత్య వస్తు స్వరూపమును ఎఱుగగోరు వాడు దానిని గూర్చి తెలిసికొన ప్రయత్నింపడు. నిత్య వస్తువును తెలిసికొనుటకే ప్రయత్నించును. అట్టి నిత్య వస్తువు నిష్కళమగుటంజేసి స్వీయమగు ఇచ్ఛాక్రియాదులు అద్దానికి లేవు. కావున ఆ వస్తువు స్వీయమగు ఇచ్ఛాక్రియాదులచే మనస్సు మొదలగు ఇంద్రియముల ఆజ్ఞాపింపజాలదు.

కనుక మనస్సు, ప్రాణము, వాక్కు, చక్షుస్సు, శ్రోత్రము మొదలగు ఇంద్రియములు కార్య కారణ సంఘాతముచే చోదితములై స్వస్వ వ్యాపారములను నిర్వహించుచున్నవా? లేక చేతన వస్తువు యొక్క ఇచ్ఛవలన ప్రవృత్తము లగుచున్నవా? అని

సందియము. శబ్దమును గ్రహించు శక్తి శ్రోత్రములకు, రూపమును గ్రహించు శక్తి చక్షువులకు కలదు. అటులనే ఇతర జ్ఞానేంద్రియములకు కూడనూ తమ తమ విషయములను గ్రహించు శక్తి కలదు. మనసు జ్ఞానేంద్రియములతో నన్యతమముద్వారా విషయ సంయోగమును కోరినపుడు మనకు విషయజ్ఞానము కలుగును. అందుచే ఇంద్రియ పంచకము మనస్సు కూడా జ్ఞాన కారణములగుచున్నది. అవి అచేతనములు; చేతన వస్తు సాధ్యమగు జ్ఞానోత్పాదన కార్యనిర్వహణము నొనర్చుచున్నవి. నిత్యము, అసంహతము, సర్వాంతరమునగు ఆత్మ సాన్నిధ్యము చేతనే వీనికట్టి సామర్థ్యము కలుగుచున్నది. ఆత్మ జ్యోతిస్సనునది లేనిచో వీనికట్టి సామర్థ్యము కలుగదు.

## జగత్తంతా ఆత్మ తేజస్సుతో నిండియుండును

సూర్యుడు లోకమును తపింప జేయుచున్నాడు అను మొదలగు శ్రుతి వాక్యములా బ్రహ్మస్తంబమగు జగత్తంతయు ఆత్మ తేజస్సు చేతనే వ్యాపింపబడినట్లు ఈ ఉపనిషత్తు బోధించుచున్నది. సర్వేంద్రియములు ఈ ఆత్మతేజస్సులోనే వాటి వాటి వ్యాపారములను అవి చేయుచున్నవి.

ఒక ఉపమానము: కరెంటు అనగా విద్యుచ్ఛక్తి యంత్ర ముఖమున ఛేదన ముద్రణాది క్రియలు చేయుచున్నను, రెండింటికి నభేదము కల్పించి యంత్రమే ఛేదనాదికము చేయుచున్నట్లు చెప్పుదురు కదా? కానీ విద్యుచ్ఛక్తి ప్రసారము వలన ఛేదన యంత్రమునకు ఛేదకత్వము సంప్రాప్తమగుచున్నది. అటులనే ఆత్మజ్యోతిస్సు శ్రోత్రమునకు శ్రోత్రమగుచున్నది. ఆత్మజ్యోతి ప్రసారము వలననే మనస్సు మొదలగు సకలేంద్రియములు స్వస్వవ్యాపార నిర్వహణ సమర్థములగుచున్నవి. ఆ ఆత్మ తేజస్సే సకలేంద్రియములకు ఆయా రూప నామములకు ఆయా రూప నామములగుచున్నవి.

ఆ ఆత్మ తేజస్సు నిష్క్రియము. నిర్విశేషము. నిష్క్రియమగుటచే మనస్సు మొదలగు ఇంద్రియములచే నేపనిని చేయింపదు. కానీ అద్దాని సాన్నిధ్యముచేత వివిధేంద్రియములు స్వస్వవ్యాపారక్షమము లగుచున్నవి. నిష్క్రియమగు సూర్యకాంతి ప్రసారముచేతనే సమస్త వస్తుజాతము ప్రసన్నమగుచున్నది. నిర్విశేషమగు ఆత్మతేజస్సు శ్రోత్రాది ఇంద్రియముల ద్వారా ఆయా శక్తి రూపమున అభివ్యక్తమగుచున్నది. ఈ పరమ రహస్యమునే వరుణునిచేత తన కుమారుడగు భృగువునకు ఉపదేశింపబడినది. ఆత్మజ్యోతిస్సుచే ఉద్దీపితమై చక్షుస్సు స్వవిషయమగు రూపమును గ్రహించును గానీ తనను తాను ప్రకాశింపజేయు ఆత్మతేజస్సును ప్రకాశింపజేయజాలదు. దీపముచే ప్రకాశింపబడు ఇతర వస్తువులు దీపమును ప్రకాశింప జేయవు.

వాక్కు, నామ రూపములు, గుణము, క్రియ మొదలగు విశేషములతో నుండు పదార్థములను మాత్రము వర్ణింపగలదు గాని నామ రూప రహితము, నిర్గుణము, నిష్క్రియము, నిర్విశేషమగు పరమాత్మను వర్ణింప లేదు. మాధుర్యాది రసములను వాక్కుచే వర్ణింపలేము. ఆత్మ వాగ్విషయము కాదు. అచేతనమగు మనస్సు చేతనమగు విజ్ఞాత కానేరదు. కనుక, ఆత్మతేజస్సును మనస్సు తెలిసికొనలేదు. సర్వమును తెలిసికొను జ్ఞాతను తెలుసుకొను జ్ఞాత మరియొకడు లేకుండుటచే అతడు తెలియబడిన దానికంటే అన్యమగుచున్నాడు.

## ఉపాధి ద్వారా అభివ్యక్తమైన చేతన్యమే బ్రహ్మ

బ్రహ్మము విజ్ఞాన స్వరూపమే కనుక, అద్దానిని తెలిసికొన ప్రయత్నము సాధ్యము కాదు. విజ్ఞానముచే అన్యము తెలిసికొనబడును కాన విజ్ఞానము విజ్ఞానమును తెలిసికొనుట సంభవము కాదు. దీపము స్వస్వరూపాభివ్యక్తి కొఱకు స్వప్రకాశమును గానీ, మరియొక ప్రకాశమును గాని కోరదు. దీపకాంతి ఇతరములను ప్రకాశింపజేయును. తనను తాను ప్రకాశింప జేసికొనలేదు. నీవే ఆత్మవు. ఆత్మను తెలిసికొనవలెనని శ్రుతులు చెప్పుచున్నవి. ఆత్మ సర్వాత్మ స్వరూపము. ద్వితీయ మెద్దియూ లేకుండుటచే ఆత్మకు హేయోపాదేయత్వము లుండనేరవు. ఇట్టి ఆత్మ స్వరూపము శాస్త్రముచే తెలియబడును.

ఏది వాగింద్రియములచేత ప్రకాశింపబడదో దేనిచేత వాగాది ఇంద్రియములు ప్రకాశింపబడుచున్నవో దానినే బ్రహ్మమని అందురు. బ్రహ్మము హేయముగాని, ఉపాదేయముగాని కాదని ప్రథమ ఖండము తెలిపినది. అందువలన నేను బ్రహ్మమును

చూచితినని, తెలిసికొంటినని తలంచువానికి బ్రహ్మస్వరూపము మీమాంసయే అగును. బ్రహ్మమును నే తెలిసికొంటినను జ్ఞానము యథార్థ జ్ఞానము కాదు. తెలిసికొనువాని ఆత్మయే బ్రహ్మము అని సర్వ వేదాంతముల యొక్క సునిశ్చితార్థముకదా! అగ్ని తనను తాను దహింపలేనట్లే జ్ఞాత తనను తాను తెలిసికొనుటెట్లు? కాన బ్రహ్మమును తెలిసికొంటినను వాదన మిథ్యా జ్ఞానము; సత్య జ్ఞానము కాదు. బ్రహ్మమునకు మహాంతములు, ఆర్చకములునగు రూపములనేకము లుండుటచే ఇట్లు చెప్పుచుందురు. బ్రహ్మమునకు స్వరూపము లేకపోయినను, నామరూప ఉపాధికృతములగు రూపము లనేకములు గలవు. స్వయముగా ఆ పరమార్థ వస్తువు శబ్దము లేనిది, స్పర్శము లేనిది, రూపము లేనిది, మార్పు లేనిది, రసము లేనిది, నిత్యమైనది. ఏ ధర్మముచే ఏది నిరూపింపబడుచున్నదో అదియే దాని స్వరూపము. బ్రహ్మమును ఏ విషయము చేత, శాస్త్రము నిరూపించుచున్నదో అదియే దాని స్వరూపము. ఉపాధి ద్వారమున అభివ్యక్తమగుచున్న ఈ చైతన్యమే బ్రహ్మమని చెప్పబడుచున్నది.

ఈ చైతన్యము స్వయముగా నసంగమైనను, దేహాద్యుపాధి సంబంధమైనట్లు కాన్పించుచున్నది. జలముతోపాటు దానియందలి సూర్య ప్రతిబింబము కూడా చలించునటులగుపడుచున్నంత మాత్రముచే విప్రకృష్టములై కడుదూరమున నున్న సూర్యజలముల కేవిధమైన సంబంధము ఆరోపింప సాధ్యముకాదు. అదే విధమున దేహాదులకు వృద్ధి సంకోచచ్ఛేద నాశములు సంప్రాప్తమగుచుండగా ఆ ధర్మములు ఆత్మతో సంబంధింపబడుచున్నవి. స్వయముగా బ్రహ్మము బుద్ధిచేత ప్రయత్నించి తెలిసికొనువారికి తెలియరాదు. బుద్ధిచే తెలిసికొన ప్రయత్నింపని వారికి అది తెలియనగును. అది బుద్ధికి అతీతమైన స్వరూపము. అనుభవమునకే అది సాధ్యము.

## బ్రహ్మజ్ఞానానికి ఆత్మ సాక్షాత్కారమే ఫలం

బ్రహ్మజ్ఞానమునకు జిజ్ఞాసా నివృత్తియే పర్యవసానము; సాక్షాత్కారమే దాని ఫలము. ఈ సర్వోత్కృష్ట స్థానము సమాధి లభ్యము. సాక్షాత్కారమున కనివార్యముగా పూర్వాంగములగు శ్రవణ మనన నిధి ధ్యాసములు బుద్ధి విషయములే అగుచున్నవి. ఈ జన్మమునందే ఆత్మ స్వరూపమును తెలిసికొనిన యెడల దాని ఫలముగ సత్య స్వరూపము సిద్ధించును. అట్లు తెలిసికొనలేక పోయిన యెడల గొప్ప వినాశము కలుగును. జ్ఞానులగువారు ప్రతి భూతమునందును అద్వితీయమగు ఆత్మతత్త్వమును గ్రహించి ఈ లోకమునుండి పోయిన తరువాత జననమరణములు లేని వారగుచున్నారు.

## బ్రహ్మజ్ఞానికి ధర్మాధర్మములు, పుణ్య పాపములు నశించును

బ్రహ్మజ్ఞానమునకు అధికారి మనుజుడు. అతడు సమర్థుడై పూర్వోక్త లక్షణ లక్షితమగు పరమాత్మ స్వరూపమును పూర్వోక్త ప్రకారమున తెలిసికొనినచో వాని జన్మము సఫలమగును. అట్లు కానిచో వృథా యగును. సుప్రసిద్ధమైన పరబ్రహ్మము మెరుపు తీగవలె ప్రకాశించును. కనురెప్పపాటువలె అత్యంత శీఘ్రముగా ప్రకాశ తిరోధానములు గలది. ఇది బ్రహ్మయొక్క దైవిక స్వరూపము. బ్రహ్మయొక్క స్వరూపము దుర్విజ్ఞేయము. మనస్సు బ్రహ్మమునకు ఉపాధియగుటంజేసి, అది అత్యంత సమీపమున నున్నటుల కాన్పించుచున్నది. అందువలన మనస్సు బ్రహ్మమును పొందుచున్నట్లున్నది. నిజముగా అది అద్దానిని పొందుటలేదు. అత్యంత సామీప్యముచే నేను బ్రహ్మమునైతినని ప్రతిక్షణము సాధకుడు స్మరించుచున్నాడు. అందువలన బ్రహ్మ సాక్షాత్కారాభిలాష అతనికి పలుమారు కలుగుచున్నది. అట్టి స్మరణ సంకల్పాది చిహ్నములచేత బ్రహ్మ ముపాస్యమగుచున్నదని భావము.

బ్రహ్మజ్ఞానికి ధర్మాధర్మములు, పుణ్యపాపములు నశించును. ధర్మాచరణచే ఉత్తమ లోకము, అధర్మాచరణచే అధోలోకమును సంప్రాప్తమగును. రెండునూ బంధ కారణములే. సమస్త హృదయ గ్రంథులను శిథిలము చేసి, అవిద్య నంతమొందించి, సాధకుని అత్యంతము బ్రహ్మ సామీప్యమును పొందించునది కాన ఉపనిషత్తను పేరు వచ్చినది. బ్రహ్మ జ్ఞానమునకు తపస్సు, దమము, అగ్నిహోత్రాది కర్మలు ప్రతిష్ఠాభూతములు. వేదములు దాని అంగములుగా ఉన్నవి. సత్యమే అద్దానికి నివాసము. బ్రహ్మ జ్ఞానోపదేశమంతయు ఈ ఉపనిషత్తున చెప్పబడినది. ఈ ఉపనిషత్తున ఉపదేశింపబడినదంతయును సత్య జ్ఞానానంత లక్షితమగు బ్రహ్మ విషయమైయున్నది.



# 9.

# ఛాందోగ్యోపనిషత్

## కర్మోపాసనలు బ్రహ్మ జ్ఞానానికి కారణములగును

ఈ ఉపనిషత్తు సామవేదాన్తర్భాగమైనది. ఇది ఎనిమిది అధ్యాయములు కలిగియున్నది. మొదటివైన అయిదు అధ్యాయములు వివిధోపాసనములకును, కడపటి మూడధ్యాయములు జ్ఞానోపదేశమునకును వినియోగమైనవి. ఉపాసనకు చిత్తశుద్ధియూ బ్రహ్మజ్ఞానమునకు చిత్తైకాగ్ర్యము నియతములగు పూర్వాంగములు. కర్మచే చిత్తశుద్ధియూ ఉపాసనచే చిత్తైకాగ్ర్యము లభించును. ఇట్లు కర్మోపాసనలు బ్రహ్మజ్ఞానమునకు కారణము లగుచున్నవి. కనుకనే ముందు కర్మలు, తరువాత ఉపాసనలు పిమ్మట జ్ఞానము ఒకదాని తరువాత ఒకటి శాస్త్రములందు వివరింపబడినవి. ఛాందోగ్యము ప్రథమాధ్యాయమున సామమున కవయవమగు ఉపాసనలు చెప్పబడినవి. ద్వితీయాధ్యాయమున సమస్త సామము యొక్క ఉపాసనము వివరించబడినది. తృతీయాధ్యాయమున మధువిద్య అని ప్రసిద్ధి గాంచిన సూర్యోపాసనలు, గాయత్రి ఉపాసనము, శాండిల్య విద్యయు ప్రస్తావించబడినది. చతుర్థాధ్యాయమందు సంవర్గ విద్యయు, షోడశ కళా బ్రహ్మ విద్యయు ఉపదేశించబడినవి. పంచమాధ్యాయమున ప్రాణ విద్య, పంచాగ్ని విద్య, వైశ్వానర విద్యలు తెలుపబడినవి.

## సృష్టి అంతా తేజో, జల, వాయు, రూప సంమిశ్రణము

ఏ సద్వస్తు జ్ఞానముచే సర్వ వస్తు జ్ఞానమలవడునో అట్టి ఏక జ్ఞానమును ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతునకు ఉపదేశించెను. మట్టియును సువర్ణమును తెలుసుకొనినపుడు వీనిచే తయారయిన ఘట, కటక కుండ లాదులు తెలియబడుచున్నవి. మట్టియు సువర్ణము యదార్థములు. వాని వలన ఉత్పన్నములగు వస్తు జాలమంతయు వికారములు, నశ్వరములు, నామ రూపాదులు. ఘటకుండలాదుల వలె జగత్తు కూడనూ కార్యమగుట వలన దానికొక కారణముండవలెను. ఆ కారణము సత్ అని చెప్పబడుచున్నది. సత్ అనగా ఉండుట అని అర్థము. ప్రపంచమున కాన్పించు పదార్థము లన్నియు ఉన్నవి గనుక ఉండుట అనునది వీటి కన్నింటికి సమానము. ఘటము ఉన్నది, కుండలాదులున్నవి. ఉండుట అనునది ఘటము కుండలాదులు మొదలగు వస్తువులచే జోడింపబడి వాని ద్వారా అభివ్యక్తమగుచున్నది. అట్టి వస్తువులతో జోడింపబడక పోయినను ఆ ధర్మముండి యున్నది. స్థూల బుద్ధులకు అది అభివ్యక్తము కాకపోవచ్చును. గులాబి పుష్పమునందు అభివ్యక్తమగుచున్న రోజా వర్ణము గులాబి పుష్పము లేకున్ననూ ఉండియే యున్నది. గులాబి పుష్పమును ఆధారము చేసికొనినపుడు అది కాన్పించుచున్నది. ఆ పుష్పము లేనపుడది కాన్పించుట లేదు. అటులనే సమస్త వస్తువులకును సమానముగా ఉండుటయను ధర్మము వస్తు సంబంధము లేకున్ననూ ఎల్లప్పుడూ ఉండియే ఉన్నది.

సృష్టికి పూర్వము ఈ సత్ పదార్థము సద్ వస్తు మాత్రముగా నుండెను. అక్కాలమున అది శూన్య రూపముగా నుండెనని కొందరు తలంతురు; కాని ఇది సత్యము కాదు. సద్ వస్తువు సజాతీయ భేదము లేని ఏక వస్తువు. సత్ పదార్థము శుద్ధ సత్వ ప్రధానమగు మాయయందు ప్రతి ఫలించి ఈశ్వర స్వరూపమున సృష్టి క్రియ నొనర్చి తానే జగద్రూపమున అభివ్యక్తమయ్యెదనని సంకల్పించి తేజో జల వాయు రూపములో కాన్పించెను. సృష్టి యంతయూ ఈ మూడింటి సమ్మిశ్రణము వలననే కలుగుచున్నది.

## ఆత్మ తత్త్వ మెఱుగని శాస్త్ర పాండిత్యం నిష్ఫలం

వేదాధ్యయనము వంశపరంపరగా ఉద్దాలకుని వంశమునందు వుండుటచే అది సత్ కులమని ప్రసిద్ధి గాంచినది. అట్టి వంశములందు పుట్టిన వారందరూ కులీనులని పిలువబడుచున్నారు. సద్ వంశమున పుట్టిన శ్వేత కేతు ఉపనయనమైన తరువాత గురుకులమున వేదాధ్యయనము చేయక కాలహరణము చేయుట తండ్రికి విచార కారణమయ్యెను. బ్రాహ్మణ వంశమునందు పుట్టి వేదాధ్యయనము చేయనివాడు, స్వయముగా బ్రాహ్మణుడు కాడు. బ్రాహ్మణులు తనకు బంధువులని మాత్రము చెప్పుకొనగలడు.

కుమారుడు గురుకులవాసము చేసి విద్య నభ్యసించుటకు తగినవాడని కనిపెట్టి ప్రేమతో అతనిని మందలించెను. శ్వేతకేతు ద్వాదశ వర్షములు గురుకులవాసము చేసి, ఇరువదినాల్గు సంవత్సరముల అతని వయసు వచ్చునప్పటికి అర్థ సహితముగా నాలుగు వేదములను గ్రహించిన చతురమతి యయ్యెను. ఆ విద్యాగర్వముచే అతడుద్ధతుడై తనతో సరిపోలువారు లేరనియు, తానే సంప్రదాయశీలుడనని తలంచుచు వినయము లేనివాడై స్వగృహము చేరెను. అట్టి శ్వేతకేతువును చూచి తండ్రి యిట్లడిగెను.

“నాయనా! నీకు సరిపోలువారు లేరనియు నీవే సాంప్రదాయకుడవనియు తలంచుచూ అవినీతుడవగుచున్నావు. కేవల శాస్త్రాచార్యైక లభ్యమగు నట్టియు పరబ్రహ్మమును గూర్చి చెప్పునట్టియు ఆదేశము నుపదేశింపుమని నీ గురువును నీవడిగితివా? ఆ ఆదేశమెద్దియన దేనిని వినుట చేత వినబడనిదంతయూ వినబడినదగుచున్నదో, దేనిని ఊహించుట చేత ఊహింపబడనిదంతయూ ఊహింపబడినదే అగుచున్నదో అట్టిది ఆ ఆదేశము.” కుమారుని గర్వము పోగొట్టుటకై తండ్రి ఈ ప్రశ్న నడిగెను. సమస్త శాస్త్ర పారాయణుడైనను ఆత్మతత్త్వ మెఱుంగనివాడు కృతకృత్యుడు కాడని దీని భావము.

పరమార్థమగు నా సత్పదార్థమే శ్వేతకేతునివంటి జీవుడగుచున్నాడు. చేతన వంతములగు సత్పదార్థము ఉపాధి భేదముచే వ్యక్తి భేదము నొంది అనేక జీవ రూపముల భాసించుచున్నది. సుషుప్తి సమయము నందీ భేదము నశించి జీవులందరు స్వస్వరూపమున ఆనందమనుభవించుచున్నారు. జాగ్రదవస్థయందు అనుభూతములగు నేను రంగడు, నేను గంగడు, నేను తండ్రి, నేను పుత్రుడు అను మొదలగు జ్ఞానము లన్నియు సుషుప్తియందు నశించుచున్నవి. మధుకరములచే వివిధ పుష్పములనుండి చేర్చబడిన మధురసము సర్వ భేద శూన్యమై ఏక రసము నొందుచున్నది.

గంగ, కృష్ణ, సింధు మొదలగు విభిన్న నామముల బరగుచున్న నదులన్నియు సముద్రమును చేరి స్వస్వరూప నామముల బోగొట్టుకొని సముద్ర భావమును పొందుచున్నవి. జీవుడు నిత్యుడు. మరణ రహితుడు. కర్మ ఫలముగ అనేక జన్మల నొందుచు ప్రతి జన్మమునందు పూర్వ వాసనా ప్రేరితుడై వ్యవహరించుచున్నాడు.

మరణము శరీరానికే గాని జీవునికి కాదు. మఱ్ఱి విత్తనము చితకగొట్టినను అంకురించుచునే యుండును. జలములో కలసిపోయిన లవణము చేతికి చిక్కకపోయిన జలమునందంతట నున్నట్లు రుచిచే తెలియబడుచున్నది. అజ్ఞానముచే జీవుడు స్వస్వరూపమును గుర్తెరుగ జాలకున్నను, విచారణచే యథార్థ జ్ఞానమును పొందినపుడు చోరులచే నడి అడవులలో వదలిపెట్టబడిన ధనికుని వలె జీవుడు కూడ స్వస్థానమునకు చేరగలడు. ఇట్లు స్వస్థానమును పొందిన జీవుడు సర్వ సంసార వినిర్ముక్తుడగును. అట్లు కానివాడు పూర్వ వాసనా బలముచే సౌషుప్తిక సుఖమునుండి యుత్థితుడగు నరునివలె తిరిగి మృత్యుస్వరూపమగు సంసారములో జిక్కుకొనును.

## ప్రపంచం బ్రహ్మమునందు పుట్టి, ప్రతిష్ఠితమగుచున్నది

బ్రహ్మ ఏకమేవాద్వితీయ మనియు, పరిదృశ్యమానమగు జగత్తంతయు తత్స్వరూపమేయనియు నిరూపింపబడినది. ఇట్టి పరబ్రహ్మమును తెలిసికొను స్థానము, అద్దాని సత్యకామాది సగుణ స్వరూపము, అద్దాని పొందు సాధనము బ్రహ్మోపాసకులు పోవు సుషుమ్నా మార్గము అని పేర్కొనబడుచున్నది. సర్వ వ్యాపియయిన బ్రహ్మము హృదయాకాశమున సులభముగా దొరకును. రాజు నగరమునువలె బ్రహ్మము హార్దాకాశము నధిష్ఠించి యుండుటచే అది బ్రహ్మవేశ్మమని పిలువబడుచున్నది. బ్రహ్మము హృదయ కుహరముచే పరిచ్ఛిన్న మగుట లేదు. విషయ విముఖులగు యోగులు నిర్మలమగు హృదయాకాశమున విజ్ఞాన జ్యోతిస్స్వరూపమగు పరబ్రహ్మమును పొందగలరు. ప్రపంచమంతయు బ్రహ్మమునందు పుట్టుచు, రథ చక్ర నాభియందుండు ఆకులవలె అద్దానియందు బ్రతిష్ఠితమగుచున్నది.

శరీరముయొక్క జరామరణాది వికారములా వస్తువునంటవు. బ్రహ్మముయొక్క కామములు, సంకల్పములు కూడ అమోఘమగుటజేసి అతడు సత్యకాముడనియూ, సత్యసంకల్పుడనియూ జెప్పబడుచున్నాడు. ఇదికాదు, అదికాదు అని తోసివేసిన తరువాత మిగిలియున్నది పరబ్రహ్మమగుచున్నది. ఇదియే ముముక్షువులు కోరు పరమార్ధము. బ్రహ్మమును ఇట్లు తెలిసికొను వారలు సార్వభౌమ పదవిని చేరి కామచారులగుచున్నారు. సమస్త కామములు విశుద్ధ సత్య సంపన్నుడగు జ్ఞానియొక్క హృదయాకాశమున సత్యములయి కాన్పించుచున్నవి.

## బ్రహ్మచర్యం ఆత్మోపలబ్ధికి ముఖ్యం

ఆత్మయే సమస్త లోకములను ధరించు సేతువగుచున్నది. అతడు అశరీరుడు. అతనికి పాప సంపర్కముండనేరదు. అతని పొందిన వాడంధుడైనా సనంధుడే అగుచున్నాడు. బ్రహ్మచర్యమాత్మోపలబ్ధికి ముఖ్య స్థానము. యజ్ఞము, సత్రాయణము, ఉపవాసము మొదలగు వాని ఫలము బ్రహ్మచర్యము వలననే గలుగును.

శరీరమునందలి అసంఖ్యేయములగు నాడులందు సూర్యతేజస్సు ప్రవేశించును. ప్రాణోత్క్రమణ సమయమునందు ఇంద్రియములన్నియు మనస్సును చేరును. మానసికోపాధికుడగు జీవుడు నాడీద్వారమున హృదయాకాశమును జేరును. జ్ఞానియగు జీవుడు అవసాన సమయమున సుషుమ్నా ద్వారమున సూర్యకిరణముల ద్వార సూర్య లోకము చేరి అచటినుండి బ్రహ్మ లోకము చేరును. అజ్ఞాని ప్రాణములు చక్షురాదీతర మార్గమున కర్మానురూపములగు అనిత్యములగు ఇతర లోకములను చేరును. ఇటులనే సుషుప్తియందుకూడా సర్వేంద్రియ వివరణముచే అజ్ఞాన పూరితమగు సుఖానుభవము గల్గుచున్నది.

## స్మరణతో సర్వము అనుభూయమానము

సంకల్పాలన్నింటికి చిత్తమే స్థానము. అవి అన్నియు చిత్త స్వరూపములు. చిత్తమునుండి పుట్టినవి. చిత్తమునందు ప్రతిష్ఠితములైనవి. చిత్తము సంకల్పాలకు మూలమగుటచే అనేక శాస్త్రముల నభ్యసించిన విద్వాంసునికి చేతనత్వము పోయినపుడు అతడు లేనివానితో సమానమని లోకులు చెప్పుదురు. బ్రహ్మ బుద్ధితో చిత్తము నుపాసించువాడు సౌష్ఠవము గలవాడగును. చిత్తము సంకల్పముల కంటే గొప్పదగుచున్నది. మనస్సు మొదలగునవి సంకల్పమునందున్నవి. సంకల్పమే వాని స్వరూపము. సంకల్పము మానసిక వృత్తి. చిత్తము సంకల్ప కారణము. సంకల్ప మిచ్ఛా కారణము. కర్తవ్యాకర్తవ్యములను విషయ విభాగముచే సమర్థించుట సంకల్పమనబడును. తరువాత దానిని వాక్కుతో చెప్పును. ఇచ్ఛగించిన దానిని నామముతో చెప్ప గోరును. శబ్ద విశేషములగు మంత్రములు నామ మంత్రములై వాని యంతర్భావము లగుచున్నవి. మంత్రములందు కర్మ లేకమగుచున్నవి. అమంత్రమగు కర్మ యుండనేరదు.

ధ్యానము చిత్తమునకంటే అధికమైనది. ధ్యాన విషయమగు దేవతా బుద్ధిచే శాస్త్ర విహితమగు సాలగ్రామాది కనిష్ఠ వస్తువులందితర చిత్త వృత్తులచే చెదరని బుద్ధి వృత్తిని నిలుపుట ధ్యానమందురు. దీనినే చిత్తైకాగ్ర్యమనియు వాడుదురు. ధ్యాన నిష్ఠుడగువాడు నిశ్చలుడగుచున్నాడు. అదే విధముగా పృథివి నిశ్చలముగా నున్నది. ఆ తీరుననే అంతరిక్షము, ద్యులోకము, జలములు,

పర్వతములు, దేవతలు, మనుష్యులు శమాది గుణ సంపత్తిచే దేవతా సమానులగు మనుష్యులు కూడ ధ్యానము చేయుచున్నటుల నచంచలముగా నున్నారు.

విజ్ఞానము ధ్యానము కంటే ఉత్తమమైనది. శాస్త్రార్థము తెలిసికొను జ్ఞానము విజ్ఞానమందురు. అది ధ్యానముచే లభ్యమగుట వలన ధ్యానముకంటే ఉత్తమమని తెలుపబడినది. బలము విజ్ఞానముకంటే నతిశయమగును. అన్నము భుజించుటచే కలిగిన జ్ఞేయములగు విషయములందు మనస్సు ప్రతిభను పొందు సామర్థ్యము బలము. జ్ఞేయ విషయములందు ప్రసరించు వానిని సులభముగా గ్రహించు బుద్ధి సామర్థ్యము ప్రతిభ, ఇది అన్నముచే పోషింపబడుచున్నది. అన్నము బలము కంటే అధికము. పది దినములు అన్నము తినకుండినచో అట్టివాడు మరణించును. మరణించక జీవించియుండినచో, గురువు వలన విషయములు గ్రహించి శ్రవణము చేయలేడు. మననము చేయలేడు.

దీనికంటే తేజస్సు అధికమైనది. తేజస్సునుండి జలము, జలమునుండి అన్నము పుట్టును. కాన తేజస్సు రెండింటికీ అధికమైనది. తేజస్సు వాయువును బంధించి వెచ్చగా చేయును. అపుడాకాశమంతయూ వేడిగా నుండును. తేజస్సు ముందుగా వాయుతత్త్వమై తరువాత జలమునుత్పత్తి చేయుచున్నది. తేజస్సే ఉరుము రూపమున వర్ష హేతువగును.

ఆకాశము తేజస్సుకంటే గొప్పది. శబ్దమాకాశ మూలమున వినబడుచున్నది. ఆకాశమునందే ప్రియ వస్తు సంయోగము వలన అన్యోన్య క్రీడ జరుగుచున్నది. ఆకాశమునందే బీజమంకురించు చున్నది.

స్మరణ మాకాశమున కంటే గొప్పది. పూర్వమను భూతమైన దానిని జ్ఞాపకమునకు తెచ్చుకొను అంతఃకరణ ధర్మము స్మృతి అనబడును. స్మరణ ఉన్నప్పుడే సర్వము అనుభూయ మానమగుచున్నది. అది లేనపుడు ఆకాశాది వస్తువులను గూడా స్మరించుట శక్యము కాదు. అందువలన స్మరణ ఆకాశమునకు కారణమగుచున్నది.

## సశరీరునకు సంసారము, అశరీరునకు స్వస్వరూపము

ఈ విధముగా అవిద్యచే దేహ తాదాత్మ్యము నొందిన జీవుడు ప్రతిబుద్ధుడైన తరువాత సంప్రసాద స్థితి జేరి ఈ శరీరమును వదలి దేహాదుల కంటే విలక్షణమగు స్వస్వరూపమును పొందును. అతడుత్తమ పురుషుడు. స్వస్వరూపమును పొందినవాడె సంకల్ప మాత్రమున ఇందరి రూపమును బోలి, యొకప్పుడు నవ్వుచు, ఒకప్పుడు క్రీడించుచు, జ్ఞాతులతో రమించుచు, శరీరమును స్మరింపడు. సశరీరునకు సంసారము, అశరీరునకు స్వస్వరూపము సంప్రాప్తి యగునను విషయము, దృష్టాంతముచే వివరింపబడుచున్నది. ప్రసిద్ధములగు వాయువు, మేఘములు, ఉరుములు, మెరుపులు, అనువానికి శిరఃప్రాణాద్యాకృతి లక్షణమగు శరీరము లేదు. వర్ష సమయమున ఇవియాకాశ తాదాత్మ్యమును పొంది దానియందు లయమగుచున్నవి.

ఓంకారోపాసనాది సాధనా సహితముగా ఆత్మ జ్ఞాన అష్టాధ్యాయియగు ఈ ఉపనిషన్ముఖమున పరమేశ్వరుని వలన హిరణ్యగర్భునకు, ఆయన వలన కశ్యప ప్రజాపతికి, మనువునకును, మనుష్యులకును క్రమాగతము లగుటచే ఈ విద్య సంప్రదాయ సిద్ధమగుచున్నది.



# 10.

# ఐతరేయోపనిషత్

## బ్రహ్మ లక్షణాలు: సర్వ వ్యాపకత్వం, సర్వ భోగం, సతత గమనం

ఈ ఉపనిషత్తు ఋగ్వేదాంతర్గతమైనది. ఆత్మతత్త్వ ప్రతిపాదితమగు కాండషట్కముతో అలరారుచున్నందున ఆత్మ షట్కమని ప్రసిద్ధి గాంచినది. అవిద్యా నాశన పూర్వకమగు ఆత్మ దర్శనము సంప్రాప్తమయి ఆత్మ జ్ఞానము కలుగునటుల శిష్యునిచే చేయబడినది. ''ఆత్మ'' ''వ్యవహార విశిష్టము'' అని కేవలము రెండు విధములు. వ్యవహార విశిష్టుడైనపుడు అతడు జీవుడని పిలువబడుచున్నాడు.

ప్రతి మనుజునియందూ ఆత్మ జ్ఞానేంద్రియముల ద్వారా బాహ్యమునకు స్ఫురించుచున్నాడు. ఆత్మ శబ్దము ''ఆత్'' అను ధాతువునుండి ఉత్పన్నమగుచున్నది. ఆ ధాతువుకు వ్యాపకత్వము, భక్షణము, గమనమని మూడర్థములు కలవు. సర్వ వ్యాపకత్వము, సర్వ భోగము, సతత గమనము లక్షణములుగా గలది ఆత్మ. ఇవియే బ్రహ్మ లక్షణములు.

జాగ్రత్ అవస్థయందు సర్వ భోగములు అనుభవించుచున్నాడు. కనుక ఆత్మ శబ్దమునకు భోగపరుడనియు, స్వప్నమందు సర్వేంద్రియములు స్వస్వవ్యాపారములు మాని పరమావస్థను జెందినపుడు జాగ్రదనుభవ వాసనలను స్వీయకాంతిచే జగద్రూపమున సృజియింప స్వీకరించువాడనియు, సుషుప్తియందు సర్వేంద్రియములు మనస్సు గూడా పరమావస్థను పొందినపుడు, సర్వవ్యాపియై ఏమియూ తెలియని కేవలము సుఖస్వరూపమును పొందువాడనియు, ఇట్లు జాగ్రత్స్వప్న సుషుప్త్యాది అవస్థా త్రయములనుబట్టి ఆత్మ శబ్దార్థము నిర్వచించబడినది. ఉపాధి విశేషముచే ఆత్మ పరిచ్ఛిన్నముగా గాన్పించిననూ, పరమార్థముచే అతడు నిరుపాధికుడు. దేశ, కాల, వస్తు పరిచ్ఛిన్నములు లేనివాడు. అనగా అనంతుడు. ఇదియు ఆత్మ శబ్దమునకు అర్థము. ఇట్టి ఆత్మ సర్వజ్ఞుడు, సర్వ శక్తిమయుడు, సర్వ ధర్మవర్జితుడు, నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావుడు, అద్వయుడు. ఆత్మకు అవయవ భేదములు లేవనియు తెలియుచున్నది.

ప్రత్యక్షాది ప్రమాణములచే ఈ జగత్తంతయు అనుభవ గోచరమగుచున్నది. కనుకనే మూల మంత్రమునందు అది ''ఇదం'' ''ఇది'' అని హస్త విన్యాసముల చేతనే అనునట్లు నిర్దేశింపబడుచున్నది. ఇది వివిధ నామ రూప సంకులమై సృష్టియని ప్రసిద్ధిగ జెప్పబడుచున్నది. సృష్టి శబ్దము ఒక కార్యమును తెలుపుచున్నది. సృష్టి కార్యమునకు పూర్వము ఈ జగత్తు ఏ రూపమున నున్నది? '' ఇదం అగ్రే ఆత్మా ఏవ ఆసీత్'' అనగా మన ఎదుట కాన్పించుచున్న ఈ జగత్తు సృష్టికి పూర్వము ఆత్మగానే యుండెను. శ్రుతి కూడా ఈ విషయమును తెలిపియే యున్నది. సృష్టికి పూర్వమున నున్న జగత్తు, తరువాత నున్న జగత్తు రెండూ ఒక్కటే! సృష్టికి పూర్వము అవ్యాకృతమై కేవలమాత్మ రూపమున నుండెను.

## సృష్టి అంతా మాయా కల్పితము

సృష్టి తరువాత అనేక నామ రూపములతో వ్యాకృతమై అదియే కాన్పించుచున్నది. ఇంద్రియ గోచరత్వము వ్యాకృతి లక్షణము. ఇంద్రియ అగోచరత్వము అవ్యాకృత లక్షణము. నామము శబ్దాత్మకము. వాక్కుచే అభివ్యక్తమగుచున్నది. ఇతడు రంగడు అనే వాక్యమున రంగడు అను నామము వాక్కుచే ఉచ్చరింపబడినపుడు వినబడుచున్నది. శ్రుతి విషయమగు శబ్దము దాని కర్థమగు రంగడను చక్షు విషయమగు రూపము కూడ బుద్ధికి గోచరములగుచున్నది. ఇట్టి శబ్దార్థములు రెండునూ సృష్టికి పూర్వము లేవు. అందువలన అపుడు ఆత్మయను అవ్యాకృత రూపముననున్న జగత్తు వాగ్బుద్ధుల కగోచరమగుచున్నది. సృష్టి అనంతరము నామ రూపాత్మకమగుటచే వాగ్బుద్ధులకు గోచరమగుచున్నది. పూర్వమద్వితీయముగా ఉన్న స్థితిని ఆత్మయనియు, నామ రూపములచే అనేకాకారముల భాసించు స్థితిని జగత్తనియు ఒకే వస్తువు వ్యవహరింపబడుచున్నది.

అదే విధముగా సముద్ర జలము కూడ ఫేన, బుద్బుద, తరంగములను అనేక నామ రూపముల అభివ్యక్తమగుచున్నది. ఇదియే సృష్టికి పూర్వోత్తరములన్న భేదము. సృష్టి మాయాకల్పితమగుటచే ఆత్మకంటే భిన్నముగా మాయయను యొక వస్తువు ఉన్నటుల శంకింప నవసరము లేదు. మాయయనునది ఆత్మయొక్క శక్తియే! అది ఆత్మకంటే భిన్నము కాదు. శక్తి, శక్తిమంతునికంటే భిన్నము కాలేదు కదా! ఆత్మ సజాతీయ, విజాతీయ, స్వగత భేద రహితమని, "ఏకః ఏవ" అను రెండు పదములచే తెలుపబడినది. అంత మాత్రముచే ఆత్మ యొక్క అద్వితీయత్వము నిస్సందేహముగా స్థిరపడుటలేదు. త్రాడే సర్పరూపమున భాసించినట్లు, ఎండమావులే నీటివలె భాసించునట్లు, ఆత్మయే జగదాకారమున మాయాశక్తిచే భాసించుచున్నదని దీని భావము.

సృష్టి యెంద్రజాలమును బోలు నొక కార్యము. దానికి కారణముండవలెను; పరబ్రహ్మయే దానికి కారణము. త్రాటియందు గల్గు సర్పభ్రాంతికి త్రాడే కారణము. ఆత్మ అద్వితీయుడు, అశరీరుడు, ఇంద్రియాది సాధనరహితుడని తెలియుచున్నది గదా! అటులయిన అతడాలోచించి, లోకమును సృజించెనని శ్రుతి తెలుపుచున్నదే అని యోచించుటకు చోటు లేకపోలేదు. అయితే సృష్టి యంతయు ఇంద్రజాలికుని విద్య వలె మాయాకల్పితమగుచున్నది.

## లోకపాలకులు, ఇంద్రియాధిష్ఠాన దేవతల సృష్టి

మాయ ఆత్మ శక్తియే కదా! శక్తియొక్క విజృంభణము కదా! ఈషణాది క్రియా రూపమగు అభివ్యక్త క్రియాచరణ. మనయందలి శక్తి అవసరమైనపుడు క్రియారూపమున విజృంభించుచున్నది. అపుడు ఆ క్రియను మనము చేసితిమను చెప్పుచున్నాము. కాని మనయందలి శక్తి చేసినది అంటున్నామా? అటులనే ఆత్మ శక్తియగు మాయచే చేయబడిన ఈషణాది క్రియ ఆత్మయందు ఆరోపింపబడుచున్నది. ఇట్లు సృజింపబడిన లోకములన్నియు అచేతనములగుటంజేసి వాని సంరక్షణ కర్త యొక్క సృష్టి అనంతర మంత్రమున నుదాహరింపబడుచున్నది. పరమాత్మ లోకమును సృజించిన తరువాత ఆలోచించెను. లోకమును సృజించి లోకపాలకుడు లేక లోకమెట్లు నడుచునని? యంత్రమును సృజించి, యంత్రమును నడుపువాడు లేకున్న యంత్రమెట్లు నడుచును? అటులనే సృష్టికి లోకపాలకుడు కావలెనని పరమాత్మ సంకల్పించెను.

జల ప్రధానములగు పంచ భూతములనుండి విరాట్పురుషుని సృజించి అతనిని శిరః ప్రాణాద్యవయవ సంయోగముచే చేసెను. కుమ్మరి చెరువునందలి మట్టిని తీసి ముద్ద పాకముగా చేయును. అదే విధముగా బ్రహ్మాండ లోకపాలకుడు, సమిష్టి రూపుడును అగు విరాట్పురుషుని పిండాకృతిని పంచభూతములనుండి ఆయతము చేసెను. ఆపై ఆ పురుషుని అవయవములనుండి లోకపాలుర ఉత్పత్తి చేసెను. అటు తరువాత పరమాత్మ తిరిగి ఆలోచించి ఆ పిండమునకు అవశ్యమగు ఇంద్రియ గోళములను, ఇంద్రియములను, అధి దేవతలను కూడా సృజించెను. ఆ పిండమునకు ముఖ గోళము వాగింద్రియము. వాని కధిష్ఠాన దేవత అగ్ని; నాసికా గోళములు ఘ్రాణేంద్రియములు; శ్రోత్రేంద్రియములు తదధిష్ఠాన దేవతలగు దిక్కులు, ఈ రీతిగా ఆయా ఇంద్రియ అధిష్ఠాన దేవతలను సృజించెను. అధిష్ఠాన దేవతలు ఆయా ఇంద్రియముల ననుగ్రహించుటే వాని పాలన. కన్నులు, చెవుల ఆకారములు బాగున్ననూ ఇంద్రియములు లేకుండుటచే గ్రుడ్డితనము, చెవుడు సంభవించుచున్నవి. అధిష్ఠాన దేవతల

అనుగ్రహముచే ఇంద్రియములు వ్యాపారవంతములగుచున్నవి. వీటన్నిటిని ఒకదానినుండి మరియొకటి సృజించెను.

## మనుష్య శరీర మొక్కటి మాత్రమే మోక్షసాధకము

పరమేశ్వరుడు పూర్వము వలెనే ఉదకములోనుండి గోవును, తరువాత అశ్వమును సృజించి, దేవతలు సంతృప్తులు కానందున, దేవతల ప్రార్థనతో విరాట్పురుష దేహమును బోలు పురుష శరీరమును సృజించెను. ఆ పురుష శరీరము వివేక సంపన్నమగుటంజేసి అందులకు దేవతలు సంతసించిరి. మనుష్యేతర శరీరములు అన్నియూ కేవలము ఫలభోగ భూములు మాత్రమగుచున్నవి. మనుష్య శరీరమొక్కటి మాత్రము మోక్షసాధనమగు వివేకముతో కూడుకొని యుండుటతో ఇతర శరీరములకంటే విలక్షణమై సుకృత మనిపించుకొనుచున్నది.

ఈ నూతనాయాతనముతో దేవతలు తృప్తి నొందినందున పరమేశ్వరుడు వారిని వారి వారి యథోచితములగు ఇంద్రియాయతనముల ప్రవేశించుట కాజ్ఞాపించెను. తదనుసారముగా వారి వారి సాధనములందు దేవతల ప్రవేశము చూపబడినది. వివిధ దేవతలు తమ తమ స్థానములగు పురుష శరీరమునందలి వివిధేంద్రియముల ప్రవేశము ఈ రీతిగా నున్నది. వాగ్రూపమున అగ్ని ముఖమును, ప్రాణవాయు రూపమున వాయువు నాసాపుటములను, తేజో రూపమున సూర్యుడు నేత్రములను, శ్రోత్రేంద్రియ రూపమున దిక్కులు కర్ణపుటములను, రోమ రూపమున ఓషధీ వనస్పతులు చర్మమును, మనో రూపమున హృదయమున చంద్రుడును, మృత్యువు అవసాన రూపమున నాభిని, జలములు తేజోరూపమున శిశ్నమును ప్రవేశించెను.

తరువాత పంచ సూక్ష్మమహాభూతములనుండి ఘనీభూతమగు నొక ముద్ద నాతడాయత్తము చేసెను. ఈ మూర్తియే అన్నము, జల సహితమగు భూమినుండి మనుష్యుల కుపయోగించు లేహ్యములు కలుగుగాక అని సంకల్పించెను. పరమేశ్వరుడు శరీరమును ప్రవేశించు మార్గమును విచారించి, శిరోగ్ర భాగమును జీర్చి, ఆ భాగమున జీవ భావముతో దేహేంద్రియ సంఘాతమును ప్రవేశించెను. ఈ ద్వారమే ''విధృతి'' అని పిలువబడుచున్నది. వాన్దనమని కూడా పిలువబడుచున్నది. ఇట్లు జీవ రూపమున ప్రవేశించిన పరమేశ్వరునకు మూడు నివాస స్థానములు కలవు. ఈ మూడునూ స్వప్న స్థానములే అగును. క్రియా రూపమగు ప్రాణ రూపమున, పాదముల ద్వారా, జ్ఞాన రూపమున, శిరో ద్వారముల ద్వారా జీవుడు ప్రవేశించును. అందువలననే జ్ఞానేంద్రియములన్నియు శిరస్సున కధోభాగమున నున్నవి. జీవుని ప్రవేశమునకు ప్రత్యేకముగా జేయబడుటచే ఈ ద్వారము చీల్చబడినది. శిరస్సున తైలధారణ చేయబడినపుడు ఈ ద్వారమున నీరసము తెలియబడుచున్నది. ఈ ద్వారమే సుషుమ్నానాడి కంతిమ భాగమై యోగులు కన్ను ముఖమున ప్రాణోత్క్రమణము చేసి ముక్తులగుచున్నారు. ఇయ్యది బ్రహ్మమును చేరు మార్గమగుటచే దీనిని బ్రహ్మరంధ్రమని కూడా అందురు.

## జీవరూపం ద్వారా పరమాత్మ స్వప్రకాశుడగుచున్నాడు

ఇట్లు శరీరపురిని ప్రవేశించిన పరమాత్మ జీవరూపమున దేహేంద్రియ సంఘాతమున కంతకూ అధిపతి అయి దానికి ఏలిక అగుచున్నాడు. వేషధారియగు నటునివలె నా సంఘాతముఖమున బాహ్యమునకు స్ఫురించుచూ ప్రారబ్ధము ననుభవించుచున్నాడు. ప్రభువగు అతని సాన్నిధ్యమున బుద్ధి యను నర్తకి, ఇంద్రియములు వేయు తాళమునకు మేళవించుచు నొక విషయమునుండి మరొక విషయమునకు నాట్యము చేయును. ఇట్లు జీవి రూపమున పరమాత్మ స్వప్రకాశుడగుచున్నాడు.

ఇట్టి జీవాత్మకు నేత్ర, కంఠ, హృదయములు మూడును క్రీడాస్థానములు. జాగ్రత్కాలమున నేత్రమందును, స్వప్న కాలమున కంఠమందును, సుషుప్తి కాలమున హృదయమందును జీవుడు క్రీడించుచుండును. నేత్రము లందుట్టిపడు బ్రహ్మ తేజస్సుచే ముఖము ఒక నూతన వికాసము నొందుట అనుభవ సిద్ధము. అట్టి జీవికి స్వస్వరూప జ్ఞానము కలిగిన తరువాత ఎచట చూచిననూ ఆత్మకంటే వ్యతిరిక్తమగు వస్తువు వున్నదని నిర్వచింపలేకపోయినను, కారణముచే బ్రహ్మమే ఈ పురుషాకారమున వ్యాప్తమైనట్లును తెలిసికొనును. ఇట్టి జీవబ్రహ్మ తత్త్వము విచారణ చేయు మనుజుడు కృతకృత్యుడగుట ఆశ్చర్యము కాదు.

## జాగ్రదాద్యవస్థలు ఆత్మకు సంబంధించవు

జాగ్రదాద్యవస్థలు ఆత్మకు సంబంధించినవి కావు. అవి కేవలము దేహేంద్రియాది కార్యకారణ సంఘాతమునకు చేరినవే. మనుజునకునూ స్వీయమగు దేహమొకటి, పుత్రాత్మకమగు దేహమొకటి. ఇట్లు దేహద్వయము కలదు. మరణమాసన్నము అగుచుండగా తాను చేయవలసిన స్వాధ్యాయాధ్యయనము, యజ్ఞము మొదలగు పుణ్య కర్మల నాచరించుటకు కుమారుని తన ప్రతినిధిగా నేర్పఱచి, తండ్రి తాను చేసిన పుణ్యకర్మ ఫలమగు భావి శరీరమును వాసనా రూపముగా గ్రహించి ఈ శరీరమును వదలి మరియొక శరీరమున బుట్టును. ఇదియే తండ్రియొక్క తృతీయ జన్మము. మొదటి మూడవ మంత్రమునందు చెప్పిన రెండు జన్మములు కుమారునివి. ఇచట చెప్పబడుచున్న తృతీయ జన్మము తండ్రిది.

వామదేవర్షి ఆత్మస్వరూపమును ఈ ప్రకారముగా తెలిసికొనిన వాడై ప్రారబ్ధమగు దేహమును మంత్రగర్భ నివాస మంత్రానుభవము వలననే నశింపజేసి, సర్వ సంసార బంధ విముక్తుడై పరమాత్మ భావమును పొంది ఆ రూపమును సర్వ కాలముల అనుభవించెను మరియు మరణ రహితుడయ్యెను.



## 11.

# తైత్తిరీయోపనిషత్

ఈ ఉపనిషత్తులో బ్రహ్మ విద్యోపదేశ ముపక్రమింపబడినది. ఈ తైత్తిరీయము శీక్షావల్లి, బ్రహ్మానందవల్లి, భృగువల్లి అని మూడు భాగములుగా నున్నది. ఇందు బ్రహ్మ జ్ఞానోపదేశికలగు చివరి రెండు వల్లులు ముఖ్యము. బ్రహ్మ విద్యకు దేవ ఋష్యాదులు కూడా విఘ్నకారులగుచున్నారు. అట్టి విఘ్నము లుపశమించుటకును చిత్తైకాగ్రత లభించుటకు నుపయోగించు కొన్ని ఉపాయములు శీక్షావల్లియందు ఉపదేశింపబడినవి. ఈ వల్లియందు పండ్రెండు అనువాకములు గలవు. బ్రహ్మానందవల్లి, భృగువల్లియను చివరి రెండు ప్రత్యేక నామములచే వ్యవహరింప బడుచున్నవి. ఈ వల్లీద్వయము మోక్షమునకు సాక్షాత్సాధన భూతమగు వారుణీ విద్యయని ప్రసిద్ధి గాంచుటచే రెండింటికినీ విషయమొక్కటియే అగుచున్నది. పఠన సౌకర్యమునకు మాత్రము ప్రత్యేక వల్లులుగా పరిగణింపబడుచున్నది.

## అజ్ఞాన నాశమే మోక్ష హేతువు

శీక్షావల్లియందు కర్మకు విరుద్ధములగు సంహితాది విషయములు కర్మ సముచ్చితములగు ఉపాసనలు వివరింపబడినవి. స్వారాజ్యము దీని ఫలము. ఇంత మాత్రమున సంసార బీజ మశేషముగా నాశన మొందనేరదు. ఉపాసన కామనా విరుద్ధము కాదు. దానిచే కర్మ వలెనే ఉపాసనము కూడా మోక్షహేతువు కాదు. అజ్ఞానము సంసార కారణము. ఇది నశించుటచే మోక్ష మబ్బును. అజ్ఞానము సహజ సిద్ధము. మనము కూర్చున్న రెలు బండి నిలిచియుండి ప్రక్కన మరియొక బండి పోవుచుండగా మనము కూర్చున్న బండియే పోవుచున్నట్లు ప్రత్యక్షముగా కనబడును.

ఇట్టి అజ్ఞానమునకు కారణము విచారించి ప్రయోజనము లేదు. దానిని పోగొట్టుకొను మార్గము మాత్రము అన్వేషింపవలయును, సంసారబీజమగు ఈ అజ్ఞానము బ్రహ్మజ్ఞానము చేతనే తొలగిపోవును. మరియొక త్రోవలేదు. కర్మ ఫలము నశ్వరమని, శాస్త్రముచేతను, యుక్తిచేతను ప్రత్యక్షముగా తెలియుచున్నది. కర్మోపచితములగు స్వర్గాది లోకములను పరీక్షించి వానిచే స్వతఃసిద్ధమగు మోక్షము కలుగనేరదని ముముక్షువు నిర్వేద మొందుచున్నట్లు శాస్త్రము చెప్పుచున్నది. కర్మ కార్యమగు స్వర్గము కూడా అనిత్యమే! నరక స్వర్గములు మొదలగునవి కర్మఫలములగుటంజేసి దానిచే యుత్పన్నమగుచున్నవి.

కర్మకు పూర్వమేవీ లేవు. ఏది పుట్టుకకు పూర్వము లేదో, ఏది పుట్టి నశించునో అది లేనిదే అగుచున్నది. ఆద్యంతములయందు లేని వస్తువు వర్తమానమునందు కూడా లేదనియే భావింపనగును. కర్మచే పుట్టు ఫలము నిత్యము కానేరదు. ఆకాశ పుష్పమెంత ప్రయత్నించిననూ లభ్యము కాదు. ఉన్నదానిని పుట్టింప నెవరికినీ సాధ్యము కాదు. మోక్షము సిద్ధపదార్థమైనను అది అజ్ఞానముచే తెలియరాకున్నది. అజ్ఞానము పోయినప్పుడు అది ప్రత్యక్షముగా తెలియును. అంతకు పూర్వము సిద్ధమైనను తెలియబడని అనేక శక్తులను పరదేశమునను వెదకి కనుగొనినారే గాని వాటినెవరు క్రొత్తగా పుట్టించలేదు కదా? అటులనే

సిద్ధమగు మోక్షమును కనుగొనవలెను.

బ్రహ్మ జ్ఞాన బోధకములగు వేదాన్తములను విశ్వాస భావముచే శ్రవణము చేయవలెను. అప్పుడే అజ్ఞానము నశించును. సర్వ సంసార బీజ కారణమగు అజ్ఞానము పోగొట్టుకొని బ్రహ్మ జ్ఞానోపదేశమును సేయుటయే బ్రహ్మవల్లి లక్ష్యము.

## వికారమసత్యం; వికారము లేనిది సత్యం

ప్రతి మానవుడును అవిద్యా ప్రయుక్తమగు కామనచే బోధితుడై అత్యంత ఫలాధిక్యమును కోరుట సహజము. కర్మల నాచరించుటకు మహా ప్రయత్నము చేసి యవి నిత్యమగు మోక్షము నీయజాలవని తెలిసికొని నిర్విణ్ణుడగుచున్నాడు. అత్యంత ఫలతృష్ణ యింకను అతనిని వదలలేదు. సంసారమును జూచి భయము నొందుచున్నాడు. ఇక్కడ సత్యము, జ్ఞానము, అనంతము అను మూడు శబ్దములు బ్రహ్మ శబ్దముతో ప్రత్యేకముగా జోడింపబడి అద్దాని లక్షణమును బోధించుచున్నవి. ఈ మూడు శబ్దములు పరస్పర మొకదానితో మరియొక దానికి సంబంధము లేదు. ఈ పదములు కేవలము విశేషణములు కాక ఉన్నవి. సజాతీయ వస్తువులలో నుండి విశిష్ట ధర్మములు లేని వస్తువులను తోసి పుచ్చుటయే విశేషణముయొక్క లక్షణము.

ఇటులనే సత్యము బ్రహ్మము అనుచోట సత్య శబ్దమును విశేషణముగా గ్రహించినచో, సత్యవిదూరములగు ఇతర బ్రహ్మముల నుండి ప్రకృత బ్రహ్మము సత్యమను విశేషణముచే వ్యవహరింపబడుచున్నది. అదే విధముగ జ్ఞానానంత విశేషణములచే వానికి విరుద్ధార్థకములగు జడ స్వరూపములు, దేశ కాల వస్తు పరిచ్ఛిన్నములు అగు బ్రహ్మములు ప్రకృత బ్రహ్మము నుండి ప్రత్యేకింపబడుచున్నట్లు తోచుచున్నది. లక్షణము వస్తు స్వరూప నిరూపణముచేసి దాని ప్రత్యేక వ్యక్తిత్వమును వ్యక్తీకరించును. లక్షణముచే లక్షితమగు ప్రతి వస్తువు జాతీయ విజాతీయములగు ఇతర వస్తువులన్నిటి నుండియు వ్యావర్తింపబడుచున్నది.

ఏ పదార్థము ఏ రూపమున నిశ్చితము కాబడుచున్నదో ఆ రూపమునకు మార్పు లేనప్పుడు అది సత్యమనబడును. నిశ్చితమగు దేని రూపము మార్పును చెందునో అది అసత్యము. వికారమసత్యము. వికారము లేనిది సత్యము.

## కర్మాచరణ సహజ రాగ ప్రాప్తము

బ్రహ్మము సత్యమనుటచే అది నిర్వికారము, నిత్యము అనియు తదిరములగు సవికారములు బ్రహ్మము కావనియు తేలుచున్నది. బ్రహ్మము సత్యమగుటచే బ్రహ్మేతరమగు జగత్తు వికారస్వరూపము, అనృతము కనుక అది బ్రహ్మము కాదనియు తేలుచున్నది. జ్ఞాన జ్ఞేయ జ్ఞాతృ పదార్థములన్నియును బుద్ధియందు నిగూఢముగా నుండుటచే అది "గుహ"యని పిలువబడుచున్నది.

ఈ ఉపనిషత్తునందు బ్రాహ్మణమున వివిధ ధర్మములు వివరింపబడినవి. అవి కామ్యములు, నైమిత్తికములు, నిమిత్తములు అని మూడు విధములు. కర్మల నాచరింపుమని శాస్త్ర మెవ్వరినీ నియోగింపదు. మనుజునకు కర్మాచరణము సహజ రాగప్రాప్తము. కామన ప్రవృత్తికి ముఖ్య కారణము. కామనానురూపముగా మనుజుడు ప్రవర్తించి యద్దాని ఫలము ననుభవించును. సహజ సిద్ధములగు కోరికలను పడయు మార్గమును మాత్రము శాస్త్రముపదేశించుచున్నది.

అధ్యయనాధ్యాయనములను గూర్చి ప్రమాదములను పొందకుము. సత్యమును గూర్చి ప్రమాదమును పొందకుము. ధర్మమును గూర్చి ప్రమాదమును పొందకుము. తల్లినే దైవముగా భావించుము. తండ్రియే దైవముగా భావించుము. ఏ పనులు నింద్యములు కావో అవియే నీకు సేవింపదగినవి. తదితరములు సేవ్యములు కావు.

## ఉపదేశాత్మకం బ్రహ్మవల్లి; అనుభవాత్మకం భృగువల్లి

శ్రవణ, మనన, నిధిధ్యాసములను మూడు ఆత్మ సాక్షాత్కారోపాయములుగ నుపదేశింపబడినవి. వీనిలో మొదటిది అగు శ్రవణము వేదములయందు సంపూర్ణ విశ్వాసము కలిగి గురుసన్నిధియందు చేయతగినది. అందువలన బ్రహ్మముయొక్క పరోక్ష జ్ఞానమబ్బును. మననాత్మకమగు తపస్సు భృగువల్లియందు ఉపదేశింపబడుచున్నది. మననముచే నిశ్చితమైన నిర్గుణ బ్రహ్మాత్మ

స్వరూపమును మనమునందు నిలిపి బ్రహ్మానన్యమగు స్వస్వరూపమున ననవరతము భావించుటయే నిధిధ్యాసము. బ్రహ్మవిద్యయే బ్రహ్మ, భృగువల్లీ ద్వయమునందు వివరింపబడినది. ఉపదేశాత్మకము బ్రహ్మవల్లి; అనుభవాత్మకము భృగువల్లి.

వరుణ పుత్రుడగు భృగువనువాడు "పూజ్యుడవగు ఓ తండ్రీ! నాకు బ్రహ్మము నుపదేశింపుడు" అని తండ్రిని సమీపించి ప్రార్థించెను. అపుడు అన్నము, ప్రాణము, చక్షువు, శ్రోత్రము, మనస్సు, వాక్కు అని వరుణుడు పుత్రునకు ఉపదేశించెను. మరి దేనివలన ఈ భూతములు ఉత్పన్నమగుచున్నవో, ఉత్పన్నములైన ఈ భూతములు దేనిచేత జీవించుచున్నవో, అది బ్రహ్మమని తెలిసికొనుమని అతడు తెలియజెప్పెను. భృగువు ఈ రెండు వాక్యములు తండ్రివలన విని తప మొనరింప అన్నమే బ్రహ్మమని తెలిసికొనెను.

ఏలయన ఈ భూతము లన్నము వలననే పుట్టుచున్నవి. పుట్టిన భూతము లన్నము చేతనే జీవించుచున్నవి. ఇట్లు తెలిసికొనిన భృగువు మరల తండ్రి దగ్గరకు వెళ్ళి తనకు బ్రహ్మము నుపదేశింపుడని కోరెను. తపస్సు చేతనే బ్రహ్మమును తెలిసికొనుమని, తపస్సే బ్రహ్మమని తండ్రి కుమారునకు తెలియజెప్పెను. అతడు తపస్సు చేసి విజ్ఞానము బ్రహ్మమని తెలిసికొనెను. విజ్ఞానము వలననే భూతములు ఉత్పన్నమగుచున్నవి. విజ్ఞానముచే జీవించుచున్నవి. విద్యలలో కెల్లా ఉత్కృష్టము, పవిత్రము, పరమ రహస్యమగు బ్రహ్మవిద్యను సంప్రదాయ సిద్ధముగా తెలిసికొనెను.

## బ్రహ్మ విజ్ఞానానికి అన్నం ద్వారం; అన్నం గురుతుల్యం

అన్నమును నిందింపకూడదు. అది బ్రహ్మవిదునకు వ్రతము. ప్రాణమే అన్నము. శరీమన్నాదము. ప్రాణమునందు శరీరము ప్రతిష్ఠితమై యున్నది. అందువలన అన్నమును పరిహసింపకూడదు. అది వ్రతము. ఉదకములు జఠరాగ్నిచే జీర్ణములై అన్నమగుచున్నవి. ఉదకములందు విద్యుదగ్ని ప్రతిష్ఠితమగుచున్నది. జ్యోతిస్సునందు ఉదకములు ప్రతిష్ఠితములు. అందువలన ఈ యుభయమునగు అన్నమన్నమునందు ప్రతిష్ఠితమగుచున్నది. ఎవడు ఆపోజ్యోతి రూపమగు అన్నమును అన్నమునందు ప్రతిష్ఠితమైన దానినిగా ఉపాసించుచున్నాడో వాడు ప్రతిష్ఠితుడగుచున్నాడు. బ్రహ్మ విజ్ఞానమునకు అన్నము ద్వారమగుటచే అది గురుతుల్యము. దానిని నిందింపరాదు. ఉపాసకుని కిది ఒక వ్రతము.

శరీరము అన్నవికారమగుటచే అన్నమయ కోశమనియూ, ప్రాణాత్మకమగునది ప్రాణమయ కోశమనియూ, మంచి చెడుగులను విచారించునపుడు మనోమయ కోశమనియు, విచారించిన దాని పర్యవసానమును నిశ్చయించినపుడు విజ్ఞానమయ కోశమనియు, నిశ్చయించిన దాని ఫలమగు ఆనందము ననుభవించునపుడు ఆనందమయ కోశమనియు వ్యవహరింపబడుచున్నది.

## అన్నమయ కోశానికి ఆత్మే ప్రాణమయకోశం

బ్రహ్మ భావముచే ఉపాసించుటకై ప్రాణమయ కోశముయొక్క పురుషాకృతిత్వము ప్రదర్శింపబడుచున్నది. ప్రాణమయకోశము శరీర పిండము కంటే అన్యము. సూక్ష్మతరము. అన్నమయ కోశమును తనలో ఇముడ్చుకొనియున్నది. అది వాయుమయము. దానిచే అన్నమయకోశ మాపాదమస్తకము నిండియున్నది. అన్నమయ కోశమున కది ఆత్మ యగుచున్నది. ప్రాణవాయువు లేక అది నిలువ నేరదు. ప్రాణము క్రియాశక్తి కార్యభూతము. ఈ ప్రాణము ప్రాణాపాన వ్యానోదాన సమానములను అయిదు రూపముల మారి ప్రాణమయ కోశమగుచున్నది. అన్నమయ కోశమునకు ప్రాణమయ కోశము ఆత్మయను స్థిరమగు భావనచే అన్నమయకోశము నందాత్మత్వ బుద్ధి తొలగును. మూసలో కరిగించి పోసిన లోహమువలె అన్నమయ కోశము నాశ్రయించి ఆత్మభావముచే వర్ధిల్లుచున్న ప్రాణమయ కోశము కూడా పురుషాకారమున కనిపించుచున్నది.

స్వాహా రూపమగు ప్రాణవృత్తి ప్రాణమయ కోశమునకు శిరస్సు, వ్యాన వృత్తి దక్షిణ పక్షము, అపాన వృత్తి ఉత్తర పక్షము. శరీర మధ్యముననున్న సమాన వృత్తి ఆత్మ. పృథివి దేవతాస్థితి హేతువగుటచే పుచ్ఛమగుచున్నది. పృథివి ప్రతిష్ఠాహేతువు కానిచో ఉదానవృత్తిచే ఊర్ధ్వగమనమొంది బరువుచే క్రింద పడుట సంభవించును. హృద్దేశమునుండి ముఖ నాసికా మూలమున పెకి సంచరించుటచే ప్రాణవృత్తి శిరస్సనియు, అచటనుండి సర్వ నాడులయందును ప్రసరించుటచే వ్యానవృత్తి అనియు,

అధఃప్రసారముచే అపానవృత్తి, పక్షములనియు, ఉదర మధ్యమున నాభి సమీపమున నుండుటచే సమాన మాత్మ యనియు కల్పింపబడినది.

## మంత్రములన్నీ మనోవృత్తి రూపాలే!

మనోమయ కోశమునకు యజుర్వేదము శిరస్సు. ఋక్కులు దక్షిణ పక్షము. సామముత్తర పక్షము. బ్రాహ్మణ మాత్మ. అధర్వణ వేదము ప్రతిష్ఠారూపమగు పుచ్ఛము. యజుర్వేద మంత్రములు యాగాదులందు అధికముగా ఉపయోగింపబడును. వానిచే స్వాహాకార పూర్వకముగా హవిస్సు హోమము చేయబడును. అందువలన యజుర్వేదము ప్రధానమై శిరస్సని వర్ణింపబడినది.

యజుస్సు అనునది ఆ నామముతో వ్యవహరింపబడు శబ్ద విశేషరాశి. శ్రోత్ర ద్వారమున యజుస్సును, ప్రత్యేక భావమున గ్రహింపబడు మనోవృత్తులు యజుస్సనబడుచున్నవి. ఈ విధముననే ఋగ్వేద సామవేదములు కూడా విశిష్ట లక్షణములని గ్రహింపనగును. ఇట్లు మంత్రములన్నియు మనోవృత్తి రూపము లగుచున్నవి. మనో వృత్తులన్నియు ఆత్మ చైతన్య సముపేతములు కనుక యజుర్వేదాది శబ్దవాచ్యమగు శబ్దరాశి ఆత్మ విజ్ఞానమే యగుచున్నది. అందువలన వేదములకు నిత్యత్వము సిద్ధించుచున్నది. శాంతిక పౌష్టికాది ప్రతిష్ఠలకు కారణమగు కర్మము ప్రధానమగుటంజేసి అధర్వణ వేదము పుచ్ఛమని ప్రస్తావింపబడినది. ఇపుడు చెప్పబడుచున్న విజ్ఞానమయుడే మనోవిషయ శరీరములందు పుట్టిన మనోమయాత్మ అగుచున్నాడు.



**12.**

# బ్రహ్మానుభవ ఉపనిషత్

## (సర్వోపనిషత్సారము)

## నిత్య సచ్చిదానంద పరిపూర్ణుడే పరబ్రహ్మ

"ఏకమేవా అద్వితీయం బ్రహ్మ" అని శ్రుతులు ఘోషించుచున్నవి. అనగా పరబ్రహ్మము తప్ప మరియొకటి ఏదియు లేదనియు, సర్వ కాల సర్వావస్థలయందును ఉండువాడనియు అర్థము. ఛాందోగ్యోపనిషత్తు ప్రకారము ప్రథమమున ఒక సత్తు మాత్రముండెను.

అట్లే శాంతం, శివం, అద్వైతం అని మాండూక్యోపనిషత్తు చెప్పెను. ఈ లోకములో వివర్తము పైకి కనుబడునది మాత్రమే! ద్వివిధ రూపములు కాజాలదు. మనకు కనబడు భిన్న భిన్న రూపములన్నియు మనఃకల్పనామయ మగుట వలననూ, వాసనామయ మగుట వలననూ కలుగుచున్నవి. దీపము తెచ్చి చూచిన తక్షణమే పాము అని భ్రమింపబడుచున్న త్రాడు ఎట్లు బయటపడుచున్నదో, అట్లే ద్వంద్వ రహితుడైపరబ్రహ్మ జ్ఞానముతో చూచిన వానికి ప్రపంచము మీద భ్రమ మాయమగుచున్నది. ద్వివిధములుండు చోటునే భయము. చూచువాడు, వినువాడు, చేయువాడు, ఆనందించువాడు తానే అయియుండినపుడు భయమెట్లు కలుగును? నిద్రలో నున్న స్థితిని తెలిసికొందుము. నిద్ర పోవుచున్నప్పుడు ప్రపంచమంతయూ మాయమగుచున్నది గదా! రెండవదనునది లేకయే సర్వత్ర ఏకత్వమునే అనుభవించుచున్నాము.

అట్టి ఏక స్వరూపుడైన పరమేశ్వరునిలో విశ్రమించుచుంటిమి. పరమభక్తుడైన జ్ఞానికి అట్టి అనుభవము కలుగుచున్నది. పరబ్రహ్మము సర్వవ్యాప్తమైన ప్రాణవాయువువలె చిదాకారుడైయున్నాడు. సత్తు, చిత్తు, ఆనందము, పరిపూర్ణము, నిత్యము, అనెడి ఐదు గుణములచే పరబ్రహ్మము బాగుగా కొనియాడబడుచున్నాడు. ఈ గుణములను తలచుకొనుచు పరమాత్మను కనుగొనవలెను. త్రికాలములలో నుండునది సత్; తన్ను తాను తెలిసికొని ప్రకాశింప జేసికొని ఇతరులను ప్రకాశింప జేయునదే చిత్తు. ప్రతి వానికిని పరమ ప్రీతికరమైనది ఆనందము. ప్రాగభావ, ప్రధ్వంసాభావ, అన్యోన్యాభావ, అత్యంతా భావములు నుండి విముక్తి పొందినవాడే నిత్యుడు. ఇచ్ఛారహితుడైన వాడే పరిపూర్ణుడు.

## బంధ విముక్తులకు మనస్సే కారణము

నిప్పున్నచోట చలి లేదు. అంటే నిప్పులో చలి లేదని అర్థము. అదియే అత్యంతాభావము. అనగా నిప్పుకు దూరముగా చలి యున్నదని యున్నది. దీనిని అత్యంతాభావమందురు. కాన శాశ్వతమైనదేది? దేశ కాల వస్తువులను మూడు పరిచ్ఛేదములనుండి

ఏది విముక్తి జెందియుండునో అదియే పరిపూర్ణము. ఈ లోకము మిథ్య. ఇది కంటికి అగుపడునది మాత్రమే. ఈ జీవుడే సత్తు, చిత్తు, ఆనందము, బ్రహ్మము అను నాలుగు విషయములను సమకూర్చుకొనునను భావముతో ఓంకారము ధ్యానింపుము. ఈ క్షణమే ఆత్మను అవగాహన చేసికొనుము. అజ్ఞానము తొలగినపుడు ప్రతి యొక్కని ఆత్మయు తన స్వరూపముతో ప్రకాశించును. మనకు కనబడునదంతయూ ఎడారిలోని ఎండమావుల వంటిదే. వస్తువులకు ఆద్యంతములు కలవు.

ఒక విషయమును గూర్చి తలచుచున్నపుడుగాని, దుఃఖించుచున్నప్పుడుగానీ ఆ విషయమును కోరుచున్నప్పుడుగాని, మనసు బంధములచే కట్టుబడిపోవును. నిశ్చలత్వముతో తలచకుండగనే, విచారించకుండగనే, దుఃఖించకుండగనే మనసు నిలిచినపుడు సంసారబంధములనుండి విముక్తి కలుగును. బంధ ముక్తులకు మనసే కారణము. రాజసమెక్కువగానున్నచో మనస్సు బంధనలో చిక్కుకొని పోవును. సత్వముతో కూడిన మనస్సు విముక్తి జెందును.

స్థూల శరీరముతో ఏకీభవించిన మానవుడు ఒక్కడే ఇంద్రియానందము అనుభవించుటయందు అత్యాకాంక్ష కలిగియున్నాడు. కాయ దృష్టి లేని వానికి కాంక్షలుండవు. సంతోషము, బాధ అనునవి సద్గుణ, దుర్గుణముల వంటివి. రాగ ద్వేషములు అంతఃకరణము యొక్క ధర్మములు. అవి జీవునికి గాని, ఆత్మకు గాని సంబంధించవు. ఆత్మ యెల్లప్పుడు పవిత్రమైనది. అది దేనికి అంటకుండగ నుండును. ముండకోపనిషత్తులోని మూడవ అధ్యాయమందలి మొదటి మంత్రము ఇట్లు చెప్పెను. ఎడబాటులేని రెండు పక్షులు అతి సున్నితమైన సూక్ష్మమైన రెక్కలతో ఒకానొక చెట్టుమీద కూర్చుండియున్నవి. ఒక పక్షి పక్వమైన ఫలమును తినుచుండగా, రెండవ పక్షి రుచియైనను చూడక తటస్థముగా కూర్చుని యుండినది. ఇచట శరీరము వృక్షమునకు, పక్షులు జీవాత్మ, పరమాత్మలకు పోల్చుకొని యున్నవి. ఒక పక్షి ఫలములు రుచి చూచుచున్నదనగా జీవాత్మ సుఖదుఃఖములనెడి కర్మ ఫలముల ననుభవించుచున్నాడు. పరమాత్మ సూక్ష్మముగా సాక్షీభూతముగ నున్నాడు.

పవిత్రమై స్వయంప్రకాశమై సాక్షీభూతముగా నున్న ప్రత్యగాత్మ చీము, రక్తము మొదలైన మాలిన్యముతో చేయబడిన ఈ స్థూల శరీరము ఎట్లు కాగలదు? ఈ శరీరము కేవలము ఆహార నిర్మితమైనది. ఇది యెల్లప్పుడు మార్పు చెందునది. పుట్టక ముందును చచ్చిన తదుపరియు ఈ శరీరము లేదు. ఇది క్షణ భంగురము. దాని యునికి పరమాత్మ అను ప్రాణమున్నంత వఱకే! దేహములో కొన్ని భాగములు తీసివేసిననూ మనిషి జీవించి యుండును. కానీ ప్రాణము పోయిన వెంటనే దేహము ఒక కొయ్యవలె నేలమీద కూలును కాన ఈ శరీరమునే ప్రధానమని తలంచి పోషించుటయందే, దీనిని కాపాడుటయందే, ఇదియే సర్వస్వమని భావించుచు నశింపవలదు. మనోకృతులన్నింటిని సాక్షీభూతముగా జూచుచూ, ఆనందించుచూ, ఆత్మలో లీనము కమ్ము!

## వాసనా నాశమే మనోనిర్మూలన

ఏ స్థితిలో సంకల్ప వికల్పముల తలంపు లేకుండా యుండునో అదియే యోగము. మనస్సు దాని పోకడలు స్వాధీనములో నుంచునది. జీవాత్మ పరమాత్మయొక్క సమభావమే యోగము. యోగ సాధనము వలన ప్రత్యగాత్మ పరమాత్మలో కలసి పోవుచున్నది. యోగమువలన సకల విధములైన బాధలు, కష్టములు నివారణ యగుచున్నవి. ఎవడు నిశ్చలమగు దృఢాభిప్రాయముతో యోగము నభ్యసించునో, తీవ్రమగు వైరాగ్యమును వృద్ధి చేసికొనునో, విముక్తి కొఱకు కష్టించునో వానికి తప్పక యోగములోని పాండిత్యము లభించును.

సచ్చిదానంద స్వరూపుడనగా సత్యము, విజ్ఞానము, ఆనందము అనెడి గుణములు కలవాడు. విజ్ఞాన స్వరూపమనగా ప్రశాంతత, పరిశుభ్రత కల గుణములు కలవాడు. విజ్ఞానమనగా ప్రత్యక్షము ననుభవింపగల ఆత్మ జ్ఞానము. వాడుక భాషయందు విజ్ఞానమనగా భౌతిక శాస్త్రమని పేరు. స్వరూపమునందు వాసనలుండవు. స్వయం ప్రకాశకుడై పరిశుద్ధుడైన పరమాత్మయందు కోరికలెట్లుండును? మనస్సు కోరికల మూట. కోరికలే మనస్సును అపవిత్రము చేయుచున్నవి. వాసనలను నిర్మూలించుటయే మనస్సును నిర్మూలించుట. ఒంటిగా కాలము గడిపిన కొంత కాలమునకు మనోనాశనము కలుగును. అందువలననే యోగులు ఒక గుహయందుండి తపస్సు నాచరింతురు.

## శుభ వాసనలతో అశుభ వాసనలను తీసివేయాలి

వాసనలు రెండు విధములు: శుభమనియు, అశుభమనియు శుద్ధ వాసనలైనచో అతనికి త్వరలో మోక్షప్రాప్తి చేకూరును. జపము, ధ్యానము, సత్కర్మ, దానము, ధర్మము, నిస్స్వార్థసేవ, క్షమ, దయ మొదలగునవి మంచి వాసనలు; అవే శుభ్రమైనవి. క్రోధము, హింస, కామము, దురాశ, స్వార్థము మొదలగునవి అపవిత్ర వాసనలు. లేదా అశుద్ధ వాసనలు. ఒక ముల్లును మరొక ముల్లుతో తీసి రెండును పారవేయు విధముగా, అపవిత్రమైన వాసనలను పవిత్ర వాసనలతో తీసి తదుపరి మంచి వాసనలను కూడ నిర్మూలము చేయవలెను. మోక్ష సాధనకు పవిత్ర వాసనలు తోడ్పడునే కానీ, పవిత్ర వాసనలు బహుజన్మలను బంధించుచున్నవి. జీవన్ముక్తులకున్న పవిత్ర వాసనలను కూడా నిర్మూలనము చేయవలెను.

కాల్చిన గింజవంటివి జీవన్ముక్తుని యందు ఇంద్రియానందము, తృష్ణ, మోహము. ఆత్మ సందర్శనముచే మాయమగుచున్నవి. తనకు ప్రియమైన దేదియూ ఉండదు. ఎచ్చట సూర్యుడస్తమించునో అచట నిద్రించును. తనను గుఱించి ఇతరులకు తెలియకుండునట్లు సంచరించును.

## నిరంతర ఆత్మ చింతన వలన జ్ఞాన ప్రాప్తి

చూచువాడు, చూచినది, ఒకడే అయినప్పుడు పొందెడి ఆనందము తురీయావస్థ అని చెప్పబడును. దాని తరువాత వాని ఆత్మనే ప్రతి చోటనూ చూడగలడు. ఆత్మచింతన వలన క్రమేణా ప్రపంచ వ్యవహారములనుండి బయట పడగలడు. దీనికి ఎక్కువ ఓర్పు, ఎడతెగని సాధన, నిరంతరాధ్యాత్మిక చింతన కావలెను. బలహీనులగు వారిచే ఆత్మ తెలిసికొనబడదు. నిజమైన సాధకుడు తన యావచ్ఛక్తిని ప్రపంచ విషయములనుండియు, ఇంద్రియముల భోగములనుండియు మరల్చి శాశ్వత బ్రహ్మను గురించి తపస్సు చేయుటకై వినియోగించును. తామసిక సంకల్పము కష్టము తెచ్చును. సాత్త్విక సంకల్పము ధర్మము, మోక్షము, జ్ఞానము నిచ్చును. రాజసిక సంకల్పము ప్రాపంచిక ధోరణియందే కాలమును గడుపును. త్రిగుణాత్మకమైన సంకల్పములను విడనాడినపుడే బ్రహ్మస్థానమలంకరించును. బ్రహ్మజ్ఞానిగా మారును.

కొలతకు అలవికాని అగాధమైన లోతుగల బ్రహ్మను, స్వల్పమైన మనస్సుతో ఎట్లు కొలువగలడు? అప్రమేయమనగా వెడల్పు, పొడవు కొలతను తీసికొనుటకు అలవి కానిది. అపరిచ్ఛిన్నంగా అంతులేనిది. అవ్యపదేశ్యమనగా వర్ణింప నలవి కానిది అని అర్థము. ఇట్టి పరమాత్మను సామాన్య భౌతిక ఇంద్రియములచే చూచుటకాని, తెలిసికొనుటకాని దుర్లభము. వేదాంతమందు చెప్పబడిన భాగత్యాగ లక్షణమైన బ్రహ్మను, నేతి-నేతి యనబడు వ్యతిరేక భావ సిద్ధాంతము సూచించిన బ్రహ్మము నేనే! హృదయ గుహయందుండెడి బ్రహ్మను నేనే.

సాధకులు శమము, దమము, తపస్సు, సత్యము, బ్రహ్మచర్యము మొదలైనవాని అభ్యాసము వలన కనుగొన గోరెడి బ్రహ్మము నేనే! దేహము, మనస్సు, ప్రాణము, మేధస్సు కాక మిగిలినది పరబ్రహ్మము. ఇదియే నేతి, నేతి అనెడి సిద్ధాంతము. ఇది వ్యతిరేక సిద్ధాంతము యొక్క తపస్సు. భాగత్యాగ లక్షణములకే జాగ్రతాజాగ్రత లక్షణమని పేరు. జీవ బ్రహ్మ ఏకత్వమును చూపెడి లక్షణము ఇదియే! ''తత్త్వమసి'' మహావాక్యము యొక్క అర్థమును ''సోయందేవదత్తః'' (ఇతడే దేవదత్తుడు) అని చూపించినట్లు పైచెప్పిన సిద్ధాంతము చూపగలుగుచున్నది. జీవునికి కప్పిన ఆవరణము తొలగింపగనే జీవుడే పరమాత్మగా, పరబ్రహ్మముగా చూపబడుచున్నాడు. బ్రహ్మయొక్క స్థానమే జీవాత్మ. (దహరాకాశమనగా హృదయమందుండు ప్రాణ వాయువు; తపస్సు అనగా ఇంద్రియనిగ్రహముచే చేయబడు ఆరాధన, దమమనగా మనోనిగ్రహము)

## ఇంద్రియ నిగ్రహం, వాసనా నిర్మూలన, సత్యాన్వేషణ కావాలి

నేను అను పదము సత్తు చిత్తానందమునకు అన్వయించునపుడు భౌతిక శరీరము ''నేను'' ఎట్లు కాగలదు? అజ్ఞానము వల్లనే భౌతిక శరీరము మహత్తరమనే నేననెడి పరమాత్మగా నెంచుచున్నాము. ఈ అజ్ఞానమే అనేక జన్మల సుఖదుఃఖములకు హేతువగుచున్నది. కావున నేను అనే పదమును వివేకముతో పరబ్రహ్మ కన్వయింప గల్గినచో వెంటనే ఆత్మజ్ఞానము పొందుదురు.

ఆత్మ సాక్షాత్కారమునకు ఇంద్రియ నిగ్రహము, దేహవాసనా నిర్మూలనము, సత్యము చాల అవసరము. శాశ్వత బ్రహ్మయే బుద్ధికి బృహస్పతి, మనస్సునకు మనస్సు, చెవికి చెవి, కన్నుకు కన్ను, సర్వముపైన స్వయంప్రకాశకుడు. అతని తేజస్సు వలననే ఇతరములన్నియు ప్రకాశించుచున్నవి. సంపూర్ణుడయిన పరమాత్మయే అన్నిటికి ఆధారము. బ్రహ్మము మనస్సునందు జ్ఞాన స్వరూపుడుగా నున్నాడు. మనస్సు బుద్ధి యనెడి ఇంద్రియముల నావరించియుండును. అతడు లేనిది మనోబుద్ధు లాలోచింపజాలవు. మరల అందులోనే లయమగుచున్నవి. గడ్డి భూమిలో పుట్టి, భూమిలోనే నశించునట్లు బ్రహ్మయందు బుద్ధి జనించి, బుద్ధియందే నశించుచున్నది. ఎట్లు ఇనుము నిప్పులో పెట్టగానే ఎఱ్ఱరంగు పొందునో, నీరు పాల సాంగత్యము వలన ఎట్లు తెల్లబడునో, అట్లే జ్ఞానస్వరూపుడైన పరబ్రహ్మ సాంగత్యము వలన బుద్ధి కూడ జ్ఞానము పొందుచున్నది.

## ప్రేమ చక్షువును తెరిస్తే బ్రహ్మ దర్శనం సులభం

తల్లి గర్భమందున్న శిశువువలె పరమాత్మ అన్నింటిలోను దాగియున్నాడు. అవ్యక్తము, గోచరము కానిది అయిననూ సామాన్యముగా ప్రపంచ ధోరణిలో "దేవుని చూపుము. అప్పుడు నేను నమ్మెద" అనుచుందురు. కానీ ఇది అసంభవము; భౌతిక చక్షువులతో సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాత్మను చూచుట సంభవము కాదు. అణువులను క్రిములను చూచుటకు కూడ శక్తిమంతమైన భూతద్దముయొక్క సహాయము కావలెను కదా! అట్లే పరమాత్మను చూచుటకు జ్ఞాన చక్షువు లేదా ప్రేమ చక్షువు కావలయును. తద్వారానే చూడ సాధ్యము. నేను ఒక కఱ్ఱతో కొట్టిన నీవు నొప్పిని చూడగలవా? తీపిని తినునపుడు ఆ తీపియొక్క రుచిని చూపగలవా? ప్రేమ, కరుణ, సద్గుణము, నమ్మిక మొదలైనవి కళ్ళకు చూపగలవా? చూపబడవు. అట్లే ప్రేమ హృదయములో నున్నది. పైకి పనుల ద్వారా, మాటల ద్వారా కన్పించుట వలన ఆ వ్యక్తి ప్రేమ కలవాడని ఊహించగలము. అలాగుననే దివ్య బ్రహ్మము యొక్క ఉనికి లేక స్థిరత్వమును అతని ఘనతను బట్టి గ్రహింపగలరు. దివ్య జ్ఞానము, దైవిక సంపద, ప్రకృతి సౌందర్యము దాని సృష్టి వలన అతనిని శ్లాఘించగలము, గుర్తించగలము కూడ. జ్ఞాన లేదా ప్రేమ చక్షువును తెఱచుటకు ప్రయత్నించవలెను. అప్పుడే సర్వత్ర అతిసూక్ష్మముగా నున్న శాశ్వత బ్రహ్మను దర్శించవచ్చును.

## తలంపు ఎట్లనో మనిషి అట్లనే

ఎట్లు చెఱకు రసమందంతటిలోను చక్కెర వ్యాపించియున్నదో అట్లే పరమాత్మ ప్రపంచము యావత్తును వ్యాపించియున్నాడు. పరబ్రహ్మమే ప్రతి జీవరాశికి అంతరాత్మ. అది సర్వత్ర వ్యాపించెడి గుణము కలది. అందువలన తెలిసికొనుట కష్టము. ఆత్మ అనునది రూపరహితమైన అమృతము. అది "అతను" అనగా తనువు లేనిది. అందువలననే పురుషుడు అనబడుచున్నది. ఎపుడు దేహసంబంధము వదలి శుద్ధ అంతఃకరణయందు లీనమగుట సాధ్యమగునో, ఆ క్షణమే శాశ్వతానందము, ఉన్నత ప్రశాంతి, ఉత్కృష్ట విజ్ఞానము పొందగలము. అప్పుడు గాని జనన మరణములనుండి విముక్తి దొరదు.

"ద" అను పదమునందే "దేహ"ము పుట్టినది. "ద" అనగా దహింపబడునది అని అర్థము. సామాన్యముగా మరణానంతరము దహింపబడుచున్నది. కానీ జ్ఞానియందు కారణ సూక్ష్మ శరీరములు మూడు విధముల హృదయ కాష్ఠమునందు దహింపబడును. అనగా ఆధ్యాత్మికము, ఆదిదైవికము, ఆదిభౌతికము అనెడి మూడు హృదయ కాష్ఠములు. ఇవి సూక్ష్మ, కారణ శరీరములను అగ్ని కన్న త్వరలో నశింపజేయగలవు. తలంపు ఎట్లుండునో మనిషి అట్లే మారును. దేహ ధ్యాస కలవారు పామరులుగనే యుందురు. "నేను సత్తు, చిత్తానందుడను" అనెడి ధ్యాస కలవాడు దైవస్వరూపుడుగనే మారును. భౌతికమైన మాంసపు ముద్దయైన శరీరముతో, భౌతిక సూక్ష్మ కారణ శరీరములతోకాని జీవుని ఐక్యము జేయరాదు. ఆత్మను పరమాత్మయందే కలుపవలెను. అపుడే శాశ్వత ఆనందము. కష్టసుఖములు మంచిచెడ్డలు మనస్సుకు చెందినవే కానీ నీకు చెందినవి కావు. నీవు కర్తవు కావు; దాని ఫలము ననుభవించు వాడవు కావు. నీవు స్వతంత్రుడవు. ధర్మము సద్గుణము. అధర్మము దుర్గుణము. ఇవి మనో భావములు. కాన హృదయము నంటుకొనియున్న పాశములను త్రెంచిన వెంటనే మానవుడు శాశ్వత బ్రహ్మమును పొందును. పట్టుపురుగు తన చుట్టునున్న దారముతో తానే చుట్టుకొన్నట్లు మానవుడు తను కోరిన కోరికలతో తాను చిక్కుకొని సంసారి నేననుచున్నాడు.

# అహంభావ రాహిత్యమే విముక్తి.

ఆత్మ యెప్పుడును అసంసారి. దాని స్వభావము పవిత్రత. సందేహము జ్ఞానమునకు శత్రువు. అజ్ఞానమునకు అది తొలి సంతానము. ఎక్కడ “నా” అను అహంభావ ముండదో అక్కడనే విముక్తి. నేను అనెడి అహం యెక్కడ నున్నదో అక్కడే బంధము. మానవుని బంధించునవి ఇవియే! ఆత్మ జ్ఞాన మబ్బుటకు ప్రతిబంధకములు మూడు విధములు: భూతకాల ప్రతిబంధకములు, వర్తమానకాల ప్రతిబంధకములు, భవిష్యత్కాల ప్రతిబంధకములు. వీటిని తగురీతిగా తొలగించుకొనవలెను. జీవన్ముక్తుడు ఈ మూడింటిని చింతించడు. చూచువాడు, చూడబడునది, చూపు అనెడి భేదములను వదలిపెట్టి వాని సమైక్యతతో సర్వాంతర్యామియై స్వప్రకాశుడైన పరమాత్మనే ధ్యానింపవలెను. త్రిపుటి మనఃకల్పితము. త్రిపుటిలేని సాధకుడు జీవన్ముక్తుడు. అట్టివానికి బ్రహ్మాకారము ఎక్కడ చూచినను కనిపించును.



# ప్రచురణల విభాగంయొక్క కార్యకలాపాలు

రెండు భక్త సహాయక విభాగములు (ప్రశాంతి నిలయంలో ఒకటి బెంగళూరులోని బృందావన్‌లో మరొకటి), ప్రచురణల విభాగము మరియు మీడియా విభాగము మొత్తం నాలుగు విభాగములతో కూడిన శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు 2009 జనవరి 1వ తేదీనుండి పనిచేయటం ప్రారంభించింది.

1. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే భక్తుల ఉపయోగార్థం విద్య, మత మరియు ఆధ్యాత్మికపరమైన సాయి సాహిత్యము, ఆడియో, వీడియో సీడీలు, ఫొటోలు, కేలండర్లు, డైరీల ప్రచురణ మరియు పంపిణీ.

అన్ని ప్రచురణలూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యసందేశము మరియు వారు ప్రవచించే మానవతా విలువల ఆధారంగా రూపొందింపబడినవి.

2. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు ప్రారంభించిన 'సనాతన సారథి' ఆధ్యాత్మిక మాస పత్రిక తెలుగు, ఇంగ్లీషు భాషలలో ప్రచురణ మరియు పంపిణీ. 2011 నుండి ఈ పత్రికయొక్క ఇ-కాపీలు www.sanathanasarathi.org. వెబ్‌సైటుద్వారా (తెలుగు కాపీ pdf ఫార్మాట్‌లోనూ, ఇంగ్లీషు కాపీ epub ఫార్మాట్‌లోనూ) ప్రతి నెలా లభ్యమవుతున్నాయి.

3. ప్రశాంతి నిలయంలో జరిగే వివిధ విశేష కార్యక్రమములు మరియు ఉత్సవముల వివరాలు ఎప్పటికప్పుడు వెల్లడించే వెబ్‌సైటు నిర్వహణ మరియు 'సాయి స్పిరిచువల్ షవర్స్' ఉచిత 'ఇ న్యూస్‌లెటర్' ప్రచురణ.

4. ఆధ్యాత్మికత, మత సమైక్యత, విద్య మరియు మానవతా విలువలపై సెమినార్లు, సదస్సుల నిర్వహణ.

5. సందర్శకుల ఉపయోగార్థం ఆధ్యాత్మికత, మత సంబంధమైన గ్రంథాలను అధిక సంఖ్యలో కలిగిన లైబ్రరీ మరియు రీడింగ్ రూమ్ నిర్వహణ.

# ప్రచురణల విభాగము ప్రచురించిన ఇతర ఇంగ్లీషు ఈ-పుస్తకములు

1. సాయి సత్యసఖా, 2. సమ్మర్ షవర్స్ ఇన్ బృందావన్, 1972

3. సత్యోపనిషత్ మొదటి భాగం, 4. సత్యోపనిషత్ రెండవ భాగం

5. గురుదేవ్, 6. నామస్మరణ

8. భక్తి అండ్ హెల్త్, 8. లైఫ్ ఇజ్ లవ్, ఎన్జాయ్ ఇట్

9. లైఫ్ ఇజ్ ఎ ఛాలెంజ్, మీట్ ఇట్, 10. లైఫ్ ఇజ్ ఎ డ్రీమ్, రియలైజ్ ఇట్

11. భగవాన్ అండ్ భక్త, 12. బాడీ అండ్ మైండ్

13. మై డియర్ వన్స్, 14. సేవాదళ్

15. సైలెన్స్, 16. సఫరింగ్

17. సరెండర్, 18. ఆత్మ

19. డూ యూ నో, 20. గోపికాస్ ఆఫ్ బృందావన్

21. గ్రాటిట్యూడ్, 22. మై బిలవడ్ వన్స్

23. ఓన్లీ లవ్, 24. ప్యూరిటీ

25. మెమోయిర్స్ ఆఫ్ ఎ సాయి స్టూడెంట్, 26. ఎ జర్నీ టు సెల్ఫ్-పీస్

27. ధర్మ, 28. గురు

29. కర్మ, 30. లైఫ్

31. మెడిటేషన్, 32. పీస్

33. సింపిల్ ట్రూత్స్, 34. నామ మహిమ

35. డివైన్ వైబ్రేషన్స్, 36. గైడ్లైన్స్ టు ఏక్టివ్ వర్కర్స్

**37. శ్రీ సత్యసాయి ఆనందదాయి, 38. ట్రూత్, ఆస్పీషయస్‌నెస్, బ్యూటీ**

**39. సాయిబాబాస్ మహావాక్య ఆన్ లీడర్‌షిప్, 40. పాత్ టు పీస్ – ప్రేయర్స్ ఫర్ డెయిలీ లైఫ్**

## ప్రచురణల విభాగముల సంబంధిత వెబ్‌సైట్లు

1. శ్రీ సత్యసాయి పబ్లికేషన్స్ – www.srisathyasaipublications.com

2. సనాతన సారథి – www.sanathanasarathi.org

3. సాయి రిఫ్లెక్షన్స్ – www.saireflections.org

4. ది ప్రశాంతి రిపోర్టర్ – www.theprasanthireporter.org

## పుస్తకముల విషయమై మమ్మల్ని సంప్రదించుటకు సంబంధిత వెబ్‌సైట్లు

1. ఫేస్‌బుక్ – www.facebook.com/sssstpd

2. ట్విట్టర్ – www.twitter.com/sssstpd

3. పింటెరెస్ట్ – www.pinterest.com/sssstpd

4. షెల్ఫరి – www.shelfari.com/sssstpd

5. గుడ్‌రీడ్స్ – www.goodreads.com/sssstpd

6. అమాజాన్ – www.amazon.com/author/sssstpd

7. స్మాష్‌వర్డ్స్ – www.smashwords.com/profile/view/sssstpd

# సనాతన సారథి కొరకు

www.sanathanasarathi.org వెబ్‌సైట్‌లో మీరు పేపర్‌బేక్ మరియు ఈ-వెర్షన్స్ సనాతన సారథి మాసపత్రికలను చందాదారులుగా బుక్ చేసుకోవచ్చు.

http://bit.ly/sarathienglish and http://bit.ly/sarathitelugu. వెబ్‌సైట్‌లో మీరు సనాతన సారథి మాసపత్రిక (ఇంగ్లీషు మరియు తెలుగు) నెలవారి సంచికను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

శ్రీ సత్యసాయి

సాధనా ట్రస్టు

పబ్లికేషన్స్ విభాగం